Pubilshed from Tirupathi

PRGI NO : APTEL/25/A2316

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com





తిరుపతి TIRUPATHI | సంపుటి : 01 Vol.No : 01 | సంచిక : 211 Issue No : 211 | మంగళవారం Tuesday | ఏప్రిల్ 14, 2026 14 APRIL 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి Editor : Ankireddypalle Ramamohan Reddy | పేజీలు : 12 Pages 12 | వెల : 3 రూ Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana

# శరవేగంగా అనుమతులు..

▸ మరింత సరళంగా నిబంధనలు



**బ్రిటీష్ కాలం నాటి చట్టాల తొలగింపు-అవసరమైతే ఆర్డినెన్స్**

▸ పారిశ్రామిక ప్రగతికి మే కల్లా డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలు ▸ స్టీల్ సెక్రటరీ సందీప్ పొండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం

▸ రాష్ట్రంలో అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ విధానాలపై సీఎం సమీక్ష

**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:** రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు విషయంలో ఎలాంటి జాప్యం జరగ్గకుండా ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను మరింత సరళతరం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అనవసరపు చట్టాలను, నిబంధనలను తొలగించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై ముఖ్యమంత్రితో చర్చించేందుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పొండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం రాష్ట్ర సచివాలయానికి వచ్చింది.

ఈ బృందంతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం పెంచడం... అనుమతుల సులభతరం చేయడం... అనవసరపు నిబంధనల సడలింపుపై చర్చించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సీఎం చంద్రబాబుకు స్టీల్ సెక్రటరీ సందీప్ పొండ్రిక్ వివరించారు.

2 లో..



## బీహార్ కొత్త సిఎంగా సామ్రాట్ చౌదరి

పాట్నా : బిహార్ కొత్త సీఎంగా బీజేపీ నేత సామ్రాట్ చౌదరి ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్.. తదుపరి ముఖ్యమంత్రి ఆయనే అని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. నితీష్‌కుమార్ ఏప్రిల్ 10న రాజ్యసభ సభ్యునిగా ప్రమాణస్వీకారం చేశారు. దీంతో ఆయన సిఎం పదవిలో కొనసాగే అవకాశం లేదు. నితీష్ మంగళవారం ఏప్రిల్ 14న ఉదయం 11 గంటలకు పాట్నాలో క్యాబినెట్ మీటింగ్ నిర్వహించబోతున్నారు. ఈ సమావేశం అనంతరం ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేస్తారు. అనంతరం ఎన్‌డీయే శాసనసభ్యుల సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో ఎన్‌డీయే నూతన శాసనసభ పార్టీ నేతను ఎన్నుకుంటారు.

⏭ వివరాలు 2లో..

# మహిళా రిజర్వేషన్ బిల్లు..

**21వ శతాబ్దపు నిర్ణయాల్లో కీలకమైనది : ప్రధాని మోడీ**



**న్యూఢిల్లీ :** చట్టసభలల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెచ్చిన 'నారీ శక్తి వందన్ అధియాన్'ను అమలు చేసేందుకు తీసుకున్న నిర్ణయం 21వ శతాబ్దపు భారత్ తీసుకున్న అతిపెద్ద నిర్ణయాలలో ఒకటని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. నేడు న్యూఢిల్లీలో విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్'లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి ప్రస్థానంలో ఈ కీలక ఘట్టాల నడుమ భారతదేశం 21వ శతాబ్దపు అతిపెద్ద నిర్ణయాలలో ఒకదాన్ని తీసుకోబోతోంది.

21వ శతాబ్దపు ముఖ్యమైన నిర్ణయాలలో ఇది కూడా ఒక ముఖ్యమైన నిర్ణయం అని చెబుతున్నాను. ఈ నిర్ణయం నారీశక్తికి అంకితం చేయబడింది. గత దార్శనికతను వాస్తవ రూపంలోకి తీసుకొచ్చే, అలాగే సామాజిక న్యాయం, పరిపాలన, నిర్ణయాలలో కీలక భాగంగా మార్చే ఒక చర్యగా ప్రధాని మోడీ దీనిని అభివర్ణించారు. ఈ నిర్ణయం మహిళా శక్తికి, మహిళా శక్తి గౌరవానికి అంకితం చేయబడింది. మన దేశ పార్లమెంటు ఒక కొత్త చరిత్రను సృష్టించేందుకు దగ్గరలో ఉంది. గత భావనలను సాకారం చేసే ఒక కొత్త చరిత్ర అది. భవిష్యత్తు తీర్మానాలను నెరవేర్చేది. ఇది సమానత్వంతో కూడిన భారతదేశం కోసం ఒక తీర్మానం. ఇక్కడ సామాజిక న్యాయం కేవలం ఒక నినాదంగా కాకుండా మన పని సంస్కృతిలో, మన నిర్ణయ ప్రక్రియలో ఒక సహజ భాగంగా ఉంటుంది. రాష్ట్ర శాసనసభల నుండి దేశ పార్లమెంటు వరకు దశాబ్దాల నిరీక్షణకు తెరదించే సమయం ఆసన్నమైంది.

2 పేజీలో..



## లోక్‌సభకు సభ్యులందరూ హాజరావ్వాలి

విప్ జారీ చేసిన కాంగ్రెస్

2 లో



## బిజెపి ప్రభుత్వ హయాంలో అన్యాయం పరాకాష్టకు చేరింది

▸ అఖిలేష్ యాదవ్

2 లో



## చంద్రబాబు అవినీతి దాహం వల్ల రాష్ట్రానికి అమరావతి మోయలేని భారంగా మారింది

▸ పేర్ని నాని

2 పేజీలో..



## జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని బీజేపీ చూస్తోంది

**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

- మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరు మద్దతిస్తారన్న రేవంత్ రెడ్డి
- లోక్ సభ సీట్ల పెంపుపై అఖిలపక్ష భేటీలో చర్చించాలని సూచన
- మహిళా రిజర్వేషన్ల పేరిట జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లు పెంచాలని చూస్తున్నారని ఆరోపణ

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్ :** జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని బీజేపీ చూస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ఆయన ట్వీట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే మహిళా బిల్లుకు ప్రతి ఒక్కరు మద్దతిస్తారని ఆయన పేర్కొన్నారు. కానీ లోక్ సభ సీట్ల పెంపు విషయంలోనే భిన్నాభిప్రాయాలు ఉన్నాయని తెలిపారు. లోక్ సభ సీట్ల పెంపు విషయంపై అఖిల పక్ష భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు.

- మిగతా 2లో..

# అందరికీ ఆహార భద్రత



▸ అందుబాటులోకి 62 గ్రామీణ అన్న క్యాంటీన్లు ▸ 269కి పెరగనున్న క్యాంటీన్ల సంఖ్య

▸ ఇప్పటికే 207 క్యాంటీన్ల ద్వారా ప్రతీ రోజు 2.10 లక్షల మందికి భోజనం

▸ ఈనెల 15న ధరణికోటలో అన్నక్యాంటీన్‌ను ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

**ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:** కార్మికులు, కూలీలు, గ్రామీణులు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న సంకల్పంతో 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం... తాజాగా మరికొన్ని అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకొస్తోంది. రూ.5లకే పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పిన సర్కార్... ఆ హామీని ఆచరణలో పెడుతోంది.

2 పేజీలో..

## తండ్రి శవం ఉండగానే.. సీఎం కుర్చీ కోసం జగన్ సంతకాలు సేకరించారు

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- జగన్ కు అధికార దాహం ఎక్కువన్న అచ్చెన్నాయుడు
- అమరావతి విషయంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపాటు
- దిగజారుడు రాజకీయాలతో జనాలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని విమర్శ



**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి :** వైసీపీ అధినేత జగన్ రాజకీయ శైలిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జగన్‌కు అధికార దాహం ఎక్కువని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన సమయంలో, తండ్రి శవం

- మిగతా 2లో..

# అమరావతి బిల్లుకు రాజముద్ర..

**రాష్ట్రపతి ముర్ముకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి లోకేశ్, ఎంపీలు**

▸ ఇటీవల పార్లమెంటు ఉభయ సభల్లో అమరావతి చట్టబద్ధత బిల్లుకు ఆమోదం

▸ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి కృతజ్ఞతలు తెలిపిన ఏపీ మంత్రి నారా లోకేశ్ భేటీ

▸ రైతుల త్యాగాలను, సీఎం చంద్రబాబు నాయకత్వాన్ని రాష్ట్రపతి ప్రశంసించారని లోకేశ్ వెల్లడి ▸ అమరావతి ప్రస్థానంపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను రాష్ట్రపతికి అందజేత

**ఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజముద్ర వేయడం చరిత్రాత్మ కమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షను నెరవేర్చిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపేం దుకు, మంత్రి లోకేశ్ నేతృత్వంలోని ఎన్డీఏ ఎంపీల బృందం సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ చారిత్రక నిర్ణయంతో "మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్-మా రాజధాని అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వంగా చెప్పుకునేలా చేశారని వారు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్రపతికి వివరించారు. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు.



అమరావతికి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీయేనని, 2024లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన నాయకత్వంలోనే పనులు తిరిగి ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. అనంతరం, అమరావతి చరిత్ర, సంస్కృతి, రైతుల ఉద్యమం, మాస్టర్ ప్లాన్, పర్యావరణ హిత నిర్మాణాల విశేషాలతో కూడిన పుస్తకాన్ని రాష్ట్రపతికి అందజేశారు.

**రైతుల త్యాగఫలం అమరావతి :** రాజధాని నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుతో రైతులు కేవలం 58 రోజుల్లో 34 వేల ఎకరాల భూములను స్వచ్ఛందంగా త్యాగం చేశారని

2 పేజీలో..

# సంపాదకీయం

## అంబేద్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి !



అంబేద్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సార్వభౌమాధి కారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్నటువంటి ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్ ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒకానొక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితో ద్ధారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజీ సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణించేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్తాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేద్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు.క్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేల మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు. కానీ అంబేద్కర్ ఆ సభలో దానికి వ్యతిరేకంగా పోరాడి ఆ చెరువులో నీటిని తాగడానికి అనుమతి వచ్చేలా చేసారు. కొల్హపూర్ మహారాజ్ సాహు మహరాజ్ అస్పృశ్యత , అంటరానితనాన్ని నివారించడానికి కృషి చేస్తున్నారు అని తెలుసుకుని ఆయన సహకారంతో మూగ వాళ్ళకి నాయకుడు అనే అర్థం వచ్చేలా 'మూక్ నాయక్' అనే పత్రికను అలాగే బహిష్కృత్ భారత్, జనతా , ప్రబుద్ధ భారత్ అనే పత్రికలూ నడిపారు. ఆితులకు బడులలోకి, గుడులలోకి వెళ్ళడానికి అనుమతి పొందేలా ఉద్యమాలు చేపట్టి విజయం సాధించారు. ఆయన అంత స్థాయికి ఎదిగారు అంటే కారణం చదువు. ఃూబట్టే ఆయన అందరికి చదువు అందాలని కృషి చేసారు. అయితే సంపద కోసమో, అధికారం కోసమో పోరాటం చేయలేదు అట్టడుగు వర్గాల స్వేచ్ఛ కోసం ఆయన పోరాడేవారు. శోధించు, సమీకరించు, పోరాడు అనే సిద్ధాంతంతో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, కులమాత బేధాలు లేని సమాజం కోసం కృషి చేసేవారు.స్వాతంత్రం వచ్చిన తరువాత అంబేద్కర్ కి కేంద్ర మండలిలో మొట్ట మొదటి న్యాయశాఖ మంత్రి గా పదవి వచ్చింది. అంతేకాదు భారత దేశపు రాజ్యాంగాన్ని రాసే అవకాశం దక్కింది. అయితే రాజ్యాంగం రచించడానికి నియమించిన సభ్యులలో ఒకరు రాజీనామా చేయడం, మరొకరు మరణించడం, కొంతమంది అమెరికాలో ఉండిపోవడం, మరికొంతమంది రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులవడం ఇలా రకరకాల కారణాల వలన భారత రాజ్యాంగం రచించే బాధ్యతంతా అంబేద్కర్ మీద పడింది. దాంతో ఆయన రాత్రీపగలు అనే తేడా లేకుండా నిరంతరం రాజ్యాంగ రచనలోని ఉండేవారు.

తరువాత కొద్ది రోజులకి అనారోగ్యం కారణంగా 1956 డిసెంబర్ 6 వ తేదీన అంబేద్కర్ మరణించారు. ఆయన మరణించినగాని ఆయన కృషి ఇప్పటికీ ఎంతో మంది జీవితాలలో వెలుగుని నింపుతుంది. ఒకవేళ ఆయన పూనికుని ఉండకపోతే ఈనాటికి బడుగు బలహీన వర్గాల జీవితాలు ఇంకా అలాగే ఉండిపోయే వేమో.

## అందరికీ ఆహార భద్రత

మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయగా 3 క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా 62 క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. రెండవ విడత అన్నక్యాంటీన్లను ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో ప్రారంభిస్తారు

**రూ.5లతో రుచిగా... శుచిగా ఆహారం**

గత ప్రభుత్వం కక్షగట్టి మూసివేసిన అన్నక్యాంటీన్లను కూటమి అధికారంలోకి వచ్చాక పున: ప్రారంభించింది. ఈనెల 15వ తేదీన ప్రారంభించబోయే 62 క్యాంటీన్లతో ఈ సంఖ్య 269 కు పెరుగనుంది. రుచి, శుచితో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పేదలకు ప్రభుత్వం అందిస్తోంది. క్యాంటీన్ల పున:ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా పేదలు 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఒక్కో అన్న క్యాంటీన్‌లో సగటున రోజుకు 1,013 మంది చేసే భోజనాలకు రూ.26,250 ఖర్చు అవుతోంది. 207 అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతుండగా... సబ్సిడీ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.243 కోట్లు వెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసే గ్రామీణ అన్న కాంటీన్ల సబ్సీడీకి ఏడాదికి రూ.58 కోట్లు వ్యయం అవ్వనుంది.

**ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన వివరాలు**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పల్నాడు జిల్లా, పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి ఒంటిగంటకు ధరణికోటకు చేరుకుంటారు. 01.30 గంటలకు అన్నాక్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తారు. కార్యక్రమాన్ని ముగించుకుని 02.45 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.

# శరవేగంగా అనుమతులు...

ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలకు అనుమతుల్లో జాప్యం తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాలను... రూపొందించుకున్న ప్రణాళికలను ఆయా శాఖల ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన సంస్కరణలు, కేంద్రం సూచించిన మార్పులు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఫేజ్-1 ఎంత వరకు అమలు చేశారని... ఫేజ్-2లో ప్రస్తుత స్థితి గురించి ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో మొత్తం 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామని, ఇక ఫేజ్-2లో 28 ప్రాధాన్య అంశాలు నిర్దేశించుకున్నట్టు అధికారులు చెప్పారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యం చేరుకుంటామన్నారు.

**సులభంగా అనుమతుల ప్రక్రియ**

పరిశ్రమలకు అనుమతుల ప్రక్రియలో ఉన్న క్లిష్టతను తగ్గించి, వేగం పెంచాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. బ్రిటీష్ కాలం నాటి చట్టాలు తొలగింపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100లోపు తీసుకురావాలని, అనుమతులకు లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే సమయంలో ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో రాజీ పడొద్దని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అనవసర వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ వంటి వాటిని పూర్తిగా తొలగించాలని సూచించారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యాపారాలకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా... వ్యవస్థను తీర్చిదిద్దాలన్నారు. ఇక ఫైర్ సేఫ్టీ అంశంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన, సరళమైన నిబంధనలు అమలు చేయాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని, ఫేజ్-2 అమలు అనంతరం పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన సమయం కనీసం 40 శాతం వరకు తగ్గేలా కార్యాచరణను రూపొందించాలని పేర్కొన్నారు.

**ఒకే శాఖలోని అన్ని అనుమతుల విలీనం**

డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుకు అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం 82 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉందని... ఆ సంఖ్యను దశలవారీగా 57 వరకు తగ్గించాలని సీఎం సూచించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి కీలక అనుమతులు 30 వరకు ఉన్న ప్రక్రియలను 18కు తగ్గించేలా చూడాలన్నారు. ఒకే శాఖలో ఉన్న అనుమతులను విలీనం చేయడం, పర్మిషన్లు కాకుండా... ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే విధానం వంటి వాటిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వినియోగానికి సంబంధించిన క్లిష్టతను తగ్గించేందుకు భూ వినియోగ మార్పు అవసరాన్ని తొలగించడం, నాలా చట్టాన్ని రద్దు చేయడం వంటి నిర్ణయాలు ఇప్పటికే తీసుకోగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేసేలా లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమల పార్కులు, క్లస్టర్లలో భూమి వినియోగాన్ని మరింత సులభతరం చేసి, పెట్టుబడిదారులకు వేగంగా భూమి కేటాయించే విధానాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా అన్ని అనుమతులను ఇవ్వాలనే దిశగా ఆలోచన చేయాలని సీఎం సూచించారు. ఫైర్ సేఫ్టీ, పర్యావరణం, విద్యుత్, పర్యాటకం, విద్య, ఆరోగ్య రంగాల్లో కూడా అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

**అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించే అవకాశం**

నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్రానికి అనుకూలమైన సులభమైన ఫైర్ సేఫ్టీ నిబంధనలను తీసుకురావడం, పర్యావరణ అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయడం, విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన అందించడం వంటి చర్యలు అమలులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి అన్నారు. ప్రత్యేకంగా ఎంఎస్ఎంఈ రంగంలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించే అవకాశం కల్పించడం, నిర్దిష్ట కాలానికి తనిఖీలు తగ్గించడం వంటి సంస్కరణలతో పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించే దిశగా పని చేయాలని సీఎం సూచించారు. ఇక అనుమతులకు సంబంధించిన పూర్తి ప్రక్రియను డిజిటలైజ్ చేయడం కూడా కీలక అంశమేనని సీఎం చెప్పారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకూ అన్ని సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకువస్తే దరఖాస్తుదారులకు చాలా వరకు పని భారం తగ్గుతుందని... అంతే కాకుండా ట్రాకింగ్, పారదర్శకతను పెంచినట్టు అవుతుందని సీఎం అధికారులకు వివరించారు. మీ సేవా, సింగిల్ డెస్క్ పోర్టల్, వాట్సాప్ గవర్నెన్స్ మన మిత్ర వంటి వ్యవస్థల ద్వారా ప్రజలకు, వ్యాపారులకు సులభంగా సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

**డి-రెగ్యులేషన్‌లో కేంద్రం కంటే మెరుగ్గా రాష్ట్రం**

డి-రెగ్యులేషన్ విషయంలో కేంద్రం ప్రతిపాదించిన అంశాల కంటే మెరుగ్గా ఏపీ పని చేస్తోందని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సీఎం చంద్రబాబుతో అన్నారు. నిర్దిష్ట గడువులోగా ఏపీ ఫేజ్-2ను అమలు చేస్తుందన్న నమ్మకం తమకు ఉందని పౌండ్రిక్ అభిప్రాయపడ్డారు. నేషన్ ఫస్ట్ నినాదంతో తాము పని చేస్తున్నామని.. ఇలాంటి సంస్కరణల ద్వారా భారత దేశ నిర్మాణం జరుగుతుందని సీఎం చంద్రబాబు చెప్పారు. తాము పారిశ్రామిక రంగంలో అభివృద్ధి సాధించేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మారామని సీఎం వెల్లడించారు. అటవీ చట్టాలను వీలైనంత సరళీకరించాలంటూ కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3ను అమలు చేస్తున్నారా..? అని ముఖ్యమంత్రి స్టీల్ సెక్రటరీని అడిగారు. జూన్ నెల నుంచి ఆ పని మీద ఉంటామని పౌండ్రిక్ తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్-2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను ఇప్పటికే తాము వినియోగిస్తున్నామని పౌండ్రిక్‌కు సీఎం వివరించారు.

## అమరావతి బిల్లుకు రాజముద్ర..

లోకేష్ రాష్ట్రపతికి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వారిపై దాడులు జరిగినా, అక్రమ కేసులు బనాయించినా వెనకడుగు వేయకుండా శాంతియుతంగా ఉద్యమం కొనసాగించారని వివరించారు.

**పోరాడితేనే చిరస్థాయిగా నిలుస్తుంది: రాష్ట్రపతి :** మంత్రి లోకేశ్, ఎంపీల బృందం చెప్పిన విషయాలను సావధానంగా విన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అమరావతి చట్టం తన హయాంలో రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంపై ప్రేమతో రైతులు తమ భూములను త్యాగం చేయడాన్ని ఆమె ప్రశంసించారు. "పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని, ఆయన దూరదృష్టితో రాష్ట్రాన్ని, రాజధానిని అద్భుతంగా



అభివృద్ధి చేస్తారన్న విశ్వాసం తనకుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనించాలని, రాజధాని నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని రాష్ట్రపతి ఆకాంక్షించారు.

## తండ్రి శవం ఉండగానే.. సీఎం కుర్చీ కోసం జగన్ సంతకాలు సేకరించారు

మొదటి పేజీ తరువాయి

పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం జగన్ సంతకాలు సేకరించిన చరిత్రను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మర్చిపోరని ఎద్దేవా చేశారు.

జగన్ కి ఉన్న అధికార పిపాసను చూసే గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని, అందుకే వైసీపీని కేవలం 11 సీట్లకు పరిమితం చేసి ఆ పార్టీ అడ్రస్ గల్లంతు చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం అమరావతిని రాష్ట్రానికి ఒక 'అక్షయపాత్ర'లా తీర్చిదిద్దుతుంటే... జగన్, ఆయన అనుచరులు మాత్రం దానిని అవినీతికి 'కామధేనువు'గా చిత్రీకరిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు ఇచ్చిన తీర్పుతో తగిలిన దెబ్బ ఇంకా పచ్చిగానే ఉందని, ఇప్పటికైనా అబద్ధాలు ప్రచారం చేయడం ఆపకపోతే భవిష్యత్తులో మరింత దారుణమైన పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జగన్ తన దిగజారుడు రాజకీయాలతో ప్రజలను మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని, కానీ ఏపీ ప్రజలు ఆయన మాటలను నమ్మే స్థితిలో లేరని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదని ఆయన ఈ సందర్భంగా ధ్వజమెత్తారు.

## బిజెపి ప్రభుత్వ హయాంలో అన్యాయం పరాకాష్టకు చేరింది

**నోయిడా :** నోయిడా ఫేజ్ 2లోని హోసియరీ కాంప్లెక్స్‌కు చెందిన కార్మికులు తమ జీతాన్ని పెంచమని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసన చేపట్టారు. వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చుకునేందుకు శాంతియుతంగా నిరసన చేస్తున్న కార్మికుల్ని పోలీసులు అడ్డుకున్నారు. మహిళా ఉద్యోగినిపై లాఠీఛార్జీ ప్రయోగించడంపై నిరసనకారులు పోలీసు వాహనాలకు, ప్రభుత్వ వాహనాలకు నిప్పుపెట్టారు. ఈ ఘటనపపై సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ రాష్ట్ర యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రంలో అన్యాయం పరాకాష్టకు చేరిందని ఆయన తీవ్రంగా



ఆరోపించారు. రాష్ట్రంలో అన్ని రకాల అన్యాయాలు జరుగుతున్నాయి. ఆర్థికంగా అన్యాయం జరుగుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం వల్ల అన్యాయం జరుగుతుంది. అధికమవుతున్న నిరుద్యోగం వల్ల అన్యాయం జరుగుతోంది. ఈరోజు నోయిడాలో మనం చూసింది ఏమిటంటే.. కార్మికులు తమ హక్కులను పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు అని అఖిలేష్ ఎత్తిచూపారు. ఈ పరిస్థితికి పరిపాలన, రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అఖిలేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాల్లో కార్మికుల జీతాలు పెంచినప్పుడు, ఉత్తర ప్రదేశ్‌లో ప్రభుత్వం ఎందుకు ఉపశమనం కల్పించడం లేదు అని అఖిలేష్ రాష్ట్ర ప్రభుతాన్ని ప్రశ్నించారు.

## చంద్రబాబు అవినీతి దాహం వల్ల రాష్ట్రానికి అమరావతి మోయలేని భారంగా మారింది: పేర్ని నాని

- రాష్ట్రం దివాలా తీసేలా రాజధానిని నిర్మిస్తున్నారని పేర్ని నాని విమర్శ
- మావిగన్ తో తక్కువ ఖర్చుతో రాజధానిని నిర్మించుకోవచ్చని వ్యాఖ్య
- చంద్రబాబుకు విశ్వసనీయత లేదని ఎన్టీఆర్ అన్నారన్న పేర్ని నాని

**ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి** :ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరు, ఆయనకున్న అవినీతి దాహం వల్ల రాష్ట్రానికి అమరావతి ఒక మోయలేని భారంగా మారిందని మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఏపీ రాజధాని అంశంపై ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు ప్రాంతాల మధ్య రాజధాని ఏర్పాటు చేస్తే వచ్చే ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు తన స్వార్థం కోసం రాష్ట్రాన్ని దివాలా తీసేలా రాజధానిని నిర్మిస్తున్నారని ఆరోపించారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న మంత్రులతో వైసీపీ అధినేత జగన్ ను బూతులు తిట్టిస్తూ, అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని మండిపడ్డారు.రాజధాని అనేది సిరిసంపదలను ఇచ్చేలా ఉండాలి తప్ప, అప్పుల పాలు చేసేలా ఉండకూడదని పేర్కొన్నారు. 'మావిగన్' అనే ప్రతిపాదనతో తక్కువ ఖర్చుతో రాజధానిని నిర్మించుకోవచ్చని, దీనిపై ప్రజలు ఆలోచించాల్సిన అవసరం ఉందని సూచించారు. చంద్రబాబుకు విశ్వసనీయత లేదని గతంలో ఎన్టీఆరే స్వయంగా అన్నారని గుర్తుచేశారు. వెన్నుపోటు రాజకీయాలతో, ఎమ్మెల్యేలను కాసులతో కొనుగోలు చేసిన చరిత్ర చంద్రబాబుదని దుయ్యబట్టారు. గతంలో ఆయన కేబినెట్‌లోని మంత్రులే ఆయనను తీవ్రంగా విమర్శించారని అన్నారు. చంద్రబాబు అంతులేని అవినీతితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని పేర్ని నాని హెచ్చరించారు. అమరావతి విషయంలో ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు భవిష్యత్తులో రాష్ట్రానికి తీరని నష్టం కలిగిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## బీహార్ కొత్త సిఎంగా సామ్రాట్ చౌదరి

ఆయనే బీహార్ ముఖ్యమంత్రిగా ఎన్నికవుతారు.కాగా, తదుపరి సిఎం సామ్రాట్ చౌదరినే అని అందరూ అనుకుంటున్నారు. ఆయన బీజేపీలో సీనియర్ నేత. ప్రస్తుత బిహార్ ఉపముఖ్యమంత్రి. 2023లో బిహార్ బీజేపీ అధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత కొంతకాలానికి డిప్యూటీ సీఎం అయ్యారు. ఓబీసీలోని కొయేరి సామాజికవర్గానికి చెందిన సామ్రాట్ చౌదరినే బీజేపీ అధిష్టానం సీఎంగా ఎంపిక చేసిందని తెలుస్తోంది.

## మహిళా రిజర్వేషన్ బిల్లు..

అది ఏప్రిల్ 16,17,18 తేదీలు. ప్రజాస్వామ్య వ్యవస్థలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలనే ఆవశ్యకతను దశాబ్దాలుగా ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. ఈ చర్చ దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతుంది. ఇందులో అన్ని పార్టీల, అనేక తరాల కృషి ఉంది. ప్రతి పార్టీ ఈ ఆలోచనను తనదైన రీతిలో ముందుకు తీసుకెళ్లింది. 2029 నాటికి మహిళా సాధికారత చట్టాన్ని అమలు చేయాలన్నది ఏకగ్రీవ డిమాండ్. ఈ అంశంపై ఏప్రిల్ 16 నుంచి పార్లమెంటు సమగ్ర చర్చలు జరుపుతుంది. దీన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అన్ని పార్టీలు కలిసి పనిచేస్తాయి' అని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి పార్టీ రాజకీయాలకు అతీతంగా మహిళల ప్రయోజనం కోసం ఈ ముఖ్యమైన పనిని చేపట్టినందుకు దేశంలోని ప్రతి మహిళ కూడా సంతోషిస్తుంది అని మోడీ అన్నారు.


## లోక్‌సభకు సభ్యులందరూ హాజరావ్వాలి

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ చట్టానికి ప్రభుత్వం సవరణలు తీసుకురానున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి లోక్‌సభ ఎంపీలందరూ సభకు హాజరు కావాలని కాంగ్రెస్ సోమవారం విప్ జారీ చేసింది. లోక్‌సభలోని కాంగ్రెస్ పార్టీ సభ్యులందరూ గురు, శుక్ర, శనివారాలు అనగా 2026 ఏప్రిల్ 16,17,18 తేదీలలో జరిగే సభకు హాజరవ్వాలి. 16వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రారంభమైన సభ వాయిదా పడేవరకు తప్పనిసరిగా సభకు హాజరై పార్టీ వైఖరికి మద్దతు ఇవ్వాలని ఆ పార్టీ విజ్ఞప్తి చేసింది. దీనిని అత్యంత ముఖ్యమైనదిగా పరిగణించాలని పార్టీ జారీ చేసిన విప్‌లో పేర్కొంది.

## జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లను పెంచాలని బీజేపీ చూస్తోంది

లోక్ సభ సీట్ల పెంపు, మహిళా రిజర్వేన్లు వేర్వేరనేది ప్రతి పౌరుడికి తెలుసని అన్నారు. అసెంబ్లీ సీట్లలో మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే దేశం మొత్తం ఆమోదిస్తుందని అన్నారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో జనాభా ఆధారంగా లోక్ సభ సీట్లు పెంచాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు.

దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు ఈ విధానం అన్యాయం చేస్తోందని రేవంత్ రెడ్డి అన్నారు. భవిష్యత్తులో దేశాన్ని బలహీనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ పార్టీకైనా జాతీయ ప్రయోజనాలే ముఖ్యంగా ఉండాలని అన్నారు. లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజన కోసం దామాషా పద్ధతి కాకుండా మరో విధానాన్ని అనుసరించాలని కోరారు. అన్ని పార్టీల ఏకాభిప్రాయంతో ఈ అంశంపై ముందుకు వెళ్లాలని సూచించారు.



# ప్రజాభూమి



## రాష్ట్రపతికి కూటమి ఎంపీల సాదర వందనం

### అమరావతి బిల్లుపై కృతజ్ఞతల వెల్లువ





కృష్ణాజిల్లా మచిలీపట్నం (ప్రజాభూమి ప్రతినిధి)
భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ని ఆంధ్రప్రదేశ్ కూటమి ఎంపీల బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో, జనసేన పార్లమెంటరీ పార్టీ లీడర్ వల్లభనేని బాలశౌరి మరియు ఇతర కూటమి ఎంపీలు పాల్గొన్నారు.కృతజ్ఞతా పూర్వక భేటీ అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అధికారికంగా ఆమోదిస్తూ పంపిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసినందుకు ఎంపీలు ధన్యవాదాలు తెలిపారు. ఐదు కోట్ల ఆంధ్రుల కలల రాజధాని అమరావతి అని, ఈ చారిత్రాత్మక నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి మైలురాయి అని మంత్రి నారా లోకేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.కూటమి ఐక్యత: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీలందరూ కలిసి ఏపీ ప్రజల పక్షాన రాష్ట్రపతికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు."అమరావతి నిర్మాణం కేవలం ఒక నగరం నిర్మించడం కాదు, అది ఆంధ్రప్రదేశ్ ఆత్మగౌరవం. దానికి రాష్ట్రపతి ఆమోదం లభించడం రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు శుభసూచకం."— వల్లభనేని బాలశౌరి, జనసేన పార్లమెంటరీ పార్టీ లీడర్.రాష్ట్రపతితో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దడంలో కేంద్రం మరియు రాష్ట్రపతి కార్యాలయం నుంచి లభిస్తున్న సహకారం పట్ల కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు.

## పేకాట శిబిరంపై పోలీసులు దాడి

ప్రజాభూమి పెడన



కృత్తివెన్ను మండలం పాశ్చ్పపురం గ్రామ పరిధిలో రహస్యంగా పేకాట నిర్వహిస్తున్నరని సమాచారం మేరకు బంటుమిల్లి ఎస్సై గణేష్ కుమార్ మరియు కృత్తివెన్ను ఎస్సై పైడి బాబు పేకాట శిబిరం పై దాడి చేశారు. ఈ దాడిలో 5 మందిని అదుపులో తీసుకుని వారి వద్ద నుండి 4 మొబైల్ ఫోన్లు, రూ. 87,000/- రూపాయల నగదును స్వాధీనం చేసుకుని గేమ్ యాక్ట్ చట్టం ప్రకారం వారిపై కేసులు నమోదు చేశారు.

## బంటుమిల్లి చంద్రన్న కాలనీని పరిశీలించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్



ప్రజాభూమి పెడన
సోమవారం బంటుమిల్లి చంద్రన్న కాలనీని సందర్శించి లబ్దిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్. ఈ సంద ర్భంగా గత వైసిపి ప్రభుత్వం సెంటున్నారా (1.5) భూమి ఇచ్చి,మౌళిక వసతుల పేరిట కోట్ల రూపాయలను దోచుకున్నారని,ఫలితంగా లబ్ధిదారులను నిలువన ముంచారని ఆరోపించారు. రాబోవు కాలంలో చంద్రన్న కాలనీలో మౌళిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తామని తెలిపారు..ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, కాలనీవాసులు, తదితరులు పాల్గున్నారు.

## తీరప్రాంతంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి



### బూరగడ్డ ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులకు సూచించిన బూరగడ్డ వేదవ్యాస్

ప్రజాభూమి పెడన
కృత్తివెన్ను ఏప్రియల్ 13పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలం మాట్లాం గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంక్ లోకి మోటారు ద్వారా తోడుతున్న నీటిని మాజీ శాసనసభ్యులు బూరగడ్డ వేద వ్యాస్ఆదివారం పరిశీలించారు.వేసవికాలం దృష్ట్యా తీర ప్రాంతంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆయన అధికారులకు సూచించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఇప్పటికే అధికారులను ఆదేశించినట్టు వ్యాస్ తెలిపారు. తాగు నీటి కొరత లేకుండా ఉండేందుకు అవసరమైన నిధులను కూడా ప్రభుత్వం కేటాయించిందన్నారు. వ్యాస్ వెంట పట్టపు నాగబాబు పుప్పాల నరసింహ జంపన కోటయ్య మోకా తాతయ్య కొప్పర్తి బాబీ తదితరులు వున్నారు.

## తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలను చూసి చలించి పోయిన వేదవ్యాస్

ప్రజా భూమి పెడన:
ఇటీవల పెడనకు చెందిన టిడిపి నాయకురాలు ఖురషీద్ బేగం దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో సోమవారం సాయంత్రం వారి పిల్లలను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరగడ్డ వేదవ్యాస్ పరామర్శించారు. ఖురషీద్ బేగం ఇంటికి వెళ్ళి తల్లిదండ్రులకు కోల్పోయిన పిల్లలను చూసి ఆయన చలించిపోయారు. జరిగిన సంఘటన పిల్లలను అడిగి తెలుసుకున్నారు. పిల్లల యోగక్షేమాలు వారి చదువు గురించి కూడా మేనమామ అమీర్ ను అడిగి తెలుసుకున్నారు. పిల్లలిద్దరితో ఆయన కాసేపు ముచ్చటించారు.వ్యాస్ వెంట టీడీపీ నాయకులు యర్రా రాజా బెజవాడ నాగరాజు వాహబ్ ఖాన్ లు కూడా వున్నారు.



## శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల సేవలో విక్కుర్తి

అవనిగడ్డ / నాగాయలంక
ప్రజాభూమి ప్రతినిధి





నూతనంగా ప్రతిష్టించిన శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల సేవలో ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు, VVR ఫౌండేషన్ చైర్మన్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు తరించారు. నాగాయలంకలో నూతనంగా నిర్మించిన శ్రీ భూ నీలా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయములో శ్రీ గోదా పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి గరుత్మంత, జయం విజయ, విమాన శిఖర జీవ ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే కోడూరులో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆలయ ధ్వజస్తంభ పున: ప్రతిష్ట, మహా కుంభాభిషేకం కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు విక్కుర్తి శ్రీనివాస్ సోమవారం ఉదయం నూతనంగా ప్రతిష్టించిన ఆలయాలను సందర్శించి, శ్రీ స్వామి, శ్రీ అమ్మ వార్లను దర్శించుకుని ఆలయాలలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాలలో కనకమేడల రామబ్రహ్మం , గోగినేని సోమశేఖర్,వేమూరి ప్రభాకర్ , వేమూరి బుజ్జి,బడే వీర బాబు, పెద్ది భాస్కర్, నాగం బాపయ్య, మాచెర్ల భీమయ్య, కోసూరి రాజా, గట్టిపాటి నాగేశ్వరరావు, మెండు లక్ష్మణ రావు, ఉప్పల ప్రసాద్, పున్నయ్య దాసు, తాత రావు, కన్నా వెంకటేశ్వర రావు (చిన్న), తుమ్మ అర్జున రావు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికత పరిమళించేలా దేవస్థానాన్ని అభివృద్ధి చేయాలి

### సకలేశ్వర స్వామి దేవస్థాన చైర్మన్ టీడీపీ రైతు నేత గవిని శివరామకృష్ణ ప్రమాణ స్వీకారం





అవనిగడ్డ / మోపిదేవి ప్రజాభూమి ప్రతినిధి
ఆధ్యాత్మికత పరిమళించేలా దేవస్థానాన్ని అభివృద్ధి చేయాలని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ ఆకాం క్షించారు. మంగళవారం మోపి దేవిలోని శ్రీ గంగా పార్వతి సమేత శ్రీ సకలేశ్వర స్వామి దేవస్థాన నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది. దేవస్థాన నూతన ధర్మకర్తల మండలి చైర్మనుగా టీడీపీ రైతు నేత గవిని శివరామకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మకర్తల మండలి నూతన డైరెక్టర్లుగా బెల్లంకొండ ఏడుకొండలు, కొలుసు నాగమణి, చిక్కాల నాగరాజు, రాజనాల సుధారాణి, మోపి దేవి వెంకట సుబ్బారావు, పెనుమూడి సీతామహాలక్ష్మి, మోటేపల్లి బేబీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలి ఆహ్వానం మేరకు ఈ వేడుకకు అతిధులుగా విచ్చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు వారిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ మోపిదేవిలో ప్రాచీన చరిత్ర కలిగిన మహిమాన్విత దేవస్థానంగా భక్తుల పూజలు అందుకుంటున్న సకలేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధికి నూతన పాలక మండలి కృషి చేయాలని కోరారు. ప్రాచీన దేవస్థానాలకు నిలయమైన దివిసీమలో టెంపుల్ టూరిజం అభివృద్ధికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ విస్తృత కృషి చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ ఆధారమైన ఈ నియోజకవర్గంలో ప్రాచీన ప్రఖ్యాతి కలిగిన ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేం దుకు అనువైన అవకాశాలు గుర్తించి పలుమార్లు అసెంబ్లీ ద్వారా నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఈ ప్రాంతానికి పర్యాటకుల సంఖ్య పెరిగేందుకు అనువైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విజ్ఞప్తి చేసి ఉన్నారని తెలిపారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం ఇప్పటికే నియోజకవర్గంలో అనేక దేవస్థానాలను అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో సీజీఎఫ్ నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన ధర్మకర్తల మండలి కృషితో దేవస్థానం ఖ్యాతి పెరగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు మెడబలిమి మల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వర రావు, జనసేన మండల అధ్యక్షులు పూషడపు రత్నగోపాల్, ఎంపీటీసీ కొమ్ము పవన్, మండల కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, మాజీ సర్పంచులు దిడ్ల జానకీ రాంబాబు, అరజా సంధ్యారాణి, దిడ్ల జానకి రాంబాబు, దొప్పలపూడి గంగాభ వానీ, పోలిమెట్ల ఏసుబాబు, సీనియర్ సహకారవేత్త పరుచూరి అంజియ్య, సొసైటీ అధ్యక్షులు పరుచూరి శ్రీనివాస రావు, కోనేరు నాగేశ్వరరావు, బళ్ళ సీతారాం ప్రసాద్, నాయకులు రావి రత్నగిరి, దొప్పలపూడి జగదీష్, డోకిపర్తి బాల కోటేశ్వరరావు, యడ్లపల్లి బుజ్జి, దేవాదాయ శాఖ అధికారులు ప్రవీణ, శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

## అయ్యప్ప సేవా సమితి చలివేంద్ర ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య





ప్రజాభూమి నందిగామ :
నందిగామ పట్టణం మెయిన్ సెంటర్లో సోమవారం నాడు అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కూటమి నేతలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య మాట్లాడుతూ, గత 17 సంవత్సరాలుగా నిర్విఘ్నంగా ప్రజాసేవలో కొనసాగుతున్న అయ్యప్ప సేవా సమితి వారి సేవలు ప్రశంసనీయం అని కొనియాడారు. వేసవి కాలంలో ప్రజలకు చల్లని నీరు అందిస్తూ సమాజానికి ఉపశమనం కలిగించే ఈ చలివేంద్రం, సేవా సమితి వారి నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్,స్థానిక నాయకులు, సమితి సభ్యులు, పట్టణ ప్రజలు పాల్గొని చలివేంద్ర ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

## యనమల రామకృష్ణుడిని పరామర్శించిన రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు

అమరావతి
ప్రజాభూమి ప్రతినిధి



మాజీ ఆర్థిక మంత్రి, తెలుగు దేశం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామ కృష్ణుడు ను రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు సోమవారం ప రామ ర్శించారు. ఇ టీవ ల అనారోగ్య కారణాలతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన యనమల రామకృష్ణుడు వైద్యుల సూచన మేరకు స్టెంట్ వేయించుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్న ఆయనను ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసిన సానా సతీష్ బాబు, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా యనమల రామకృష్ణుడు త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అందుతున్న వైద్య సేవలపై కూడా వివరాలు తెలుసుకున్నారు.

## పెడన టౌన్ లో పేకాట శిబిరంపై పోలీసుల మెరుపు దాడి

ప్రజా భూమి పెడన



పెడన పట్టణంలోనీ 4 వ వార్డ్ లో రహస్యంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పెడన ఎస్సై 2 షేక్ బషీరే తమ సిబ్బందితో కలిసి మెరుపు దాడి చేశారు. ఈ దాడిలో 6 మందిని అదుపులో తీసుకుని వారి వద్ద నుండి రూ. 2,500 రూపాయలు స్వాధీనం చేసుకుని వారిపై కేసులు నమోదు చేశారు.

## ప్రజా సమస్యలపై మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ గళం

**కలెక్టర్ డీకే బాలాజీకి వినతి పత్రం అందజేత**

**ఇసుక పంపిణీలో పారదర్శకత ఉండాలి అధికార పార్టీ అండదండలు ఉన్న వారికేనా పర్మిషన్లు?**



మచిలీపట్నం ( ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా)
పామర్రు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల మౌలిక వసతుల సాధనే ధ్యేయంగా మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సోమవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు కీలక అంశాలపై ఆయన కలెక్టర్‌తో సుదీర్ఘంగా చర్చిం చారు. వేసవి మంచినీటి ఎద్దడిపై ముందస్తు ప్రణాళికరానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో మంచినీటి సౌకర్యం మెరుగుపరచాలని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అనిల్ కుమార్ కోరారు.ఇసుక పంపిణీలో వివక్ష వద్దుపామర్రు నియోజకవర్గ అవసరాల నిమిత్తం ఒక ప్రణాళికాబద్ధంగా ఇసుక పర్మిషన్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం అధికార పార్టీ అండదండలు ఉన్న వారికే అనుమతులు ఇవ్వడం సరికాదని, సామాన్య ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. "ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నిస్తే.. గతంలో మీరు చేయలేదా? అని తుంపల గొడవలా మాట్లాడటం ప్రజాప్రతినిధులకు తగదు" అని ఆయన హెచ్చరించారు.




ఎన్నికల హామీలను నెరవేర్చాలి:ప్రస్తుత ఎమ్మె ల్యే వర్ల కుమార్ రాజా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేదలందరికీ మూడు సెంట్ల నివేశన స్థలం ఇవ్వాలని అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. హామీలు ఇచ్చి విస్మరించడం ప్రజలను వంచించడమేనని పేర్కొన్నారు.అవినీతి మయం.. అక్రమ కేసులు:ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన అనిల్ కుమార్, ప్రస్తుతం నియోజకవర్గంలో ఏ అధికారికి ఏ పోస్టింగ్ కావాలన్నా భారీగా లంచాలు వసూలు చేస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రత్యర్థులపై దొంగ కేసులు పెట్టడం దుర్మార్గమని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు సరికాదని హితవు పలికారు.పోలీస్ అధికారులపై ఆరోపణలు సరికాదుతోట్లవల్లూరు సుప్రియ కేసు విషయంలో విధి నిర్వహణలో ఉన్న సీఐపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. రాజకీయ ప్రయోజనాల కోసం అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీయవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రశ్నిస్తే పాత విషయాలు తీయడం సరికాదు.పేదలకు 3 సెంట్ల స్థలం హామీ ఏమైంది?అధికార పార్టీ వారు చెబితేనే ఇసుక పర్మిషన్లా?

## దేవుని విచారణతోనే సంపూర్ణ విజయం


మచిలీపట్నం( ప్రజాభూమి రూరల్ తాళ్లపాలెం):






కృష్ణా జిల్లా మచిలీపట్నం రూరల్ పరిధిలోని తాళ్లపాలెం పంచాయతీ, మంగినపూడి బీచ్ సమీపంలో హోసన్న మినిస్ట్రీస్ ప్రార్థన సహవాసం ఆధ్వర్యంలో నిర్వహించిన ఒకరోజు రాత్రి సువార్త కూడిక భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవం గా జరిగింది. ఈ ఆధ్యాత్మిక సభకు నియోజకవర్గ నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో విశ్వాసులు, ప్రజలు తరలివచ్చారు.ఈ కూడికలో ముఖ్య వర్తమానికులుగా విచ్చేసిన హోసన్న మినిస్ట్రీస్ మచిలీపట్నం సేవకులు పాస్టర్ రాజేష్ 'దేవుని విచారణ' అనే అంశం పై శక్తివంతమైన సందేశాన్ని అందించారు. బైబిల్ ఆధారంగా ఆయన నాలు గు ముఖ్య అంశాలను వివరిస్తూ, మనిషి తన జీవితంలో దేవుని చిత్తాన్ని ఏ విధంగా వెతకాలో దిశానిర్దేశం చేశారు.
ఆయనను కనుగొనాలి: ప్రతి విశ్వాసి హృదయపూర్వకమైన విచారణ (ప్రార్థన) ద్వారా దేవుని సన్నిధిని అన్వేషించాలని, అప్పుడే సరైన మార్గం కనిపిస్తుందని పేర్కొన్నారు.
భయం తొలగిపోతుంది: దేవుని విచారణ చేసే వ్యక్తికి లోకసంబంధమైన భయాలు ఉండవని, దైవశక్తి తోడై ధైర్యాన్ని ఇస్తుందని వివరించారు.
విస్తరింపజేసే శక్తి: దేవునిపై ఆధారపడి అడుగులు వేసేవారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతారని, వారి సరిహద్దులు విస్తరించబడతాయని ఆత్మీయ వాగ్దానం చేశారు.వెల్లువెత్తిన జనసముద్ర తీర ప్రాంతంలో జరిగిన ఈ ప్రార్థన కూడికలో పాటలు, ఆరాధన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాస్టర్ రాజు గారి సందేశం విన్న అనేకమంది తమ జీవితాల్లో ఆధ్యాత్మిక మార్పును అనుభవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హోసన్న మినిస్ట్రీస్ ప్రతినిధులు, స్థానిక పెద్దలు మరియు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కూడికను విజయవంతం చేశారు.

## జిల్లా ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**ప్రజా భూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**
ప్రజల సమస్యలను త్వరి తగతిన, పారదర్శకంగా పరిష్క రించడమే లక్ష్యంగా ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజల సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఏ ఆర్ అదనపు ఎస్పీ జి ముని రాజాతో కలిసి ఫిర్యాదుదారుల నుండి నేరుగా అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమం పూర్తిగా పేపర్ లెస్ పద్ధతిలో, పారదర్శ కమైన ఆన్‌లైన్ విధానంలో వహించడం జరిగిందని ఎస్పీ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మొత్తం 46 ఫిర్యాదు లు అందాయి. వీటిలో ప్రధానంగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు మరియు ఆర్థిక మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయన్నారు. స్వయంగా ఫిర్యాదు దారులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకుని. సదరు ఫిర్యాదులపై చట్టప్రకారం తక్షణమే విచారణ చేపట్టి, నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారు లకు కఠిన ఆదేశాలు జారీ జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల కోసం జిల్లా కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా మరిన్ని వెసులుబాటులను ఎస్పీ వివరించారు. డబ్బు, సమయం వృథా చేసుకోకుండా నేరుగా సమీపంలోని సబ్–డివిజన్ లేదా సర్కిల్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు.

# తొలి భారతీయ ఫెమినిస్ట్‌గా బాబాసాహెబ్ దృక్కోణం



**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**
భారత సామాజిక సంస్కరణోద్యమాల తొలి దశలో దేశంలో సాగిన అనేక సాంఘిక ఉద్యమాలకి, సమూహాలకి భిన్నంగా అంబేద్కర్ సలిపిన పోరాటం అనేక వైరుధ్యాలతో కూడింది. కులజాడ్యం బహుముఖాలుగా విస్తరించి ఒకానొక అసాంఘిక శక్తిగా భారత జాతిని నిర్వీర్యం చేస్తున్న కాలమది. మహాత్మ పూలేతో స్ఫూర్తిపొందిన మరాఠా విద్యావంతులు, స్త్రీలు అప్పుడప్పుడే గొంతు విప్పగల్గుతున్నారు. అవమానకర గ్రామీణ సమాజంలో బడుగుల జీవితం మరీ దుర్భరమైపోయింది. స్త్రీల జీవితం దారుణంగా ఉండేది. ఆడపిల్ల పుట్టగానే వరికంకులు గొంతులోపోసి కాటికి పంపించేసే ఫీష్వాల కరకుకత్తుల పాలనా అప్పటికింకా పోలేదు. ఆ పరిస్థితులను తట్టుకుని ఎదిగిన ఆడపిల్లలను కాటికి కాళ్లు చాచుకునే ఎనభై ఏళ్ల ముసలివాళ్లకు అంటగట్టడం, ఈడొచ్చిన ఆడపిల్లలను బసివిని చేసి ఊరుమ్మడిసొత్తుగా అనుభవించడం.
ఇంటిచాకిరీ, ఒంటింటి నౌకరీకే తప్ప అసలు ఆడపిల్లను మనిషిగానే గుర్తించకపోవడం అనాటి సామాజిక అవలక్షణాలు.
భారత పురాణాల్లోనూ, ఇతిహాసాల్లోనూ, ఆ తరువాత వచ్చిన ధార్మిక రచనల్లోనూ స్త్రీలపై చాలా తీవ్రమైన ఆంక్షలు కనిపిస్తాయి. స్త్రీ బుద్ధి ప్రళయాంతకమన్నాడు మనువు. ఆడదాని బుద్ధి మరీ సంచలమన్నాడు వ్యాసుడు. మాతృస్వామ్యంతో అద్భుత నాగరికత విలసిల్లిన సింధు ప్రాంతాన్ని ఆర్యులొచ్చి ధ్వంసం చెయ్యడంతోనే మాతృభావన అటుగంటింది.
స్త్రీ కుటుంబాన్నే కాదు, గుంపు నాయకురాలిగా ఒక సాంఘిక సమూహాన్ని ఎంత చాకచక్యంగా,సమర్థవంతంగా నడిపించగలదో రాహుల్ సాంకృత్యయాన్ ప్రసిద్ధ రచన'ఓల్గా నుంచి గంగకు' స్పష్టం చేస్తుంది. స్త్రీ నుంచి అధికారం చేజిక్కించుకోవడమంటే... ఒక చారిత్రకంగా ఒక దశనుంచి మరో దశకు మరలినట్టే. ఆంధ్రభృత్యులమని చెప్పుకున్న శాతావాహనులు మాతృసంజ్ఞలతో, తల్లి వంశ నామాలతో రాజ్యపాలన చేశారు. గౌతమిపుత్ర శాతకర్ణి, వాశిష్టపుత్ర పులోమావి.. మాధరీ పుత్ర.. అలాంటివి ఆనాటి సంఘంలో తల్లికి గల గొప్ప స్థానాన్ని గుర్తుకుతెస్తాయి.
కాలం మారింది. రాజులూ వారి అధికార దృక్పథాల్లో,ఆలోచన వ్యూహాల్లో మార్పొచ్చింది. రాజు దేవాంశసంభూతుడు, దైవ ప్రతినిధి, అనే పురుషహాంకారం ప్రభలింది. స్త్రీ స్వేచ్ఛకి హద్దులూ, లక్ష్మణరేఖలూ, వ్రతానుష్టానాలతో సాంఘిక ప్రతిబంధకాలూ ఏర్పడ్డాయి.
స్త్రీల శరీరంపై, ఆకాంక్షలపై కూడా వారికి హక్కులేకుండా ఇనుపకచ్చడాలు తగిలించి తరాల బానిసత్వాన్ని అంటగట్టారు. స్త్రీని భోగాంగనగా, అంగాంగ శృంగార చేష్టలతో అలరించే కామోద్దీపనగా మలుస్తూ శృంగార కావ్యాలూ, కామసూత్రాలొచ్చాయి. దేశాంతరాలకి పోతూ పాతివ్రత్య కథలతో స్త్రీ తననితాను నియంత్రించుకునే దిశగా భ్రమల్లోకి నెట్టేసే సాంఘిక ఆచారాలు ఒంటబట్టించి అబలల జీవితాలని అగాధంలోకి నెట్టేసిన హైందవ ప్రబుద్ధులు తయారయ్యారు. వాళ్ల కుతంత్రాలను కనిపెట్టి, వారి పవిత్ర ధర్మశాస్త్రాన్ని బహిరంగంగా తగులబెట్టిన అంబేద్కర్... స్త్రీ అభ్యుదయానికి సరికొత్త ఊపిరులూదాడు. మరాఠా ప్రాంతంలో మహర్ స్త్రీల అవస్థలను చూశాడు. తల్లి భీమాబాయి, భార్య రమాబాయి.. దేశ మహర్ వాడల్లో పూలమ్మే, పశువుల కసవు ఊడ్చే, మానవ విసర్జితాలను ఎత్తి, శుద్ధి చేసే కోట్లాది అంటరాని జాతుల్లోని స్త్రీల దుర్భర జీవితాలకు కలతచెందాడు. మహిళా సాధికారత కోసం ఏదైన గొప్ప సంస్కరణ చెయ్యాలనుకున్నారు. ఆనాడు అగ్రవర్ణ మహిళల అభిప్రాయాలను కూడా విలువుండేది కాదు. మహిళలకు విడాకులిచ్చే హక్కులేదు. చట్టబద్ధంగా ఆర్థిక లావాదేవీలు జరిపే పరిస్థితిలేదు. బ్యాంకులో ఖాతా తెరవడానికి కూడా వీలులేదు. స్త్రీల పరిస్థితిని మెరుగుపరిచేందుకు బాబాసాహెబ్ చేసిన ఆలోచనల్లో, తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగమే హిందూ కోడ్ బిల్లు. కాని ఇది విఫలమైంది.
"హిందూ కోడ్ బిల్లు ఈ దేశంలో ఎన్నడూ తలపెట్టని గొప్ప సాంఘిక సంస్కరణ. గతంలోకానీ, భవిష్యత్తులో కానీ, దీనితో పోల్చదగిన మహత్తర చట్టం కనిపించదు. పురుషులకూ స్త్రీలకు మధ్య ఉన్న అసమానతలు ముట్టుకోకుండా ఆర్థిక సమస్యలకు సంబంధించి చట్టాలు చేస్తూపోవడం రాజ్యాంగాన్ని ప్రహసన ప్రాయం చెయ్యడమే. పెంటకుప్పపై రాజప్రాసాదం నిర్మించడమే" అని, బిల్లు విఫలమైన తర్వాత... తన న్యాయశాఖ మంత్రిత్వానికి రాజీనామా చేస్తూ బాబాసాహెబ్ పలికిన మాటలు.. స్త్రీల పురోగతి విషయమై అంబేద్కర్ విప్లవాత్మక ఆలోచనలు, ఆచరణదిశగా క్రియాశీలతలో ఎంత నిక్కచ్చిగా ఉండేవారో తెలుస్తుంది. రాజ్యాంగం అమలుల్లోకొచ్చాక స్త్రీల పరిస్థితిలో మార్పొచ్చింది. ప్రభుత్వ పాలన రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం చురుకందుకుంది. దేశ పరిపాలనలో, కార్యనిర్వాహక శ్రేణుల్లో, రాజకీయ మంత్రాంగంలో, శాస్త్ర సాంకేతిక రంగాల పురోగతిని మలుపు తిప్పే కీలక పదవుల్లో కుదురుకున్న నేటి మహిళల వికసిత చైతన్యం బాబాసాహెబ్ ఉద్యమ ఫలితమే. భారతీయ మహిళల భవిష్యత్తుని తీర్చిదిద్దడంలో అంబేద్కర్‌కి ఎదురైన సవాళ్లె లాంటివి? ఈ మహానేత లేకపోతే దేశం ఏమి కోల్పోయేది? ఈ దేశ ప్రజలు..ముఖ్యంగా స్త్రీలు ఎలాంటి దురవస్థ నుంచి బయట పడ్డారు? పని ప్రదేశాల్లో, విద్య,ఉద్యోగ అవకాశాల్లో ఎన్నెన్ని అగచాట్లు ఎదుర్కొంటున్నారూ? స్త్రీ,పురుషుల సమానతలో పురాతన చట్టాలు, సనాతనుల మూస ధోరణులను చక్కదిద్ది ఆధునిక భారతంలో అత్యాధునిత స్త్రీ ఆలోచనల ప్రియ బాంధవుడిగా, దాస్య విమోచకుడుగా..
ఇలా... విభిన్న శ్రేణుల్లో బాబాసాహెబ్ చేసిన విస్తృత పోరాటాలకి స్తీల నుంచి సరైన, మెరుగైన మద్దతు లభించిందా అంటే... సందేహాస్పదమే. అట్టడుగు కులాల నాయకుడిగా, రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడిగా, ఆర్థిక రంగ విశ్లేషకుడిగా, సామాజిక న్యాయ శాస్త్ర కోవిదుడుగానే కాకుండా.. భారతీయ మహిళా చైతన్యానికి వివిధ శ్రేణుల్లో కొత్త ఉషస్సునిచ్చిన శక్తిగా ఈనాటి మహిళాలోకం గుర్తించాల్సిన అవసరం, వాళ్లు చెయ్యాల్సిన అధ్యయనం, అధ్యాపనం ఇంకా మిగిలే ఉంది.

## మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు



**ప్రజాభూమిప్రతినిధి – ఆగిరిపల్లి**
శ్రీ శోభనాద్రి గట్టుపై స్వయంభు బ్రహ్మసూత్ర సహిత శ్రీ దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో చైత్రమాసం బహుళ ఏకాదశి సోమవారం సందర్భంగా మల్లికార్జున స్వామి వారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మహన్యాస పూర్వక ఏకవారాభిషేకం, పంచామృత ఫలరసాభిషేకం, సహస్రనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి చేత తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారని ఆలయ కార్యనిర్వహణ అధికారి సిహెచ్ సాయి తెలిపారు.

# వేంపాడులో పక్కదారి పట్టిన అంగన్వాడీ పౌష్టికాహారం

### ప్రైవేట్ వ్యక్తి ఇంట 250 ప్రభుత్వ కోడిగుడ్లు.. టీచర్ నిర్లక్ష్యమా? అక్రమమా?



**ప్రజాభూమి ప్రతినిధి – ద్వారక తిరుమల**
గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్న సదుద్దేశంతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న కోడిగుడ్లు పక్కదారి పడుతున్నాయి. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామపంచాయతీ పరిధిలో వెలుగుచూసిన ఒక ఘటన అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ తీరుపై పలు అనుమానాలకు తావిస్తోంది. అంగన్వాడీ కేంద్రానికి చేరాల్సిన సుమారు 250 కోడిగుడ్లు గ్రామంలోని ఓ ప్రైవేట్ వ్యక్తి ఇంటి వద్ద దర్శనమివ్వడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.
**వివరాల్లోకి వెళితే..** వేంపాడు గ్రామంలోని ఒకరి ఇంటి వద్ద భారీ సంఖ్యలో కోడిగుడ్లు (సుమారు 250 వరకు) ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. అనుమానం వచ్చి ఆ ఇంటి యజమానిని ప్రశ్నించగా పొంతన లేని సమాధానాలు వచ్చాయి. గ్రామస్తులు గట్టిగా నిలదీయడంతో సదరు యజమాని స్పందిస్తూ.. "గత పది రోజుల క్రితం గ్రామంలో ప్రభుత్వం వారు సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఆ సమయంలో అంగన్వాడీ స్కూలుకు కోడిగుడ్లు తీసుకొచ్చే ఆటో.. రోడ్డు పనుల వల్ల స్కూల్ వద్దకు వెళ్లలేక మా ఇంటి వద్దే గుడ్లను దించి వెళ్ళింది. మరుసటి రోజు అంగన్వాడీ టీచర్ మీ దగ్గరకు వచ్చి ఈ గుడ్లను స్కూలుకు తీసుకెళ్తారని ఆటో డ్రైవర్ చెప్పాడు" అని వివరించారు.
**అంగన్వాడీ టీచర్ నిర్లక్ష్యం – చేతులెత్తేసిన వైనం:** గుడ్లు దించి పది రోజులు గడుస్తున్నా.. వాటిని స్కూలుకు ఎందుకు తరలించలేదని స్థానికులు ప్రశ్నించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. "నేను పలుమార్లు అంగన్వాడీ టీచర్‌కు ఈ విషయం చెప్పాను. కోడిగుడ్లు ఇక్కడే ఉన్నాయని, తీసుకెళ్లమని కోరాను. కానీ, ఆ టీచర్ మాత్రం 'నాకు ఈ గుడ్లతో ఎలాంటి సంబంధం లేదు' అని చెప్పి వెళ్లిపోయింది" అని ఆ ఇంటి యజమాని వాపోయింది.
**లబ్ధిదారుల నోట్లో మట్టి కొడుతున్నదెవరు?** పసిపిల్లలు, గర్భిణీలకు చేరాల్సిన పౌష్టికాహారం ఇలా ఒకరి ఇంటి వద్ద పది రోజుల పాటు అనాథలా పడి ఉండటం దారుణమని గ్రామస్తులు మండిపడుతున్నారు. అంగన్వాడీ టీచర్‌కు సంబంధం లేకపోతే ఆ గుడ్లు ఎవరివి? ప్రభుత్వ రికార్డుల్లో లబ్ధిదారులకు ఈ గుడ్లు పంపిణీ చేసినట్లుగా తప్పుడు లెక్కలు రాసుకున్నారా? పది రోజులుగా ఆ గుడ్లు బయటే ఉంటే అవి పాడైపోయి ఉండవా? ఒకవేళ వాటినే పిల్లలకు పెడితే వారి ఆరోగ్య పరిస్థితి ఏంటి? అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత సీడీపీఓ, ఐసీడీఎస్ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, వేంపాడు అంగన్వాడీ కేంద్రం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## నవాబుపేటలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంప్



**ప్రజాభూమి – ఏలూరు**
స్థానిక నవాబుపేట కాలనీలో డా. భీంరావ్ రాంజీ సమాఖ్య సేవ సంఘం ఆధ్వర్యంలో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఏలూరు ఆశ్రమం హాస్పిటల్ సౌజన్యంతో లవ్ & హోప్ పబ్లిక్ స్కూల్లో ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలూరు డి.ఎస్.పి శ్రావణ్ కుమార్ హాజరై క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ క్యాంప్‌లో సాధారణ వైద్య పరీక్షలు మరియు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. 3వ డివిజన్‌లో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందని, అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కమిటీ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. సమాజ సేవ కార్యక్రమాలు మరింతగా చేపట్టి ప్రజలను అంబేద్కర్ మార్గంలో నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 1వ పట్టణ SI, CIలు, అలాగే కమిటీ సభ్యులు విప్పర్తి సుదర్శన్ కుమార్, బొడా కిరణ్ కుమార్, కాపుదాసి రవికుమార్, మత్తె బాబీ, ఎడ్ల రాజు, రాపాక రాజు, నేతల నాని, గేరా అబ్రహం, బోదుల పూర్ణచంద్రరావు, యేలేటి మనోజ్, మెరుగు జాన్, పుల్ల అరవింద్, క్రాంతి, పుష్ప కిషోర్, పెరికె సునీల్, తాటిపూడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత - గోదావరి సమావేశ మందిరం ముందు మహిళా నిరసన



**ప్రజాభూమి – ఏలూరు**
కలెక్టరేట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గోదావరి సమావేశ మందిరం ముందు ఒక మహిళా ఫిర్యాదుదారు నిరసనకు దిగారు. తన సమస్యను పరిష్కరించడంలో కలెక్టర్ ఏకపక్ష వైఖరి అవలంబిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ఏర్పాటు చేసిన సమావేశానికి వచ్చిన ఆమె, తన ఫిర్యాదును అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా సరైన స్పందన రాలేదని చెబుతూ, సమావేశ మందిరం ఎదుటే బైఠాయించి నిరసన చేపట్టారు. "కలెక్టర్ నా సమస్యను వినడం లేదు... న్యాయం కావాలి" అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేయడం అక్కడ ఉన్న వారిని కదిలించింది. సంఘటన స్థలంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై స్థానికులు కూడా స్పందిస్తూ, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సంబంధిత అధికారులు మహిళతో మాట్లాడి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అనంతరం ఆమెను 3 టౌన్ పోలీస్ స్టేషన్ తరలించినట్లు సమాచారం.

# మంచి చేసే కూటమిని ఏకగ్రీవంగా గెలిపించండి

### రూ. 9.21 కోట్లతో ఊటడ, యలమంచిలి గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల శంకుస్థాపన



**ప్రజాభూమి ప్రతినిధి – పాలకొల్లు**
ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం వంటి మంచి పనులు చేసేది కూటమి ప్రభుత్వమేనని, భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా కూటమిని ఏకగ్రీవంగా గెలిపించాలని రాష్ట్ర జలవనుర్ల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. యలమంచిలి మండలం ఊటాడ, యలమంచిలి గ్రామాల్లో సోమవారం ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ నిధులు రూ. 9.21 కోట్లతో అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసిఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మలకు ఆయా గ్రామాల్లో ప్రజలు ముఖ్యంగా పెద్ద సంఖ్యలో మహిళలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యలమంచిలి లో జరిగిన బహిరంగ సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ జగన్ ఐదేళ్ల పాలనతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అప్పుల పాలై ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ఆ లోటు పాలకొల్లు నియోజక వర్గం పై కనిపించకుండా అభివృద్ధి పనులకు కొట్లాది రూపాయలు నిధులు తీసుకువస్తూ ప్రజల రుణం తీర్చుకుంటున్నానన్నారు . రాష్ట్ర విభజన కన్నా వైసిపి పాలనతోనే ఎక్కువ నష్టం జరిగిందన్నారు. ఊటాడ, ఎలమంచిలి గ్రామాల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా 20 నెలల్లో కోట్లాది రూపాయలతో జరిగిన అద్భుత పనులను, ప్రభుత్వం అమలు జరిపే సంక్షేమ పథకాలను మంత్రి నిమ్మల వివరించారు. అందులో భాగంగానే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కలుషితం లేని సురక్షిత తాగు నీరు అందించేందుకు కోట్లాది రూపాయలు వెచ్చించి విజ్వేశ్వరం నుంచి నేరుగా గోదావరి జలాలు తీసుకువచ్చే పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ప్రజల అవసరాలను అడగకపోయినా తానే గుర్తించి నిధులు తీసుకువస్తున్నానన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మోదీల కలయికతో అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని ఓర్వలేని జగన్ అడుగడుగునా అడ్డు తగులుతున్నాడు అన్నారు. అశాంతి, శాంతి భద్రతలకు విఘాతం, కక్షలు కార్పన్యాలు రెచ్చగొట్టే జగన్ పార్టీ వైసిపి కాదని, గొడ్డలి పార్టీ అని ప్రజలే భావిస్తున్నారని మంత్రి రామానాయుడు తెలిపారు. రైతులతో పాటు అన్ని వర్గాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు, ఎమ్మార్వో గ్రంధి పవన్ కుమార్, ఎంపీడీవో జెడి వి ప్రసాద్, అధికారులు కే దుర్గా రామస్వామి, వి వి రమణ, బి శ్రీనివాస్, మోహన్ సుబ్బారావు,కూటమి నాయకులు మామిడి శెట్టి పెద్దరాజు, కొడవటి వరబాబు, తోలేటి చంటి, యినుకొండ ధన లక్ష, బోనం నాని,బొప్పన హరి కిషోర్, చిలుకూరి బాలాజీ, పీతల శ్రీనివాస్,ఆరిమిల్లి చిన్ని, రుద్రరాజు సత్యనారాయణ రాజు,, తాళ్ళూరి బుజ్జి,చెరుకూరి అంజిబాబు పాల్గొన్నారు.

## హై స్కూల్ విద్యార్థులకు ప్లేట్లు గ్లాసులు పంపిణీ



**ప్రజాభూమి ప్రతినిధి – తాళ్లపూడి**
మండలంలోని అన్నదేవరపేట హైస్కూల్ విద్యార్థులకు100 ప్లేట్స్, 100గ్లాసులు అందించటం జరిగిందని టిడిపి యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు, పారిశ్రామిక వేత్త పెండ్యాల అచ్చిబాబు పుట్టినరోజుసందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి అవసరమైన ప్లేట్లు గ్లాసులు అందించడం జరిగిందని యువగళం 2.0 నాయకులు తెలిపారు. కూచిపూడి గణపతి, పల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలను నాణ్యతతోపాటు నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలి

- అర్జీలు రీఓపెన్ కాకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలి
- 237 అర్జీలు స్వీకరణ : జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.

**ప్రజాభూమి ప్రతినిధి – ఏలూరు జిల్లా**
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజీఆర్ ఎస్) ద్వారా అందిన అర్జీల పరిష్కారం జవాబుదారీతనంతో ఉండాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారానికి అక్కడిక్కడే అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, ఇంచార్జ్ డిఆర్ఓ దేవకీదేవి, ఎస్సి కార్పొరేషన్ ఈడి ఎం. ముక్కంటి, సర్వే శాఖ ఏడి అన్సారీ లతో కలిసి ప్రజల నుండి పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజలు పిజిఆర్ఎస్ లో సమర్పించే అర్జీలకు సత్వర పరిష్కార దిశగా పనిచేయడం అత్యంత ప్రధానమన్నారు. అర్జీల పరిష్కారంలో సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు విచారణ చేపట్టి నిర్ధేశించిన సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఫిర్యాదుదారులు విజ్ఞప్తులను అధికారులు క్షుణంగా పరిశీలించి రీఓపెనింగ్ లేకుండా చూడాల్సిన భాద్యత అధికారులపై ఉందన్నారు.
**అందిన అర్జీల్లో కొన్ని... :** కలిదిండి మండలం వెలంపేటకు చెందిన కె. వెంకట రామ్ ప్రసాద్ తన దరఖాస్తులో ఏలూరులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేయవలసిందిగా కోరారు. పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన దాసరి రాములమ్మ తనకు దివ్యంగుల పెన్షన్ మంజూరు చేయవలసిందిగా కోరారు. కలిదిండి మండలం మూలలంక గ్రామానికి చెందిన కదలి శ్రీనివాస్ తన దరఖాస్తులో తన కుమార్తె కదలి సుగంధిని పేరుమీద కల భూమిని ఫోర్జరీ జరిగిందని, తమకు న్యాయం చేయాలనీ కోరారు. కొయ్యలగూడెం పరింపూడి గ్రామానికి చెందిన మహేష్ బాబు తన దరఖాస్తులో కొయ్యలగూడెం-కన్నాపురం రోడ్డులో రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాల్సిందిగా కోరారు. ముసునూరు మండలం గోపవరం గ్రామానికి చెందిన నందిగం చిట్టిబాబు తన దరఖాస్తులో తన పొలములోనికి వెళ్లే దారిని మూసివేసి, తన పొలములోనికి తనను వెళ్లనివ్వడంలేదన్నారు. నూజివీడు మండలం పల్లెర్లమూడి గ్రామానికి చెందిన పరిమి మరియా దాసు తన దరఖాస్తులో తిప్పతీగ మొక్కకు ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయని, ఈ పంట సాగుకు ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కొయ్యలగూడెం మండలం పరింపూడి గ్రామానికి చెందిన అనిల్ బాబు తన దరఖాస్తులో 22 ఏ జాబితాలో ఉన్న చాకలి చెరువును రిజిస్ట్రేషన్ చేసారని, నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చర్యలు చేయవలసిందిగా కోరారు. అర్జీలను పరిశీలించి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెంది యెర్ర వీర్రాజు తన దరఖాస్తులో తనకు డప్పు కళాకారుల పెన్షన్ మంజూరు చేయవలసిందిగా కోరారు. అర్జీదారుల నుంచి 237 ధరఖాస్తులు స్వీకరించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పోగొట్టుకున్న 7 సెల్‌ఫోన్లు రికవరీ యజమానులకు అప్పగింత

రికవరీలో కీలక పాత్ర పోషించిన ఏఎస్ఐ డి.ఎస్. స్వామిని అభినందించిన సీఐ.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ఆత్రేయపురం, ఆలమూరు మండలాలలో వివిధ సందర్భాలలో పోగొట్టుకున్న 7 సెల్‌ఫోన్లను రావులపాలెం రూరల్ సీఐ చి. విద్యాసాగర్ తమ సిబ్బంది సహకారంతో విజయవంతంగా రికవరీ చేసి సంబంధిత యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ విద్యాసాగర్ మాట్లాడుతూ, ఎవరైనా తమ సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా స్వయంగా కూడా ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ విధంగా నమోదు చేసిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు సెల్‌ఫోన్లను ట్రేస్ చేసి తిరిగి అందజేయగలరని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో కీలక పాత్ర పోషించిన ఏఎస్ఐ డి.ఎస్. స్వామిని సీఐ ప్రత్యేకంగా అభినందించారు. పోలీసుల శ్రమ ఫలితంగా తమ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలు తమ విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి నష్టం జరిగినా వెంటనే పోలీసులను సంప్రదించాలని అధికారులు సూచించారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలకు కూటమి నాయకులు విస్తృత ఏర్పాట్లు

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కొత్తపేట నియోజకవర్గంలో ఘనంగా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఈ మేరకు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14వ తేదీ మంగళవారం ఉదయం 9 గంటలకు కొత్తపేట బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించనున్నారు. అనంతరం ఉదయం 10 గంటలకు రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో జరుగనున్నాయి. ఈ కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీకి చెందిన మండల అధ్యక్షులు, క్లస్టర్, కో-ఇన్‌చార్జిలు, యూనిట్ సభ్యులు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, వివిధ కమిటీల ప్రతినిధులు, ఎంపీటీసీలు, అలాగే రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ సామాజిక సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకునేలా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## పరమేశ్వరుని కృపతో పునఃనిర్మితమవుతున్న మోర్త క్షేత్రం

- శంకుస్థాపన మహోత్సవంలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్
- మోర్త గ్రామ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.4.14 కోట్ల నిధులు వెచ్చించామని మంత్రి దుర్గేష్ వెల్లడి





ప్రజా భూమి ప్రతినిధి-నిడదవోలు

నిడదవోలు నియోజకవర్గం ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామంలో వేంచేసియున్న శ్రీ గౌరీశ్వర స్వామి వారి నూతన దేవాలయ పునర్నిర్మాణ కార్యక్రమం సోమవారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య, వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ దివ్య శంకుస్థాపన మహోత్సవానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక,సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా విచ్చేసి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పుణ్య కార్యక్రమంలో భాగంగా మంత్రి దుర్గేష్ దేవతా విగ్రహాలకు అత్యంత నిష్ఠతో ప్రాణప్రతిష్ఠ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. కులాతీతంగా, గ్రామస్తులందరూ సమిష్టిగా ఒకే లక్ష్యంతో ఈ ఆలయ నిర్మాణానికి నడుం బిగించడం నిజమైన భక్తికి నిదర్శనమని కొనియాడారు.. ఆలయ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసి, భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించే బాధ్యత తమపై ఉందన్నారు. ఈ అవకాశం కల్పించిన మోర్త గ్రామ స్థలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు మోర్త గ్రామానికి విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్ కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పండితుల వేదమంత్రాల మధ్య పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికి ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమం సందర్భంగా "ఓం నమఃశివాయ" అనే దివ్య నామ స్మరణతో మోర్త గ్రామం ప్రతిధ్వనించింది. పూజారులు నిర్వహించిన పవిత్ర క్రతువులను మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించి భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ వివేకానంద స్కూల్‌లో ఘనంగా ఆన్యూయల్ డే వేడుకలు

- చూపరులను అబ్బురపరిచిన చిన్నారుల నృత్యాలు.
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గ్రాడ్యుయేషన్ కార్యక్రమం.





ప్రజా భూమి ప్రతినిధి-రామచంద్రపురం

రామచంద్రపురం పట్టణంలో గల శ్రీ వివేకానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఆన్యూయల్ డే, గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు పసలపూడి శ్రీ వివేకానంద స్కూల్ సిఐఎస్ఇ క్యాంపస్‌లో భారీ సంఖ్యలో హాజరైన విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ముఖ్యఅతిథిలతో వైభవంగా నిర్వహించారు. దీంతో ఎక్కడ నిర్వహించిన కార్యక్రమం విజయవంతం అయింది. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు తో నిర్వహించిన నాటికలు, పాటలు, నృత్యాలు వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించాగా ఆహూతులను అబ్బురపరిచాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల గ్రాడ్యుయేషన్ కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి చూపరులను ఆకట్టుకుంటుంది. పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి. హెచ్. శైలుష మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. డైరెక్టర్, కరస్పాండెంట్ బి.ఎ.ఎస్. సరోజిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ జి. వెంకట నవీన్ తేజ, ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి.

### వాడపల్లి, మందపల్లి ఆలయాల

## అభివృద్ధి పనులకు దేవాదాయ శాఖ మంత్రి శంకుస్థాపన

- వాడపల్లిలో 12 కోట్లతో శ్రీనివాసం, 54 గదులు, 2 డార్మెంటరీ శంకుస్థాపన.
- మందపల్లిలో 4.2 కోట్లతో తైలాభిషేక మండపం అన్నదాన భవన కేంద్రాలకు శంకుస్థాపన.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

కూటమి ప్రభుత్వ హయంలో కోనసీమ ప్రాంతంలోని ప్రముఖ ఆలయాల అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. వాడపల్లి, మందపల్లి క్షేత్రాల్లో మొత్తం రూ.16.2 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు వారు ఘనంగా శంకుస్థాపన చేశారు. ముందుగా నాయకులు వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు సంప్రదాయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

**వాడపల్లిలో భారీ అభివృద్ధి**

వాడపల్లిలో రూ.12 కోట్ల వ్యయంతో నిర్మించనున్న శ్రీనివాసం భవనంలో 54 గదులు, 2 డార్మెటరీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ నిర్మాణానికి మంత్రి ఆనం శంకుస్థాపన చేశారు. భక్తులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు.

**మందపల్లిలో పుణ్యక్షేత్ర అభివృద్ధి**

తదుపరి మందపల్లి చేరుకుని మందేశ్వర స్వామివారిని దర్శించుకున్న అనంతరం, అక్కడ రూ.4.2 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో రూ.3 కోట్లతో తైలాభిషేక మండపం, రూ.1.2 కోట్లతో నిత్య అన్నదాన భవనం నిర్మించనున్నారు.

**పుష్కరాలకు సిద్ధం**

వచ్చే 2027 గోదావరి పుష్కరాల నాటికి ఈ అభివృద్ధి పనులను పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి తెలిపారు. ఆలయాల అభివృద్ధితో కోనసీమకు మరింత ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యం పెరుగుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, టిడిపి నాయకులు ఆకుల రామకృష్ణతో పాటు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ట్రస్ట్ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చైతన్య స్కూల్లో ఘనంగా ఫ్యామిలీ ఫెస్ట్




ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

రావులపాలెంలో స్థానిక శ్రీ చైతన్య స్కూల్లో న్యూ అడాప్షన్ ప్రోగ్రాం లో భాగంగా "హ్యాపీ క్లబ్", "ఫ్యామిలీ ఫెస్ట్" కార్యక్రమాలు ఆద్యంతం ఉత్సాహంగా, ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జగదీష్ గౌరవ అధ్యక్షులుగా వ్యవహరించగా, రీజనల్ ఇంచార్జ్ ఎం.వి. ఎల్. నరేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, వినయం, తల్లిదండ్రులు, గురువుల పట్ల గౌరవ భావం కలిగి ఉండాలని సూచించారు. ఈ లక్షణాల ద్వారానే వారు భవిష్యత్తులో ఉన్నత పౌరులుగా ఎదగగలరని తెలిపారు. ముఖ్య అతిథి ఎం.వి.ఎల్. నరేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విలువలను అలవరుచుకొని, చదువులో ప్రతిభ కనబరచి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా మారాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించి, వారి ఆశీర్వాదాలు పొందడం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో డీన్ నాగేంద్ర, సీ ఇంచార్జ్ మూర్తి, ప్రైమరీ ఇంచార్జ్ కుమారి, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు, మూడు, నాలుగో తరగతి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఫ్యామిలీ ఫెస్ట్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో కుటుంబ విలువలు, పరస్పర గౌరవ భావాలు పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

### వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన

## సోమసుందర్ రెడ్డి నగర్ టిడిపి కార్యకర్తలు

-పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా అధ్యక్షుడు చిర్ల.

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.



రావులపాలెం సోమసుందర్ రెడ్డి నగర్‌లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. తెలుగుదేశం పార్టీకి చెందిన కొంత మంది కార్యకర్తలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కూటమి ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యమే తమ నిర్ణయానికి కారణమని వారు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో, వారిని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ పాల్గొన్నారు. అనంతరం సోమసుందర్ రెడ్డి నగర్‌లో ఏర్పాటు చేసిన పార్టీ జెండా స్థూపాన్ని ప్రారంభించి జెండా ఆవిష్కరించారు. జగన్, జగ్గిరెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అలాగే వైఎస్ఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో జిల్లాలో వైఎస్ఆర్సీపీ మరింత బలపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎస్.కె. షరీఫ్ ఎన్నిక

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట



ఆలమూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో సీనియర్ న్యాయవాది ఎస్.కె. షరీఫ్ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా చల్లా సతీష్, జాయింట్ సెక్రటరీగా గానుగుల శేషారావు, ఉపాధ్యక్షుడిగా కె. ధనరాజు, కోశాధికారిగా బి. విద్యా ప్రసన్న భారీ మెజార్టీతో విజయం సాధించారు. మహిళా ప్రతినిధిగా పి. రమ్యశ్రీ దుర్గ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు న్యాయవాదులు, నాయకులు అభినందించారు.

## కులం పేరుతో జనసేన కార్యకర్త పౌరుష పదజాలంతో దూషణ

- అవమానం జరిగిందంటూ గొల్లపాలెం పోలిస్టేషన్ లో పిర్యాదు.
- కాజులూరులో కలకలం రేపిన కులదూషణ సంఘటన.
- బాధిత మహిళలకు అండగా కుల సంఘాలు.
- పార్టీ సిద్ధతాలకు విరుద్ధంగా కార్యకర్త ప్రవర్తన పై పలువురు అసహనం.
- నిగ్గు తేల్చాలంటూ బాధితులు డిమాండ్.








ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు

న్యాయం కోసం వెళ్లిన ఇద్దరు మహిళలను ఒక జనసేన కార్యకర్త కులం పేరుతో పౌరుష పదజాలంతో దూషించిన సంఘటన గొల్లపాలెం పోలిస్టేషన్‌లో చోటుచేసుకుంది. దీంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం కాజులూరు మండలంలో కలకలం రేపుతోంది. ఈమేరకు బాధిత మహిళలు ఇద్దరూ కాజులూరు గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త అన్యం శ్రీరామచంద్రమూర్తి పై కులదూషణ ఆరోపణలు చేస్తూ గొల్లపాలెం పోలిస్టేషన్ లో తమకు న్యాయం చేయాలని పిర్యాదు చేశారు. దీంతో విషయం తెలిసుకున్న కుల సంఘాల నాయకులు సైతం బాదిత మహిళలకు అండగా నిలిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన కాజులూరులో ముగ్గురు వ్యక్తులు కలిసి నిర్వహిస్తున్న వ్యాపారంలో తలెత్తిన వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ సన్నపు లక్ష్మి (ఎస్సీ-మాల), ఆకుల నాగదేవి అనే ఇద్దరు మహిళలు కాజులూరు కు చెందిన అన్యం శ్రీరామచంద్రమూర్తిని ఆశ్రయించారు. సమస్యకు పరిష్కారం చూపాల్సిన ఆయన మహిళను అగౌరవ పరుస్తూ కులం పేరుతో దూషిస్తూ, అసభ్య పదజాలంతో తమతో మాట్లాడి మహిళలమని చూడకుండా తమ మనోభావాలు దెబ్బతినే విధంగా అవమానించాడని ఇరువురు మహిళలు ఆరోపిస్తున్నారు.

బాధితుల తెలియజేసిన వివరాల ప్రకారం మా సమస్య చెప్పుకోడానికి వెళ్లగా 'మాలోడు గొడవలు నేను తీర్చను ఇక్కడి నుంచి వెళ్లిపోండి అంటూ దురుసుగా ప్రవర్తించడంతో మేము ప్రశ్నించగా మరింతగా తమపై కులం పేరుతో దారుణంగా దూషించాడని అని సన్నపు లక్ష్మి మీడియా ముందు వాపోయింది. మహిళలమని కూడా గుర్తించకుండా తక్కువ చేసి మాట్లాడాడని ఆకుల నాగదేవి సైతం ఆరోపించింది. ఊహించని ఈఘటనతో తీవ్ర మనోవేదనకు గురైన వీరు శనివారం రాత్రి గొల్లపాలెం పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఎస్ఐ మోహన్ కుమార్ కు విషయం తెలియజేసి ఆ ఇద్దరు మహిళలు లిఖిత పూర్వకంగా శ్రీరామచంద్ర మూర్తిపై ఫిర్యాదు చేసారు. జరిగిన అవమానాన్ని పూర్తిగా వివరించి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

**మీడియాతో మాట్లాడిన బాధితులు,**

జరిగిన విషయాన్ని బాధిత మహిళలు ఇద్దరూ మీడియాతో మాట్లాడుతూ శ్రీ రామచంద్రమూర్తి వాడిన పదజాలాన్ని చెప్పలేకపోతున్నామని. అంత అవమానకరంగా మాట్లాడాడని పేర్కొన్నారు. ఒక నాయకుడి వద్దకు న్యాయం కోసం వెళ్లి ఇలాంటి అనుభవం ఎదురవుతుందని ఊహించలేదంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. మహిళల మనికూడా కనీస గౌరవం ఇవ్వపోగా కులం పేరుతో పౌరుష పదజాలంతో విరుచుకుపడ్డారని అని వారు ఆవేదన వ్యక్తం చేశారు ఈవిషయంలో పోలీసులు నిగ్గు తేల్చాలని బాధితులు డిమాండ్ చేశారు.

**దళిత సంఘాల నేతలు బాధితులకు మద్దత్తు.**

ఈ ఘటనను తెలుసుకున్న దళిత సంఘాల నేతలు తీవ్రంగా స్పందించి బాధితమహిళలకు అండగా నిలిచి తమ పూర్తి మద్దతు ప్రకటిస్తూ, కులదూషణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మంచి ఆశయాలు సిద్ధాంతాలతో పార్టీ పెట్టి ప్రజలు మన్నంలో పొందుతున్న తరుణంలో ఇలాంటి నేతల కారణంగా పార్టీకి నష్టం కలిగించే అవకాశం ఉందని దళిత సంఘం నేతలు పేర్కొన్నారు. అలాగే కుల దూషణకు పాల్పడిన అన్యం శ్రీరామచంద్రమూర్తి అనే వ్యక్తిని ముందు జనసేన పార్టీ అధిష్టానం నుంచి సస్పెండ్ చేయాలని, ఏనుగు పల్లి కృష్ణ తదితర దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు.

**పార్టీ సిద్ధతాలకు విరుద్ధంగా కార్యకర్త ప్రవర్తనపై పలువురు పార్టీ శ్రేణులు అసహనం.**

మండల కేంద్రమైన కాజులూరులో జరిగిన ఈ సంఘటనపై రామచంద్రపురం నియోజవర్గంలో పరువు పార్టీ శ్రేణులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జనసేన పార్టీలో క్రియాశీలక సభ్యత్వం తప్ప మరో ఏపదవిలేని వ్యక్తి జనసేన పార్టీ కార్యకర్తగా ఉంటూ కూటమి ప్రభుత్వం తరపున ప్రజలకు సేవలు చేయడంలో తప్పులేదు కాని అదే అదునుగా సమాజంలో చట్టాన్ని గౌరవించకుండా కులం పేరుతో మహిళలని చూడకుండా వారిని దూషించడాన్ని పలువురు ఆపార్టీ శ్రేణులు సైతం ఈ విషయంలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మంచి సిద్ధాంతాలు ఆశయాలతో పార్టీ పెట్టగా పవన్ సిద్ధాంతాలకు అనుగుణంగా నూటికి నూరు శాతం పవన్ అభిమానులు నేటికీ కూడా పాటిస్తూ పలాపేక్ష లేకుండా పార్టీ కోసం పాటుపడుతున్న వ్యక్తులను ఇప్పటికీ చూస్తున్న తరుణంలో ఇలాంటి సంఘటన జరగటం యాదృచ్ఛిక మాలేక కావాలనే చేశారనేది పార్టీ పెట్టినప్పటి నుండి ఉన్న జనసైనికులు మీమాంసలో ఉన్నారు.

**నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు: పార్టీ ఇంచార్జ్ పోలిశెట్టి.**

కాజులూరులో జరిగిన ఈ సంఘటనపై రామచంద్రపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ నిజనిర్ధారమ కమిటీ ని వేసినట్లుగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ కాజులూరులో జరిగిన సంఘటన కేవలం ప్రసారం మాధ్యమంలోనే చూసి తెలుసుకోవడం జరిగిందని అన్యం శ్రీరామచంద్రమూర్తి అనే జనసేన కార్యకర్తకు పార్టీలో ఏ విధమైన పదవి లేదని స్పష్టం చేశారు. పార్టీలో అతను 2019లో తనతో సఖ్యతగా ఉండేవారని, పార్టీ పరంగా ఏ పని చేసిన ముందుగా తనతో సంప్రదించి చేసేవారని, అయితే రాను రాను తన ప్రమేయం లేకుండానే తన ఇష్టానుసారంగా పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధంగా మండల పరిధిలో కార్యక్రమాలు చేసుకుంటూ వెళున్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియామకం చేసిన ఇన్చార్జి పదవీలో ఉన్నప్పటికీ నేను అతను చేసే కార్యక్రమాలకు అడ్డు చెప్పలేదని స్పష్టం చేశారు. అయితే పవన్ కళ్యాణ్ మంచి ఆశయాలు, సిద్ధాంతాలతో పార్టీ పెట్టడం జరిగిందని నాటి నుండి నేటి వరకు నేను కూడా అదే సిద్ధాంతాలను ఫాలో అవుతూ నియోజకవర్గంలో పలువురు జనసైనికులు సహకరించక పోయినా ముందుకు వెళుతున్నానని స్పష్టం చేశారు. అయితే పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఇక్కడ జరిగిన సంఘటన తనకు ఆవేదన కలిగించిందని, నిజంగా అలాగే జరిగి ఉంటే తాను తాను ఈ సంఘటన కచ్చితంగా ఖండిస్తున్నానని చంద్రశేఖర్ పేర్కొన్నారు. అలాగే మండలంలో నలుగురు జనసేన నాయకులతో నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఈసందర్భంగా ఇన్చార్జి చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# ప్రజాభూమి

అనంతపురం,శ్రీసత్యసాయి జిల్లా 6

మంగళవారం 14 ఏప్రిల్ 2026


## వైస్సార్సీపీకి తీరని లోటు.. సీనియర్ నాయకుడు రామచంద్ర రెడ్డి కన్నుమూత

### పార్థివ దేహానికి నివాళులర్పించిన శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాభూమి, పుట్లూరు.

శింగనమల మండలం ఆకులేడు గ్రామానికి చెందిన వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు రామచంద్ర రెడ్డి మృతి పట్ల శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తీవ్ర దిగ్భ్రాంతి





వ్యక్తం చేశారు. పార్టీకి ఆయన చేసిన సేవలు అపారమని, ఆయన మరణం వైస్సార్సీపీకి తీరని లోటుగా మిగిలిపోతుందని అన్నారు. ఆకులేడు గ్రామానికి వెళ్లి రామచంద్ర రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిడఎన్నారై కోఆర్డినేటర్ ఆలూరు సాంబ శివారెడ్డి నివాళులర్పించారు. పార్టీ బలోపేతానికి కృషి చేసి, ప్రజలతో సన్నిహితంగా ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. ఆయనలాంటి నిస్వార్థ నాయకుడు ఇక మన మధ్య లేకపోవడం తీరని లోటుగా విచారం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో వారికి ధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

## చలివేంద్రం ప్రారంభం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సోమవారం ప్రారంభించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని కమిషనర్ సూచన మేరకు రోటరీ క్లబ్ ప్రతినిధులు స్థానిక రోటరీ రోడ్డులో రూ.15 వేలు వెచ్చించి శుద్ధ జల ప్లాంట్ ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు అక్కడ చలివేంద్రాన్ని ప్రారంభించడం పట్ల కమిషనర్ అభినందించారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు కళ్యాణ్ కుమార్, కార్యదర్శి శ్రీధర్ గౌడ్, శ్రీ సత్య సాయి జిల్లా జోన్ సహాయ గవర్నర్ సుమంత్, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి స్వాతి, విశ్రాంత ఉపాధ్యాయురాలు తులజాబాయి తో పాటు రోటరీ, ఇన్నర్ వీల్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పి జి ఆర్ ఎస్ కు వచ్చే ప్రతీ పిటీషన్ ను విచారించి చట్ట పరిధిలో పరిష్కారం చూపండి: జిల్లా ఎస్పీ

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుండీ 169 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు పి జి ఆర్ ఎస్ వచ్చే ప్రతీ పిటీషన్ ను చట్ట పరిధిలో విచారించి పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన నాణ్యతగా పరిష్కారం చూపాలనే రాష్ట్ర ప్రభుత్వం సంకల్పం మేరకు జిల్లా ఎస్పీ సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్ ( ప్రజా సమస్యల పరిష్కార వేదిక ) కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలమూలల నుండీ వచ్చిన ప్రజల నుండీ ఎస్పీ గారు 169 ఫిర్యాదులు స్వీకరించారు. పిటీషనర్లతో ముఖాముఖి మాట్లాడారు. లోతుగా వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భార్యాభర్తల గొడవలు, కుటుంబ సమస్యలు, రస్తా వివాదాలు, తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. ఇస్కాన్ వారి సౌజన్యంతో పిటీషనర్లు, వారి వెంట వచ్చిన సహాయకులకు ఉచితంగా భోజనం అందించారు. ఈకార్యక్రమంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ వి.శ్రీనివాసరావు, మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాభూమి ప్రతినిధి అనంతపురం



అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించగా, ఇందులో భాగంగా జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తో పాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ ఏ.మలోల, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, పద్మావతి, అఖిల, ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయం గోపుర నిర్మాణానికి విరాళం -ఆలయ ప్రతినిధులకు అందజేసిన కొండూరు వేణుగోపాల్ రెడ్డి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూమకుంట పంచాయితీ దేవరపల్లిలో గ్రామ దేవత సప్పలమ్మ ఆలయ గోపుర నిర్మాణానికి మాజీ వైకాపా సమన్వయకర్త కొండూరు వేణు గోపాల్ రెడ్డి విరాళం అందించారు. గ్రామంలో నూతన దేవాలయం నిర్మిస్తున్న సందర్భంగా సోమవారం దేవరపల్లి కమిటీ సభ్యులు, గ్రామస్థులు హిందూపురం పట్టణంలో హిందూపురం సీనియర్ నాయకులు కొండూరు వేణుగోపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సప్పలమ్మ ఆలయానికి విరాళాన్ని కోరగా ఆయన స్పందించి ఆలయ గోపుర నిర్మాణం కోసం రూ.25 వేల నగదు కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు వేణుగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి ఎంపీపీ నారాయణ స్వామి, చిలమత్తూరు మండల నాయకులు శెట్టిపల్లి జగన్మోహన్ రెడ్డి, దేవరాజు, బి.జి రామాంజి, బి.హెచ్ చంద్రశేఖర్, వార్డుమెంబర్లు గౌరమ్మగారి మూర్తి, పవన్ కుమార్, వాటర్ మ్యాన్ భీమా, సంజీవరాయప్ప, వాల్మీకి హనుమంతు, బీరప్ప, అశ్వర్థప్ప, పెద్ద నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిని అజరామరం చేశారు

- ఐదుకోట్ల ఆంధ్రుల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి నారా లోకేష్, ఎంపీ అంబిక, ఎన్డీఏ ఎంపీలు.
- రైతుల త్యాగ ఫలితమే అమరావతి
- పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుందన్న రాష్ట్రపతి

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



ఆంధ్రప్రదేశ్ సరికొత్త చరిత్రకు దేశ ప్రథమపౌరురాలు సాక్షి సంతకం కావడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టమని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబిక లక్ష్మీనారాయణ ప్రశంసించారు. ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్ష అయిన రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించిన బిల్లుకు దేశమంతా ఒక్కటై మద్దతు ఇవ్వగా, రాజముద్ర వేసి అమరావతికి శాశ్వతత్వం కల్పిస్తూ శాసనం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆంధ్రులు జేజేలు పలుకుతున్నారు.హామా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్-మా రాజధాని అమరావతి అని ఆంధ్రజాతి సగర్వంగా తల ఎత్తి చాటేలా చారిత్రక అమరావతి రాజధాని చట్టంపై సంతకం చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి మంత్రి నారా లోకేష్, ఎన్డీఏ ఎంపీలు రాష్ట్రపతి భవన్‌లో కలిసి ధన్యవాదాలు తెలిపారు. విభజనతో కోలుకోని విధంగా ఆంధ్రప్రదేశ్ నష్టపోయిందని, రాజధాని లేని రాష్ట్రంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని గుర్తించి ఐదుకోట్ల ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ చట్టం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకి ఆంధ్రజాతి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా అమరావతి చరిత్ర-సంస్కృతి-రాజధానిలో పూర్తయిన నిర్మాణాలు, రైతుల ఉద్యమం, మాస్టర్ ప్లాన్ ప్రకారం మొత్తం నిర్మాణాలు పూర్తయితే అమరావతి రాజధాని ఎలా ఉంటుందో సూచించే ఊహా చిత్రాలు, పర్యావరణహిత నిర్మాణ విశేషాలతో రూపొందించిన పుస్తకాన్ని ఎంపీలతో కలిసి లోకేష్ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి అందజేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ అమరావతి కి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీ, 2024 లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమరావతి పనులు పునః ప్రారంభించింది ప్రధాని నరేంద్ర మోదీ అని రాష్ట్రపతికి వివరించారు. రైతుల త్యాగ ఫలితమే అమరావతి రాజధాని ఏర్పాటు కోసం చంద్రబాబు గారి పిలుపుతో 58 రోజుల్లోనే 34 వేల ఎకరాల భూములు రైతులు త్యాగం చేశారని, గత పాలనలో వారిపై దాడులు జరిగినా, అక్రమ కేసులు పెట్టినా, శాంతియుతంగా రాజధాని కోసం ఉద్యమించారని రాష్ట్రపతికి లోకేష్ వివరించారు. కోట్లాది ప్రజల కోరిక అయిన అమరావతి చట్టం తన హయాంలో రూపొందడం సంతోషంగా ఉందని, రైతులురాష్ట్రంపై ప్రేమతో రాజధాని నిర్మాణం కోసం తమ భూమిని ఇచ్చారని రాష్ట్రపతి రైతుల త్యాగాలను కొనియాడారు. పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని ఆయన దూరదృష్టితో రాష్ట్రాన్ని, రాజధాని అద్భుతంగా అభివృద్ధి చేస్తారని, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనించాలని, రాజధాని పనులు నిర్విఘ్నంగా కొనసాగాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు.

## వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన

### -కలశాభిషేకం, అన్నదానం

ప్రజాభూమి, హిందూపురం టౌన్



హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం నూతన ధ్వజస్తంభం ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. తెల్లవారు జాము నుండి దేవాలయంలో పూజాది కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. మూలవిరాట్



అయ్యప్ప స్వామికి విశేష అభిషేకములు, అర్చనలు వేదమంత్రోచ్ఛారణతో వివిధ దేవతా హోమాలు నిర్వహించారు. ఆలయం విశిష్టత కోసం ఆలయం ముందు శాస్త్రోక్తంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. హోమాలు అనంతరం పూర్ణాహుతి స్వామి మూల విరాట్ కు మహా మంగళహారతి గావించి తీర్థప్రసాదాలు అందించారు. భక్తులందరికీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు డిఈ రమేష్ కుమార్, దేవీ అనిల్ కుమార్, ధ్వజస్తంభ సేవకులు రాణి కృష్ణ, పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటేష్, గురుస్వాములు లింగప్ప, నాగరాజు, ప్లేట్ల వెంకటేష్, బీజేపీ నాయకులు పార్థసారథి, మాజీ కౌన్సిలర్ గిరీష్, మంజుల, దుర్గా నవీన్, సాగు నీటి సంఘం అధ్యక్షులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టసభల్లో మహిళల పాత్రపై సదస్సు

### -ఆకట్టుకున్న విద్యార్థినిల ప్రసంగాలు

ప్రజాభూమి,
హిందూపురం టౌన్



మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెడుతున్న సందర్భంగా ఉన్నత విద్యా విభాగం ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఎన్.ఎస్.పీ.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సదస్సుని నిర్వహించారు. నారీశక్తివందన అభియాన్ పేరుతో జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం. ప్రగతి అధ్యక్షత వహించారు. మహిళా సాధికారత కోసం చేసిన ఎన్నో పోరాటాలు చేసిన ఫలితంగానే ఈనాటి మహిళా స్వావలంభన సాధ్యమైందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. రాజకీయాల్లో మహిళల పాత్ర తగ్గిపోవడానికి గల కారణాలు, రాజకీయ అవకాశాలు వస్తే, వివిధ హోదాల్లో మహిళా నాయకురాలిగా ఏ విధంగా రాణిస్తారు, సమాజానికి ఏ విధంగా ఉపయోగపడతారు, ఇందులో తీసుకువచ్చే సంస్కరణలు తదితర ఆరు అంశాలపై ఆరు బృందాలుగా దాదాపు 28 మంది విద్యార్థులు తమ అభిప్రాయాలను వేదిక మీద కూర్చొని అద్భుతంగా ప్రసంగించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థులు వ్యవహరించిన తీరు అభినందనీయమని ప్రిన్సిపాల్ అభిప్రాయపడ్డారు. ఆయా బృందాలకు నాయకత్వం వహించిన అధ్యాపకులను ప్రిన్సిపాల్ ప్రత్యేకంగా అభినందించారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సింహగిరిపై చందనోత్సవం ఏర్పాట్లు పరిశీలించిన హోం మంత్రి అనిత

### పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

### సామాన్య భక్తుల దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం:హోం మంత్రి అనిత.

ప్రజాభూమి, సింహాచలం



ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రికి అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఆమెకు వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఈ నెల 20న జరగనున్న స్వామివారి చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను మంత్రి సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. చందనోత్సవం సందర్భంగా భారీగా భక్తులు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అదేవిధంగా ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను ఆలయం వద్ద సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సీసీటీవీ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి నిరంతర పర్యవేక్షణ నిర్వహించడంతో పాటు, ఆధునిక ఏఐ టెక్నాలజీని వినియోగించాలన్నారు.భక్తులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు విస్తృతంగా పంపిణీ చేయాలని సూచించారు. ఈ ఏర్పాట్లు పరిశీలనలో విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంక బ్రత బాగ్చి, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, సింహాచలం ఆలయ ఈవో వెంకటరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, చందనోత్సవం ఒక అపురూపమైన ఘట్టమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా భక్తులు స్వామివారి నిజరూప దర్శనం కోసం వస్తారని చెప్పారు. భక్తుల సౌకర్యార్థం 10 ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు, తాగునీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పిస్తున్నాం అని మంత్రి వెల్లడించారు.

## 16న ఉచిత ఈఏపీ సెట్, నీట్ మోడల్ పరీక్ష

### -విజయవంతం చేయాలని పిడిఎస్ యూ పిలుపు

### -గోడపత్రికల విడుదల



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలో సప్తగిరి కళాశాలలో ఈ నెల 16వ తేదీన పిడిఎస్ యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈఏపీ సెట్, నీట్ మోడల్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఆ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు బాబావలి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఇందుకు సంబంధించిన గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాబావలి మాట్లాడుతూ, ఈనెల 16వ తేదీన సప్తగిరి కళాశాల పరీక్ష కేంద్రంగా పిడిఎస్ యూ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మోడల్ ఈఏపీ సెట్, నీట్ పరీక్షను జయప్రదం చేయాలని కోరారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ ఎంసెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మోడల్ పరీక్ష రాయడం వల్ల విద్యార్థులకు ఎంసెట్ పరీక్ష పట్ల ఉన్న భయాన్ని తొలగిపోయి ధైర్యంగా ఎంసెట్ పరీక్ష రాస్తారని తెలిపారు ఈ మోడల్ పరీక్షాపత్రం ప్రముఖ విద్యావేత్తల నేతృత్వంలో తయారు చేయించి నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎంసెట్ రాస్తున్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ నాయకులు నాగేంద్ర, నరసింహమూర్తి, మహేష్, అనిల్, ధర్మతేజ, చరణ్ రెడ్డి, చలపతి, వంశీ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## సప్తగిరి ప్రీమియర్ లీగ్ విజేత సాయిబాబా జట్టు



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని సప్తగిరి డిగ్రీ కళాశాలలో ఈ నెల 10వ తేదీ నుండి 13వ తేదీ వరకు నిర్వహించిన సప్తగిరి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా సాయిబాబా జట్టు నిలిచింది. ఈ టోర్నమెంట్ లో మొత్తం 25 జట్లు పాల్గొన్నట్లు సప్తగిరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనాథరెడ్డి, ఏవో గంగిరెడ్డి తెలిపారు. సోమవారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో సాయిబాబా, మోదా జట్లు తలపడగా ఈ టోర్నమెంట్ విన్నర్ గా సాయిబాబా జట్టు, రన్నర్ గా మోదా జట్టు నిలిచాయి. విన్నర్స్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.5116 నగదు, రన్నర్ జట్టుకు ట్రోఫీ తోపాటు రూ.2116 నగదు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయ స్వామి దీపోత్సవం

ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం మున్సిపల్ పరిధిలోని సూగూరు సడ్లపల్లి గ్రామంలో అభయాంజనేయ స్వామికి సోమవారం దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సడ్లపల్లి గ్రామంతో పాటు సమీప ప్రాంతంలోని ఎన్టీఆర్ కాలనీ. బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ మహిళలు, యువతులు బియ్యం పిండి, బెల్లంతో తయారుచేసిన సెలిమిడిని ప్రత్యేకంగా అలంకరించుకుని ఊరేగింపుగా దేవాలయం చేరుకున్నారు. దేవాలయానికి భక్తిశ్రద్ధలతో మేళ తాళాలతో జ్యోతులు మోసుకొని ఊరేగింపుగా విచ్చేసి ఆలయ ప్రదర్శన గావించి స్వామివారికి దీపారాధన చేసి తమ భక్తిని చాటుకున్నారు. వేద పండితులు వేదమంత్రాలతో ఆంజనేయ స్వామి మూల విరాట్ విగ్రహానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించడంతోపాటు పూజలు నిర్వహించారు. దేవాలయంలో మహా మంగళ హారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. సడ్లపల్లి తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.



# లక్షలాది ఎకరాల ప్రజల ఆస్తిని బడా కంపెనీలకు ధారాదత్తం చేయడాన్ని ఆపండి

## డైవర్షన్ పాలిటిక్స్ పేరుతో దర్టీ పాలిటిక్స్ చేస్తున్నారు -రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలి -సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య




మదనపల్లి, ప్రజాభూమి ప్రతినిధి :- రాష్ట్రంలో లక్షలాది ఎకరాల ప్రజల ఆస్తిని బడా కంపెనీలకు ధారాదత్తం చేయడం తీవ్రంగా ఖండిస్తున్నామని,ప్రజల భూములను కార్పొరేట్ శక్తుల చేతుల్లో పెట్టి, సాధారణ ప్రజలను నష్టపరచే విధానాన్ని ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలని, డైవర్షన్ పాలిటిక్స్ పేరుతో దర్టీ పాలిటిక్స్ చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆరోపించారు. సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లి సీపీఐ కార్యాలయంలో ఈశ్వరయ్య విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ భూమి అనేది పేదలు, రైతులు, గిరిజనుల జీవనాధారం. అలాంటి విలువైన ఆస్తిని కొంతమంది లాభాల కోసం తాకట్టు పెట్టడం ప్రజా వ్యతిరేక చర్య. ప్రస్తుతం ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోంది. అసలు సమస్యలైన నిరుద్యోగం, రైతు సంక్షోభం, ధరల పెరుగుదల వంటి అంశాలపై దృష్టి పెట్టకుండా దర్టీ పాలిటిక్స్ చేస్తూ ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం అన్నారు రాష్ట్ర అభివృద్ధి ఒకే ప్రాంతానికి పరిమితం కాకుండా అన్ని ప్రాంతాలకు సమానంగా వికేంద్రీకరణ జరగాలి. ప్రాంతీయ అసమానతలు తగ్గించేందుకు ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావాలి. విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు అన్నీ సమానంగా విస్తరించాలి. ప్రభుత్వం వెంటనే ప్రజా వ్యతిరేక విధానాలను విరమించుకొని, ప్రజల అవసరాలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం 99 పైసలకే 99 సంవత్సరాలకు ప్రభుత్వ భూములను ఇవ్వడం సహేతుకం కాదన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం బెజవాడ స్వరాజ్ మైదానాన్ని ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వాలని చూస్తే హైకోర్టు తిరస్కరించిందన్నారు. పిపిపి పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వం బృహత్తర నగర ప్రణాళిక పేరుతో రెండు లక్షల 36వేల ఎకరాల ప్రభుత్వ భూమిని పెద్దపెద్ద కంపెనీలకు నామమాత్రపు ధరలకు అందించాలనే కుట్ర జరుగుతుందన్నారు. 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలల నిర్మాణాలకు 5 వేల కోట్లు అందించలేని ప్రభుత్వం ఔటర్ రింగ్ రోడ్ పేరుతో 140 మీటర్ల వెడల్పుతో, 189 కిలోమీటర్ల రహదారిని నిర్మించడం ఎలా సాధ్యమౌతుందని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న 10 ప్రభుత్వ మెడికల్ కళాశాలల 600 ఎకరాలను బడా వైద్య సంస్థలకు అందించాలనే కుట్రను భగ్నం చేశామన్నారు. ప్రతి ఇళ్ళు, వ్యాపార సంస్థ, ఆఫీసులు, కర్మాగారాల పై సోలార్ విద్యుత్ ను ఉత్పత్తి చేయగలిగితే విద్యుత్ సమస్యను అధిగమించగలమని, అలా కాకుండా సోలార్ విద్యుత్ పేరుతో వేలాది ఎకరాలు ప్రైవేట్ విద్యుత్ సంస్థలకు అందిస్తే విద్యుత్ పంపిణీలో లైన్ లాస్ ఉంటుందన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలో తొక్కి ఆ చట్టం స్ఫూర్తిని రాష్ట్రప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. మాజీ మంత్రివర్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పేర్ని నాని ప్రసంగిస్తూ 26 వేలకోట్ల రూపాయల సబ్సిడీ తోపాటు వందలాది ఎకరాలు కేటాయించిన గూగుల్ డేటా సెంటర్ వలన ఆంధ్రప్రదేశ్ కు ఏమి లాభం చేగొరుతుందో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు తెలపాలన్నారు. లులు కంపెనీ అహ్మదాబాద్ వేలం ద్వారా భూములు కొనుక్కుని వ్యాపారం చేస్తుంటే విశాఖపట్నంలో ఉచితంగా 13.74 ఎకరాలు లులు కంపెనీకి ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. నేటి ప్రభుత్వం దేవదాయ, వక్ఫ్ భూములను సైతం బడా కంపెనీలకు 99 సంవత్సరాలకు లీజుకు ఇచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు నేటి ప్రభుత్వానికి 5 సంవత్సరాల అధికారం ఇస్తే 99 సంవత్సరాలు పాటు భూములను ఎలా ధారాదత్తం చేస్తారన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ అమరావతిలో రిజర్వ్ బ్యాంక్ కు ఎకరా 4 కోట్ల చొప్పున భూముల ను అమ్మి, మరోవైపున వి.ఐ.టి. ఎస్.ఆర్.ఎం, అమృత లాంటి ప్రైవేట్ విద్యాసంస్థలకు ఎకరా 50 లక్షల రూపాయల చొప్పున 700 ఎకరాలకు పైగా కేటాయించడం పట్ల సహేతుకత లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి నేటి వరకు ఆంధ్రప్రదేశ్ లో భూములు కేటాయింపులు ఎవరెవరికి ఏయే ధరలకు అందించారో తెలుపుతూ శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. రహేజా, ఉర్స లాంటి కంపెనీలకు ఏ ప్రాతిపదికన ప్రభుత్వ భూములను కేటాయించారో తెలపాలన్నారు. గత 22 నెలలుగా దాదాపుగా భూముల కేటాయింపులు లేని మంత్రివర్గ సమావేశాలు లేవన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి. రమాదేవి ప్రసంగిస్తూ జాతీయ సంపదగా ఉండాల్సిన భూమిని అభివృద్ధి పేరుతో కొద్ది మంది బడా కంపెనీలకు ధారాదత్తం చేయడం ద్వారా అసమానతలు మరింత పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మహేష్,సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, మనోహర్ రెడ్డి, మురళి,సిద్దిగాళ్ళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మదనపల్లె డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బి. పావని..

- జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఎస్పీ..
- మదనపల్లి పట్టణ ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశం..



మదనపల్లె,ప్రజాభూమి ప్రతినిధి : - మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బి.పావని సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2023 వ బ్యాచ్ లో నేరుగా డీఎస్పీ గా ఎంపికైన ఆమెకు ఇదితొలి పోస్టింగ్. బాధ్యతలు స్వీకరించిన అనంతరం, ఆమె మదనపల్లి లోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ కి పూలమొక్కను అందజేసి విధుల్లో చేరినట్లు నివేదించిన డీఎస్పీకి ఎస్పీ శుభాకాంక్షలు తెలుపుతూ, సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణపై దిశానిర్దేశం చేశారు.మదనపల్లె పట్టణంలో ప్రధాన సమస్యగా మారిన ట్రాఫిక్ రద్దీపై ఎస్పీ ప్రత్యేకంగా చర్చించారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలి. అక్రమ పార్కింగ్, రహదారుల ఆక్రమణలపై కఠినంగా వ్యవహరించి ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి కల్పించాలి. డీఎస్పీగా తొలి బాధ్యతలే మదనపల్లె వంటి కీలక డివిజన్‌లో రావడం శుభపరిణామమని, శక్తివంచన లేకుండా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్, సైబర్ నేరాల పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం గస్తీ పెంచాలని, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. బాధితులు ధైర్యంగా స్టేషన్‌కు వచ్చి తమ సమస్యలు చెప్పుకునేలా సిబ్బంది పనితీరు ఉండాలని, తక్షణ న్యాయమే లక్ష్యంగా పనిచేయాలని స్పష్టం చేశారు.అనంతరం డిఎస్పీ జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ఎం. వెంకటాద్రి ని కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. డీఎస్పీ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు మదనపల్లె పట్టణ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎక్కడా రాజీ పడబోనని ఆమె పేర్కొన్నారు.

# బోడే రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహారదీక్షకు సంపూర్ణ మద్దతు - కె.జీవానందం మేధావుల ఫోరంరాష్ట్ర కన్వీనర్

ప్రజా భూమి బ్యూరో అన్నమయ్య



బిసి నాయకులు బోడే రామచంద్ర యాదవ్ చేపట్టిన 'బిసి ధర్మ దీక్ష'కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎ.పి మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె. జీవానందం తెలిపారు.సోమవారం రాయచోటిలో రాయలసీమ జిల్లాల మేధావుల ఫోరం నాయకులు పి.దేవేంద్ర,పెద్దన్న,శంకర్, వెంకటస్వామి తో కలిసి విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన ఈ మేరకు వెల్లడించారు. బిసి రక్షణ చట్టం,బీసీ కులాల కార్పొరేషన్ లకు నిధులు, సమగ్ర కులగణన,చట్టసభల్లో బీసీలకు 44% రిజర్వేషన్ల డిమాండ్లతో బోడే రామచంద్ర యాదవ్ చేపట్టిన ధర్మ దీక్షను మేధావుల ఫోరం పూర్తిగా బలపరుస్తోంది" అని జీవానందం పేర్కొన్నారు.బిసిలు రాష్ట్ర జనాభాలో 50% పైగా ఉన్నప్పటికీ రాజ్యాధికారంలో, సంపదలో తగిన వాటా దక్కడం లేదని, కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహాత్మా పూలే, సావిత్రీబాయి పూలే, నారాయణ గురు, పెరియార్ వంటి మహనీయులు కలలుగన్న సామాజిక న్యాయం సాధనకు ఈ ధర్మ దీక్ష ఒక బలమైన అడుగు అని అభివర్ణించారు.బిసి ధర్మ దీక్ష డిమాండ్లు నెరవేరే వరకు రాష్ట్రంలోని అన్ని కుల సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు ఏకమై ఉద్యమించాలని, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్చలకు పిలవాలని ఎ.పి మేధావుల ఫోరం డిమాండ్ చేసింది. బిసిల హక్కుల సాధన కోసం జరిగే ప్రతి ప్రజాస్వామ్య పోరాటానికి తమ ఫోరం అండగా ఉంటుందని కె. జీవానందం స్పష్టం చేశారు.


# మిషన్ ఎయిడ్స్ సురక్ష కర్యక్రమాన్ని విజయవంతం చేయండి

## ఎయిడ్స్ నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### అడిషనల్ డి ఎం.హెచ్.ఓడాక్టర్.ఎల్.రాధిక

ప్రజాభూమి బ్యూరో అన్నమయ్య

ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని డిస్ట్రిక్ట్ అడిషనల్ డి.ఎం హెచ్.ఓ.డాక్టర్ ఎల్.రాధిక హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషన్లతో , ఐ సి టి సి కౌన్సిలర్స్ తోను, డాక్టర్ తోను నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ మిషన్ ఎయిడ్స్ సురక్ష కార్యక్రమం లో భాగంగా జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను ప్రతి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.



ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పరీక్షలు, కౌన్సెలింగ్, మందుల సరఫరా విషయంలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్ వేంపల్లి మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సేవలు అందించాలని ఆయన స్పష్టం చేశారు. గర్భిణీ స్త్రీల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారికి అవసరమైన వైద్య సేవలు సమయానికి అందించాల్సిన అవసరం ఉందన్నారు.జిల్లాలో అందరూ సమన్వయంతో పని చేస్తే ఎయిడ్స్ వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. జిల్లాలోని సబ్సెంటర్లలో హెచ్ఐవి స్క్రీనింగ్ లక్ష్యాలను 95 శాతం వరకు చేరుకోవాలని, అలాగే హెచ్ఐవి ఉన్న వారిలో 95 శాతం మందికి చికిత్స అందించాలన్నారు. వైరల్ లోడ్ నియంత్రణలో 99 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రైవేట్ రంగంలో కూడా అదే స్థాయిలో సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్ గారు, వైద్యులు, టి ఐ సిబ్బంది, దిశ స్టాఫ్, జయ కుమార్ ప్రసాద్, సిలార్ మరియు ఆనంద్, చంద్ర మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## ఇల్లు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోండి

### పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ రవి

ప్రజాభూమి,పులివెందుల



పేదల సంతింటికల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇండ్లు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని పులివెందుల టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవి అన్నారు. సోమవారం ఆయన టిడిపి నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మారెడ్డి జోగి రెడ్డి, ముని రెడ్డి, షబ్బీర్ లు సోమవారం ఆర్డిఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ పులివెందు ల, వేంపల్లె సింహాద్రిపురం పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉండి ఇల్లు లేని వారు ఎవరైనా ఉంటే, వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వం తరఫున అందరికీ ఇళ్ల పట్టాలు ఇప్పించి, హౌసింగ్ స్కీమ్ కింద ఇళ్లను మంజూరు చేయించాలనేది తెలుగుదేశం పార్టీ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు.?ఈ దిశగా ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ఇంకా ఎంతమంది పెండింగ్‌లో ఉన్నారు, అనే విషయాలపై అధికారులతో చర్చించడం జరిగింది అని తెలిపారు. మన నియోజకవర్గంలో భూమి లభ్యత ఎంత ఉంది అనే దానిపై కూడా ఆర్డిఓ , మున్సిపల్ కమిషనర్ ఇన్చార్జి కమిషనర్ , ఎంఆర్ఓ లకు పది రోజుల క్రితమే ఒక కార్యాచరణను సిద్ధం చేయమని తెలియజేయడం జరిగిందన్నారు.?వేంపల్లె వంటి ప్రాంతాల్లో భూమి కొరత ఉన్నందున, సుమారు 15 నుండి 20 ఎకరాల భూమిని సేకరించి, అవసరమై తే ముఖ్యమంత్రి తో మాట్లాడి తగిన ధర చెల్లించి భూమి కొనుగోలు చేస్తాము అని తెలిపారు. లేఅవుట్ వేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు కల్పించడమే మా బాధ్యత అన్నారు. పులివెందుల నియోజకవర్గంలో ఇల్లు లేని పేదవాడు ఉండకూడ దనేది మా లక్ష్యం అన్నారు.?ఇక జగనన్న కాలనీల విషయానికొస్తే, ఎంపీ అవినాష్ రెడ్డి స్వయంగా మేము ఎక్స్ట్రా బిల్లులు ఇచ్చామని చెప్పడం జరిగిందన్నారు. దానివల్ల కాంట్రాక్టర్లు ఎక్కువ డబ్బు తీసుకుని పని పూర్తి చేయకుండా వెళ్ళిపోయారు అని చెప్పడం జరిగిందన్నారు. దీనిపై కేసు నమోదు చేయడం జరిగింది అని కూడా చెప్పడం జరిగిందన్నారు. ప్రస్తుతం మరో సంస్థ ఈ పనులను పూర్తి చేయడానికి ముందుకు వచ్చింది ఆయన తెలిపారు. సుమారు 1500 నుండి 1800 ఇళ్లు పూర్తి కావాల్సి ఉంది, అవి వచ్చే ఆరు నెలల్లోగా పూర్తి చేసి గృహ ప్రవేశాలు జరిగేలా చూస్తాము అన్నారు.?గతంలో కొంతమంది దగ్గర బలవంతంగా 35,000 రూపాయలు కట్టించుకు న్నారు అన్నారు. ఆ డబ్బు మున్సిపల్ కమిషనర్ జాయింట్ అకౌంట్‌లో ఉంది అని తెలిపారు. ఎన్నికల ముందే నేను చెప్పాను, ఆ డబ్బు మీరు కట్టవద్దని, ముఖ్యమంత్రి తో మాట్లాడి, ఆ డబ్బును తిరిగి పేదలకు ఇప్పించే బాధ్యత మాది అన్నారు.

# భవిత కేంద్రంలో పీజీయో థెరపీ సేవలు

ప్రజభూమి :కంభంవారిపల్లి



కే వి పల్లి మండలం భవిత కేంద్రంలో ప్రతి సోమవారం పీజీయో థెరపీ కి సంబందించి డాక్టర్. కోమల ఆధ్వర్యంలో పీజీయో థెరపీ నిర్వహించినట్టు మండల విద్యా శాఖ అధికారులు పి.రెడ్డి భాష , కె. సుబ్రమణ్యం రెడ్డిలు తెలియచేశారు. ఈ కేంద్రంలో పీజీయో థెరపీ కి అవసరం అయిన సెర్బిల్ పాలసీ, లోకో మోటర్ వైకల్యం, శారీరక ఎదుగుదల సమస్యలు, పోలియో కండరాల క్షీణత,పుట్టుక తో వచ్చే వైకల్యాలు,వెన్నుముక సమస్యలు,కీళ్ల నొప్పులు, బిగుతూ వంటి సమస్యల ఉన్న విద్యార్థుల కు పీజీయో థెరపీ చేస్తున్నట్లు తెలియచేశారు . ఈ అవకాశాన్ని అవసరం అయిన విద్యార్థుల తల్లి తండ్రులు అందరూ వినియోగించుకోవాలని మండల విద్యా శాఖ అధికారులు తెలియచేశారు.

# తెలుగుదేశశీ కార్యకర్త శ్రీనివాస రావు కోసం తాలూకా పోలీస్ స్టేషన్ కి వెళ్ళిన ఎమ్మెల్యే షాజహాన్ భాష..



మదనపల్లి, ప్రజాభూమి ప్రతినిధి :- మదనపల్లి గ్రామీణ మండలం కోళ్ల బైలు పంచాయతీలో నివాసం ఉంటున్న సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు వంకాయలపాటి శ్రీనివాసరావు ఇంటి పై ఆదివారం మారనాయుధాలతో దౌర్జన్యం చేసిన విషయం అందరికీ విధితమే.. తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన జరగడంతో బాధితుడు శ్రీనివాసరావు తాలూకా పోలీస్ స్టేషన్ పోలీసులకు నిన్నటి దినం జరిగిన వివరాలను తెలిపేందుకు వెళ్లారు, విషయం తెలుసుకున్న మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా తాలూకా పోలీస్ స్టేషన్ కు చేరుకొని బాధితుడు శ్రీనివాసరావు కేసు లో దౌర్జన్యానికి పాల్పడిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐలు చంద్రమోహన్ కు సూచించారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరిగిన అవకతవకల నేపథ్యంలో తెలుగుదేశం వారిపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు.. ఆదివారం జరిగిన దాడుల్లో పాల్గొన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించినట్లు తెలిపారు...

# చట్టపరిదిలో బాధితులకు న్యాయం చేయాలి: - జిల్లా ఎస్పీ స్పష్టం..

మదనపల్లె,ప్రజాభూమి ప్రతినిధి



అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఈరోజు (సోమవారం) "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి నిర్వహించారు. జిల్లా ఎస్పీ ప్రజల సమస్యలను నేరుగా విని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించారు, కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భూ-ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమపేరుతో మోసాలు. మరియు ఇతర సమస్యలపై ఎస్పీ స్వయంగా విచారణ జరిపారు. ఎస్పీ ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిదిలో "తక్షణ న్యాయం అందించాలి -- ఆలస్యం చేయరాదు" అని ఆదేశించారు. చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే, వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలి అని స్పష్టం చేశారు.

# నలంద హైస్కూల్‌లో ఘనంగా పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రంలోని శ్రీ నలంద హైస్కూల్‌లో సోమవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.పాఠశాల కరస్పాండెంట్ బాలుగారి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల క్రమశిక్షణ, పాఠశాల సాధిస్తున్న ప్రగతిని కొనియాడుతూ వారి ఉజ్వల భవిష్యత్తు కోసం పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ బండారు రాజగోపాలయ్య, రిటైర్డ్ ఎంఈఓ పాలెం నారాయణ, నలంద అకడమిక్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ వెంకటేష్ పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఈ వేడుకలో పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# వృద్ధాశ్రమంలో 'మనఊరికోసం' సేవా సంస్థ అన్నదానం



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామానికి చెందిన 'మనఊరికోసం' స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మానవతా దృక్పథంతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ సభ్యుడు పసుపులేటి రామకృష్ణ తన తండ్రి కోదండరామయ్య జ్ఞాపకార్థం కొత్తమాధవరం సమీపంలోని శ్రీ కాశినాయన వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు అన్నదానం చేశారు. ఆహారంతో పాటు వారికి ఎనర్జీ డ్రింక్స్, పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సామల చెంగయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొని వృద్ధులకు సేవలు అందించారు.

# నేడు డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకుందాం.

**దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్**

ప్రజాభూమి,పులివెందుల



నేడు పులివెందుల పట్టణంలో అంబేద్కర్ 135 వ జయంతి సందర్బంగా ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసే కార్యక్రమాన్ని నిర్వహి ద్దామని దళిత ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కోలా ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన కార్యాలయం లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, భారత అభి వృద్ధి మలుపులో కీలకంగా వ్యవహరించిన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాలను నేడు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన పిలుపునిచ్చారు. భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా దేశంలో వుండాల్సిన చట్టాలను, పౌరుల కు వుండాల్సిన హక్కుల పై తన మేధస్సుతో అంబేద్కర్ రాజ్యాంగాన్ని రూపొందించా రన్నారు. ఉన్నత చదువులు చదువుకున్న అంబేద్కర్ భారత దేశంలో దారుణమైన కుల వివక్షత పైన, ఇక్కడ జరుగుతున్న ప్రజల మధ్య దారుణమైన అసమానాథలపైన పరిస్కారమార్గాలకు పునాది వేశారన్నారు. ఆయన అడుగుజాథల్లో మనందరం వెళ్లాలాలన్నారు. ఆయన ఆశయాలను, ఆదర్శాలను తీసుకొని భవిష్యత్ తరాలకు మంచి సమాజన్ని ఇచ్చే విధంగా మనంతా ఆయన ఆలోచన విధానాన్ని అధ్యయనం చేయాలని, అందుకు అనుగుణగా విద్యార్థి లోకం ముందుడాలన్నారు.

## జలధార--జలహారతి: పల్లమాల పెద్ద చెరువులో నీటి సంరక్షణకు శుభారంభం



ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ

తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండలంలోని పల్లమాల గ్రామంలో ఉన్న పెద్ద చెరువు వద్ద "జలధార--జలహారతి" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అధికారి కే. షణ్ముగం ముఖ్య అతిథిగా హాజరై, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీరు వ్యవసాయానికి ప్రాణాధారం అని ప్రతి నీటి బొట్టు రైతుకు అమూల్యమని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటి వనరుల సంరక్షణ అత్యవసరమైందని, చెరువులు, కాలువలు, వాగులు వంటి సంప్రదాయ జలవనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న జలధార కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలను పెంచడం, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి నిల్వపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. రైతులు కూడా ఈ కార్యక్రమాలకు సహకరించి, నీటిని వృథా చేయకుండా సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం చెరువు చుట్టూ శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, చెరువు పరిరక్షణపై ప్రతిజ్ఞ చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల నీటి విలువపై అవగాహన పెరుగుతుందని, భవిష్యత్ తరాలకు నీటి వనరులు అందుబాటులో ఉండేలా సంరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పల్లమాల గ్రామంలో నీటి సంరక్షణపై కొత్త చైతన్యం నెలకొంది. అధికారులు, ప్రజలు కలిసి పనిచేస్తే చెరువులు తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## రోడ్డు ప్రమాద బాధితుల కోసం 'రాహత్' పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ప్రారంభించారు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

'గోల్డెన్ అవర్'లో నగదు రహిత చికిత్సతో పాటు ప్రమాదం జరిగిన రోజు నుంచి 7 రోజుల పాటు రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. డయల్ 112 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని, ప్రాణ రక్షణే లక్ష్యంగా ఈ పథకాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోవిందా రావు, డీఎంహెచ్ఓ, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

## ఉచిత మెగా పశు వైద్య శిబిరానికి విశేష స్పందన



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ సంస్థ ఆధ్వర్యంలో నేడు రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది ప్రధాన కార్యదర్శి డాక్టర్. వెంకటరత్నం మరియు నాగరాజు వారి ఆదేశాల ప్రకారం రాస్ మహిళా పొదుపు సంఘాల కుటుంబ సభ్యుల సౌకర్యార్థం ఈ మెగా



వైద్య శిబిరాన్ని నిర్వహించారు . వెటర్నరీ డాక్టర్ స్రవంతి , రాస్ కృషి విజ్ఞాన కేంద్రం పశు వైద్యాధికారి డా. అనూష వారి ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. మొత్తం 79 పశువులకు గాను 33 దూడలకు పిడుదులు, గోమార్లు, బొటాక్స్ మందులను స్ప్రే చేయడం జరిగింది. 18 మేకలకు నట్టల నివారణ మందులు, అలాగే 13 పశువులకు సాధారణ చికిత్సలు మరియు 15 గర్భకోశ చికిత్సలు అందించారు. ఈ వైద్య శిబిరం 27 కుటుంబాలకు ఉపయోగపడింది. అంతకుముందు ఏర్పాటు చేసిన సమావేశంలో పశువులకు తీసుకోవలసిన జాగ్రత్తలు సమ్మర్ లో వచ్చే సీజనల్ వ్యాధులకు సంబంధించిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. అనారోగ్య పశువులకు ఉచితంగా మందుల పంపిణీ చేశారు. ఈ శిబిరంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ రవి, అన్బలగన్ ,రామానుజులు, శంకరయ్య, స్వాతి, జ్యోతి,ఉష తదితరులు పాల్గొన్నారు.

## ఇంటికో మహిళా వ్యాపార వేత్త లక్ష్యం - వెలుగు శిక్షణా కార్యక్రమం - ఏపిఎం మునేయ్య

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో విఓఏలు, ఈ-నారీలు, సీఆర్పీలకు 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక రుణాలు మరియు జీవనోపాధుల ప్రణాళికపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మునెయ్య మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రతి సంఘంలోని సభ్యురాలికి సీఐఎఫ్, ఉన్నతి, స్త్రీనిధి, బ్యాంక్ రుణాల ద్వారా లభించే అవకాశాలను సమగ్రంగా వివరించారు. ప్రతి సభ్యురాలు ఏ నెలలో ఏ రుణం ద్వారా ఏ జీవనోపాధి ఏర్పాటు చేసుకుంటారనే వివరాలను యాప్ ద్వారా సేకరించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయానికి అనుగుణంగా "ఒక కుటుంబంలో ఒక వ్యాపార వేత్త" లక్ష్యంతో ఈ సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మహిళా వ్యాపారవేత్తలను తయారు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి గ్రామ సంఘంలో కనీసం 20 మంది మహిళలను గుర్తించి, వారికి తగిన రుణాలు అందించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అదేవిధంగా మొబైల్ బుక్‌కీపింగ్ విధానం ద్వారా ప్రతి సభ్యురాలి ముఖ ఆధారిత నమోదు జరగడం వల్ల గ్రూప్ మీటింగ్స్ 100 శాతం పారదర్శకంగా నిర్వహించవచ్చని చెప్పారు. సీఐఎఫ్, స్త్రీనిధి లావాదేవీలు నగదు రహితంగా నిర్వహించడం ద్వారా నిధుల మళ్లింపు, దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని తెలిపారు. స్త్రీనిధి మేనేజర్ వనజ మాట్లాడుతూ, గత ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి రుణాల మంజూరు మరియు రికవరీలో 100 శాతం లక్ష్యాన్ని సాధించడంలో సభ్యుల సహకారం ఎంతో ముఖ్యమైందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం రూ.16.80 కోట్ల రుణాల మంజూరు లక్ష్యంతో పాటు రికవరీ కూడా పూర్తిస్థాయిలో సాధించాలని సూచించారు. సభ్యులు స్థిరమైన జీవనోపాధులు ఏర్పాటు చేసుకుంటేనే రుణాల తిరిగి చెల్లింపు సులభమవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీసీలు పయని, వెంకటరత్నం, జీవ, అకౌంటెంట్ హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

## సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ శక్తి ప్రదర్శన - మండల అధ్యక్షుల ఘన ప్రమాణ స్వీకారం

### బి ఎన్ కండ్రిగ మండల అధ్యక్షుడిగా, ఎర్రపోతు చెంచు రామానాయుడు

ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా సత్యవేడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మస్తాన్ కళ్యాణ మండపంలో ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి పార్లమెంట్ ఇంచార్జ్ పనబాక లక్ష్మి, యాదవ సంఘం అధ్యక్షుడు నరసింహా యాదవ్, సత్యవేడు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి, హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ముందుగా సత్యవేడు ఇంచార్జ్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి మండల అధ్యక్షులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసి, కార్యకర్తలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. తిరుపతి పార్లమెంట్ ఇంచార్జ్ పనబాక లక్ష్మి మాట్లాడుతూ, టీడీపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలపర్చాలని సూచించారు. ప్రతి నాయకుడు కట్టుబాటుతో పని చేస్తే విజయాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు. యాదవ సంఘం అధ్యక్షుడు నరసింహ యాదవ్ మాట్లాడుతూ, సామాజిక వర్గాల సమన్వయంతో పార్టీ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం బుచ్చినాయుడు కండ్రిగ మండల అధ్యక్షుడిగా ఎర్రపోతు చెంచు రామానాయుడు ప్రమాణ స్వీకారం చేశారు ఆయనతోపాటు వరదయ్యపాలెం మండల అధ్యక్షుడు పి యుగంధర్ రెడ్డి, సత్యవేడు మండల అధ్యక్షుడు శివకుమార్ నాయుడు, నాగలాపురం మండల అధ్యక్షుడు ప్రణీత్ రెడ్డి, పిచ్చాటూరు మండల అధ్యక్షుడు సతీష్ నాయుడు, నారాయణవనం మండల అధ్యక్షుడిగా గిరిబాబు, కేవీపీ పురం మండల అధ్యక్షుడిగా మన స్వామి యాదవ్, సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల టీడీపీ అధ్యక్షులు ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. బి. ఎన్ కండ్రిగ నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున ర్యాలీగా వచ్చి, చెంచు రామానాయుడు ని సన్మానించారు, ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీకి కొత్త ఉత్సాహాన్ని నింపిందని నాయకులు కార్యకర్తలు పేర్కొన్నారు.

## బడి ఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా బడిలో చేరాలి

### బడి పిల్లల నమోదు పెంపు దిశగా "మన సంకల్పం -- విద్యా ప్రగతి" కరపత్రం ఆవిష్కరణ-జిల్లా కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్.



తిరుపతి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న "మన సంకల్పం -- విద్యా ప్రగతి" ఎన్రోల్మెంట్ డ్రైవ్‌కు సంబంధించిన కరపత్రాన్ని తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ కె.వి.ఎన్. కుమార్ తో కలసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా సంస్కరణలు, డిజిటల్ విద్యా విధానాలు, మరియు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. "మన సంకల్పం -- విద్యా ప్రగతి" కార్యక్రమం ద్వారా జిల్లాలో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా వాతావరణం, ఆధునిక సౌకర్యాలు, మరియు సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసి, తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రోత్సహించడం ఈ డ్రైవ్ ప్రధాన లక్ష్యం అని తెలియపరచలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీమతి సుశీలాదేవి, బీసీ వెల్ఫేర్ అధికారి భరత్ కుమార్, సీపీఓ రాజశేఖర్, మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్వర్ణ చంద్రగిరి అభివృద్ధికి జిల్లా అధికారులు సమిష్టిగా కృషి చేయాలి - జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్.



తిరుపతి, ఏప్రిల్ 13: స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధి నమూనాను ఆదర్శంగా తీసుకొని, స్వర్ణ చంద్రగిరి ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో, స్వర్ణ చంద్రగిరి అభివృద్ధి అంశంపై తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, స్వర్ణ చంద్రగిరి ప్రత్యేక అధికారి మరియు జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నూతన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, చిరుధాన్యాల సాగుపై రైతులను ఆకర్షిస్తూ పీఎండీఎస్ కిట్లను అందించాలని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పాల ఉత్పత్తి అభివృద్ధి, రైతు బజార్ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని అన్నారు. ఉద్యానవన రంగంలో మామిడి తోటల అభివృద్ధికి మ్యాంగో ఫ్రూట్ కవర్ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. చంద్రగిరి పరిధిలోని చెరువులను గుర్తించి, మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా రంగంలో డిజిటల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేయాలని, పాఠశాలలలో పెండింగ్ లో పనులను సమర్థవంతంగా అమలు చేయాలని, 'మనబడి -- మన భవిష్యత్తు' కార్యక్రమం కింద పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రణాళికను పటిష్టంగా అమలు చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, ఇంప్రూవ్‌మెంట్ ప్యానెల్‌లు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, యోగా తరగతులు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. స్వర్ణ చంద్రగిరిలో ప్రతి ఇంటికి రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయాలని సూచించారు. జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ అందించాల్సిందిగా చెప్పారు. పశువైద్య అధికారులు పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు అందజేశారు. గేదెలు, ఎద్దులు, మేకలు, గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. అలాగే కీటకనాశన మందులు పంపిణీ చేసి పశువులను వ్యాధుల నుండి రక్షించే చర్యలు చేపట్టాలన్నారు.పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, బీమా సదుపాయాలపై రైతులకు వివరాలు తెలియ చేయాలన్నారు. ఆధునిక పద్ధతుల్లో పశుపోషణ చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. శిబిరంలో పాల్గొన్న రైతులు పశువుల సంరక్షణకు సంబంధించిన సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ శిబిరం ద్వారా పశువుల ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో పాటు రైతులకు ఉపయోగకరమైన సమాచారం అందించాలని తెలిపారు. సంజీవని ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని, ఏబిహెచ్ఏ నమోదును 100% పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, పోషణ్ 2.0 పథకంపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల ద్వారా యువతకు శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఎంపీడీవోలు యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను పూర్తి చేయాలని, ప్రతి ఒక్కరికీ ఆధార్, జనన ధృవపత్రాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద స్వర్ణ చంద్రగిరి అభివృద్ధికి సంబంధించిన పనులను పూర్తి చేయాలని, జిల్లా అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. అన్ని శాఖ ల వారు అందరూ సమన్వయంతో వారికి కేటాయించిన విధులను నిర్దేశించిన సమయంలోపల పూర్తి చేయాలని సూచించారు. అనంతరం భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నారీ శక్తి వందన సమ్మేళనానికి సంబంధించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రసంగిస్తున్న సందేశాన్ని వర్చువల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో డి ఈ ఓ కుమార్, సి పి ఓ రాజశేఖర్, ద్వామా పి డి శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పి డి శోభన్ బాబు, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్,వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## రేణిగుంటను ప్రత్యేక నియోజకవర్గంగా ప్రకటించాలి : ఎంజి రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట పట్టణం అన్ని రంగాలలో శరవేగంగా, అభివృద్ధి చెందుతూ, భవిష్యత్తులో కీలక కేంద్రంగా ఎదగ, గల సామర్థ్యం ఉన్న ప్రాంతమని రేణిగుంట,పట్టణయువ నాయకుడు ఎంజీ రెడ్డి అన్నారు. రేణిగుంటలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయం, కలియుగదైవం శ్రీ వెంకటేశ్వర స్వామికి ముఖద్వారంగా ఉన్న ,ప్రముఖ రేణిగుంటరైల్వే జంక్షన్, అలాగే అభివృద్ధి చెందుతున్న ఇండస్ట్రియల్ కారిడార్ కలిగివున్న రేణిగుంట పరిసర ప్రాంతాలు,రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందని ఆయన పేర్కొన్నారు. రవాణా, పారిశ్రామిక మరియు వాణిజ్య రంగాల్లో ,బలమైన మౌలిక వసతులు రేణిగుంటను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నాయని అన్నారు. అదేవిధంగా రేణిగుంట పరిసర ప్రాంతాల్లో ఇంజనీరింగ్ కాలేజీలు, మెడికల్ కాలేజీలు విస్తృతంగా ఉండటం వల్ల విద్యా మరియు వైద్య రంగాల్లో కూడా ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందని తెలిపారు. విద్యార్థులకు, ప్రజలకు మెరుగైన ప్రయోజనఅవకాశాలు, మరియు మౌలికసదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఒక దశలో,రేణిగుంటలో పెరుగుతున్న జనాభాదృష్ట్యా కూడా అధికారులు ప్రత్యేకంగా ఆలోచన విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. , విస్తరిస్తున్న నగరీకరణ దృష్ట్యా ఈ ప్రాంతానికి ప్రత్యేక పరిపాలనా ప్రాముఖ్యత ఇవ్వాల్సిన అవసరం ఎంతైనాఉందని ఎం,జి,రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో రేణిగుంటను ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పాటు చేయడానికి అవసరమైన అన్ని అర్హతలు రేణిగుంట మండలపరిగణాల, అవసరాలను అధికారులు సమగ్రంగా పరిశీలించి గుర్తించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. "ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్, రైల్వే జంక్షన్, ఇండస్ట్రియల్ కారిడార్, అలాగే విద్యా మరియు వైద్య రంగాల్లో ఉన్న బలమైన వసతులు, పెరుగుతున్న జనాభా-రేణిగుంట ప్రజల అవసరాలు, ప్రాంతీయ అభివృద్ధి అవకాశాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు సానుకూలంగా స్పందించి రేణిగుంటను ప్రత్యేక శాసనసభ నియోజకవర్గంగా, తగిన నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. రేణిగుంట భవిష్యత్తు కోసం సమగ్ర అభివృద్ధి, పరిపాలన దిశగా, కూడా సులభతరం అవుతుందన, యువ నాయకుడు ఎం, జి, రెడ్డి అన్నారు .

## సంక్షేమ హాస్టల్స్‌లో సమస్యలపై బీజేపీ ఆందోళన -- తక్షణ చర్యల కోసం కలెక్టర్‌కు వినతి

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్.



రాష్ట్రవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ చేపడుతున్న "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బాల, బాలికల సంక్షేమ వసతి గృహాల్లో కొనసాగుతున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. జనతా వారధి కార్యక్రమం ద్వారా గ్రామాలు, పట్టణాలు సందర్శిస్తూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటున్న బీజేపీ, ఇటీవల సంక్షేమ హాస్టల్స్‌ను సందర్శించి విద్యార్థులు, వార్డెన్లు, సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుంది. డైట్ బిల్లుల చెల్లింపులు వేగవంతం కావడం, కాస్మోటిక్ అలవెన్సుల విడుదల, ఆహార నాణ్యతలో కొంత మెరుగుదల వంటి చర్యలను అభినందించినప్పటికీ, పలు హాస్టల్స్‌లో భవనాల దుస్థితి, శుభ్రత లోపం, తాగునీటి కొరత, సరైన పోషకాహారం అందకపోవడం, వైద్య సదుపాయాల కొరత, విద్యా సహాయం లేకపోవడం వంటి సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని పేర్కొంది. కొన్ని చోట్ల విద్యార్థులు తమ సమస్యలను వెల్లడించడానికి కూడా భయపడుతున్న పరిస్థితి ఆందోళనకరమని తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత వేసవి సెలవులను ఒక అవకాశంగా తీసుకుని సంక్షేమ హాస్టల్స్‌లో సమగ్ర మార్పులు తీసుకురావాలని బీజేపీ సూచించింది. విద్యార్థులు సెలవులకు వెళ్లే ముందు తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించడంతో పాటు, విద్యార్థుల సమస్యలను నమోదు చేసి పరిష్కరించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని హాస్టల్స్‌కు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఆడిట్ నిర్వహించి ప్రమాదకర భవనాలను పునర్నిర్మించడం, కనీస వసతి ప్రమాణాలను నిర్ధారించడం అవసరమని పేర్కొంది. ప్రస్తుత ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలను పెంచి నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు ప్రతి హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసి శుభ్రత కోసం ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించాలని సూచించింది. అలాగే విద్యా ప్రమాణాల పెంపు కోసం ట్యూటర్ల నియామకం, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాల కల్పన, అన్ని హాస్టల్స్‌లో సీసీటీవీ వ్యవస్థ ఏర్పాటు, బాలికల హాస్టల్స్‌లో మహిళా వార్డెన్ల నియామకం తప్పనిసరి చేయాలని పేర్కొంది. బిల్లుల చెల్లింపును పారదర్శకంగా డిబిటి విధానంలో అమలు చేయడం, ఫిర్యాదుల పరిష్కారం కోసం టోల్-ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయడం, ప్రతి నెల వైద్య పరీక్షలు నిర్వహించడం, విద్యార్థులతో ఓపెన్ మీటింగ్స్ నిర్వహించి వారి సమస్యలను నేరుగా వినే విధానం తీసుకురావాలని సూచించింది. వేసవి సెలవులను "సంస్కరణల కాలం"గా మార్చి ప్రతి విద్యార్థిలో "ప్రభుత్వం మా వెంట ఉంది" అనే నమ్మకాన్ని పెంపొందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆరాల శ్రీధర్, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ కొండేటి ప్రేమ్ కుమార్, తిరుపతి ఈస్ట్ మండలం ప్రధాన కార్యదర్శి కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లాలో గతంలో ఒంటరి మహిళలను లక్ష్యంగా చేసుకుని బంగారు ఆభరణాల కొరకు జరిగిన వరుస హత్య కేసులు) మిస్టరీ ని చేధించిన జిల్లా పోలీసులు



ప్రజా భూమి ప్రతినిధి రామచంద్రపురం.

జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో2024 వ సం. నుండి ఇప్పటి వరకు నమోదు కాబడిన కేసుల చేధింపును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్) ఏ. శ్రీనివాసులు . ఆధ్వర్యములో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు. రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 11-01-2026 వ తేదీన జరిగిన మహిళ హత్య మరియు బంగారు ఆభరణాల చోరీ హత్య పలు కేసులు) కేసులో అరెస్టు కాబడిన ముద్దాయి పి. విశ్వనాథ్ ఏ ప్రశాంత్ గౌరవ కోర్ట్ ఉత్తర్వుల ప్రకారం తిరుపతి జజూ, పరిధిలో జరిగిన రాబరీ కేసులో తదుపరి దర్యాప్తు నిమిత్తము పోలీస్ కస్టడీ కి తీసుకుని విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం. పోలీసుల కస్టడీ విచారణలో ఆశ్చర్యకరమైన మరియు సంచలనాత్మకమైన వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చిన దర్యాప్తు బృందం. తిరుపతి జిల్లా పరిధిలో జరిగిన సంచలనాత్మకమైన తిరుచానూరు పోలీస్ స్టేషన్ లో నమోదు కాబడిన రెండు హత్య కేసులు, తిరుపతి క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధి లో రిపోర్ట్ కాబడిన ఒక రాబరీ కేసు తో పాటు పిచ్చాటూర్ పోలీస్ స్టేషన్ లో నమోదు కాబడిన ఒక హత్య పలు కేసులు (మొత్తం నాలుగు కేసుల మిస్టరీ ని ఛేదించి, సదరు ముద్దాయి ని అంతర రాష్ట్ర మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అయిన ఎ.ఎం. అజీజ్ ఏ అబ్దుల్ అజీజ్ ఏ కర్ణాటక అజీజ్ గా గుర్తింపు. 2018 వ సంవత్సరంలో కేరళ పోలీసుల కస్టడీ నుండి తప్పించుకుని తిరుగుతున్న ఎ.ఎం. అజీజ్ ఏ అబ్దుల్ అజీజ్ ఏ కర్ణాటక అజీజ్ఏ ప్రశాంత్ ఏ విశ్వనాథ్, అప్పట్లో అతని ఆచూకీ తెలిపిన వారికి రెండు లక్షల రివార్డు ప్రకటించిన కేరళ పోలీస్ శాఖ. కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం సుమారు 21 కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా కి చెందిన విశ్వనాథ్ యొక్క ఆధార్ కార్డు ని తన గుర్తింపు నిమిత్తం ఉపయోగించినట్లు నిర్ధారణ. పోలీస్ కస్టడీ లో ముద్దాయి ద్వారా రాబడిన సమాచారము మేరకు నేరాలలో అతనికి సహకరించిన వెదురుకుప్పం మండలానికి చెందిన రాజమ్మ అనే మహిళ అరెస్ట్. సుమారు రూ.20.5 లక్షల విలువ కలిగిన 127.5 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు 48 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు, నేరాలకు ఉపయోగించిన ఆటో స్వాధీనం. తిరుపతి జిల్లా పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్ ల పరిధిలో నమోదు కాబడిన హత్య కేసులతో పాటు వివిధ దొంగతనాల కేసులను జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్.,ప్రతిష్టాత్మకంగా తీసుకుని జిల్లా అడిషనల్ యస్. పి. (క్రైమ్స్) ఏ. శ్రీనివాసులు గారి నేతృత్వం లో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగినది. ఈ కేసు వివరాలను తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు ఐపిఎస్., ఈరోజు ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు. (పరిపాలన) శ్రీనివాసులు (క్రైమ్) డిఎస్పి గీత .(ఎస్బి ఇంచార్జ్) శ్యాంసుందర్ సిసిఎస్ గారు సీసీఎస్ పోలీస్ స్టేషన్ వారు పాల్గొన్నారు. దర్యాప్తు లో భాగంగా రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారు ఆభరణాల కోసం ఒక మహిళను హత్య చేసిన కేసులో 23.01.2026వ తేదీన అరెస్టు కాబడిన ముద్దాయి పి. విశ్వనాథ్ ఏ ప్రశాంత్ ను తిరుపతి క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధి కి చెందిన రాబరీ కేసు లో కోర్టు ఉత్తర్వు ద్వారా పోలీస్ కస్టడీ కి తీసుకొని విచారించడం జరిగింది. విచారణ లో భాగంగా ముద్దాయి పి. విశ్వనాథ్ ఏ ప్రశాంత్ యొక్క అసలు పేరు ఎ.ఎం. అజీజ్ ఏ అబ్దుల్ అజీజ్ ఏ కర్ణాటక అజీజ్ (వయస్సు 39 సంవత్సరాలు), తండ్రి మహమ్మద్, స్వస్థలం అజ్జావర గ్రామం, సులియా తాలూకా, దక్షిణ కన్నడ జిల్లా, కర్ణాటక రాష్ట్రము గా గుర్తించడం జరగింది.- ఇతని పై కర్ణాటక రాష్ట్రం లో ని వివిధ పోలీస్ స్టేషన్ ల పరిధి లో 4 కేసులు మరియు కేరళ రాష్ట్రము నందు కూడా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో 6 కేసులు మరియు తిరుపతి జిల్లా పరిధిలో 11 కేసులు కలిపి మొత్తం 21 కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ. 2018లో కేరళ రాష్ట్రంలో రాబరీ మరియు హత్య కేసులో పోలీస్ కస్టడీలో తీసుకువెళ్తున్న సమయంలో బేకల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని సులియా బస్ స్టాండ్లో పోలీసుల ఎస్కార్ట్ నుండి తప్పించుకుని పారిపోయి తిరుపతికి చేరుకున్నట్లు, అతని ఆచూకీ తెలిపిన వారికి అప్పట్లో కేరళ పోలీసులు 2 లక్షల రూపాయల బహుమతిని కూడా ప్రకటించినట్లు తెలిసినది. తిరుపతికి చేరుకున్న అనంతరం తన అసలు గుర్తింపును పూర్తిగా దాచిపెట్టి "పి. విశ్వనాథ్ ఏ ప్రశాంత్" అనే పేరుతో ఉన్న ఆధార్ కార్డును తన గుర్తింపు కార్డు గా ఉపయోగించుకొని, హోటళ్లలో పని చేస్తూ స్థానికులతో పరిచయాలు పెంచుకుని, ఈ క్రమంలో వెదురుకుప్పం మండలానికి చెందిన రాజమ్మ అనే మహిళతో పరిచయం ఏర్పరచుకుని, ఆమె సహకారంతో ఏపీ-39-యూఎస్ -9445 నంబరు గల ఆటో రిక్షాను కొనుగోలు చేసి, సదరు ఆటో రిక్షాను ఉపయోగించి పలు నేరాలకు పాల్పడినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. నిందితుని వాంగ్మూలం మేరకు, అతని వద్ద 51.5 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని, అతనికి నేరాలలో సహకరించిన వెదురుకుప్పం మండలానికి చెందిన యల్.రాజమ్మను ఈరోజు అనగా 12.04.2026 అరెస్టు చేసి, ఆమె వద్ద నుండి 76 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు 48 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. (రూ. 21.5 లక్షల రూపాయల విలువ గల 127.5 గ్రాముల బంగారు మరియు 48 గ్రాముల వెండి ఆభరణాలు తో పాటు ఒక ఆటోను స్వాధీనం). దర్యాప్తులో కీలక సమాచారము సేకరించడములోనూ, వివిధ కీలకమైన కేసులను ఛేదించి చోరీ సొత్తు ను స్వాధీనం చేసుకున్న దర్యాప్తు బృందం లోని తిరుపతి జిల్లా అడిషనల్ యస్. పి. (క్రైమ్స్) ఏ. శ్రీనివాసులు, క్రైమ్స్ డి.యస్.పి. వై.శ్యామ్ సుందర్, పు.త్తూరు డి.యస్.పి. జి.రవికుమార్ మరియు క్రైమ్స్ ఇన్స్పెక్టర్లు ఎన్. శివకుమార్ రెడ్డి, ఎం. దివాకర్ రెడ్డి, తిరుచానూరు ఇన్స్పెక్టర్ బి. సునీల్ కుమార్, పుత్తూరు రూరల్ ఇన్స్పెక్టర్ జి. రవీంద్ర, యస్.ఐ లు యం.నాగార్జున రెడ్డి, చిరంజీవి, సుభాన్ నాయక్, మల్లయ్య మరియు సిబ్బంది మురళి, వెంకటేశ్వర్లు, సుబ్రమణ్యం రాజు, రాజశేఖర్, మోహన్, రమేశ్, ప్రభాకర్, దామోదరం, శ్రీనివాసులు, రామకృష్ణ, మునిరత్నం, గోపి కృష్ణ, నాగరాజు శెట్టి, హరి ప్రసాద్ లను జిల్లా యస్.పి. ప్రత్యేకంగా అభినందించి వారందరికీ నగదు రివార్డులతి పాటు ప్రశంసాపత్రాలు ఇవ్వడం జరిగింది..

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 380 అర్జీలు

### ప్రజా సమస్యల పరిష్కార వేదిక ( పి జి ఆర్ ఎస్ ) కు వచ్చిన అర్జీదారుల సమస్యలపై సకాలంలో పరిష్కారం చూపాలి-:జిల్లా కలెక్టర్ డా, ఎస్. వెంకటేశ్వర్





ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో జిల్లా జాయింట్ కలెక్టర్ అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించి వారి సమస్యలను సావధానంగా వింటూ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీ జి ఆర్ ఎస్ లో వచ్చు అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శివశంకర్ నాయక్, రోజ్ మాండ్, అనురాధ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి లతో కలసి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించి, ఆన్లైన్ నమోదుతో సిబ్బంది రసీదులు అందించారు.

శాఖల వారీగా అర్జీల వివరాలు: రెవెన్యూ -226, పంచాయతీరాజ్ -26, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్- 15, పేదరిక నిర్మూలన సొసైటీ- 24, హోమ్ -16, సర్వే శాఖ- 6, డిజేబుల్ వెల్ఫేర్- 2, పాఠశాల విద్యాశాఖ- 8, ఎస్సీ కార్పొరేషన్ -1, నీటి వనరుల శాఖ- 4, హౌసింగ్ -3, విద్యుత్ శాఖ- 8, కుటుంబ సంక్షేమ శాఖ- 3, స్కిల్ డెవలప్మెంట్- 2, తుడా -1, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్- 4, సివిల్ సప్లైస్- 2, ఆర్టీసీ -1, రూరల్ డెవలప్మెంట్ -5, గనుల మరియు భూగర్భ శాఖ -1, ఎంప్లాయి మెంట్ -2, ఆర్ అండ్ బి -1, ఫుడ్ సేఫ్టీ -1, సాంఘిక సంక్షేమ శాఖ -1, టిడ్కో- 1, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్- 3, ఇంటర్మీడియట్ విద్యాశాఖ- 2, ఎస్టీ కార్పొరేషన్ -1, టూరిజం- 1, జాతీయ రహదారులు -1, చేనేత మరియు జౌళి- 1, గిరిజన సంక్షేమ శాఖ- 1, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్- 3, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు -1, దేవాదాయ శాఖ -1 , రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్- 1 మొత్తం 380 అర్జీలు రావడం జరిగిందని, సంబంధిత అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## నాయుడుపేటలో "హనుమాన్ జిమ్" ప్రారంభోత్సవం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైకాపా సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి.



ప్రజా భూమి ప్రతినిధి నాయుడుపేట.

తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో పిచ్చిరెడ్డి తోపు నందు సెంట్రల్ బ్యాంక్ ప్రక్కన పీ.లోకేష్ రెడ్డి నేతృత్వంలో నూతనంగా యువత కోసం ఏర్పాటు చేసిన హనుమాన్ జిమ్ ప్రారంభోత్సవానికి ఆదివారం వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు,ఉమ్మడి నెల్లూరు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి మరియు ప్రముఖ లాయర్ నాయుడుపేట మున్సిపల్ మాజీ కో ఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్సిపి నాయకులు చదలవాడ కుమార్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన జిమ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన కామిరెడ్డి రాజారెడ్డి,చదలవాడ కుమార్ కలసి వారి చేతుల మీదుగా నూతన హనుమాన్ జిమ్ ను ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా కామిరెడ్డి రాజారెడ్డి మాట్లాడుతూ నేటి తరం యువత "ఆరోగ్యమే మహా భాగ్యం" అన్న విషయాన్ని గ్రహించాలని అందుకోసం వారి శారీరక పరిపుష్టి పై శ్రద్ధ కలిగి ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా యువతకు మంచి ఫిట్నెస్ కలిగి ఉండే అవకాశాన్ని నాయుడుపేటలో ప్రారంభించినటువంటి హనుమాన్ జిమ్ ద్వారా యువత సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపేట యువతకి పిలుపునిచ్చారు..అలాగే లోకేష్ రెడ్డి అన్ని అధునాతన సౌకర్యాలతో హనుమాన్ జిమ్ ను ఏర్పాటు చేయడంతో చాలా సంతోష ంగా ఉందనీ నిరంతరం ప్రజలకు హనుమాన్ జిమ్ అందుబాటులో ఉంచాలని తద్వారా ప్రజల అభిమానాన్ని,ఆదరణను,విశ్వాసాన్ని పొందాలని లోకేష్ రెడ్డి వ్యాపారం మూడు పువ్వులు,ఆరు కాయలుగా దినదినాభివృద్ధి చెంది ఉన్నత స్థాయికి చేరుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తు ఎల్లప్పుడూ మా యొక్క సహాయ,సహకారాలు మీకు తోడుగా ఉంటాయని కామిరెడ్డి రాజారెడ్డి సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దోర్నాధుల మోహన్,కె.ఆర్.ఆర్ యూత్ గౌతమ్ (చిన్న),అజయ్ కుమార్,ఆకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి తమ ఆహ్వానాన్ని గౌరవించి విచ్చేసి హనుమాన్ జిమ్ ను ప్రారంభోత్సవం చేసినటువంటి కామిరెడ్డి రాజారెడ్డి, చదలవాడ కుమార్ కి హనుమాన్ జిమ్ అధినేత లోకేష్ రెడ్డి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు..

## నిర్ణయాధికారంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి "మహిళా రిజర్వేషన్"

### స్త్రీశక్తి కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్.



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

నిర్ణయాధికారంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికె మహిళా రిజర్వేషన్ ప్రవేశపెట్టినట్లు తిరుపతి జిల్లా సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ చెప్పారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత,ఎన్ఎస్ఎస్ విభాగం హోన్న,ఓ హరి ప్రసాద్ ఆధ్వర్యంలో స్త్రీశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకుహూ33 శాతం (మూడింట ఒక వంతు)హొసీట్లను రిజర్వ్ చేసే చారిత్రాత్మక చట్టమన్నారు.2023 సెప్టెంబర్లో పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదం పొందిందన్నారు. 15 ఏళ్ల పాటు అమరలో ఉండే ఈ బిల్లులో ఎస్సీ ఎస్టీ మహిళలకు కూడా రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు.మహిళా రిజర్వేషన్ వల్ల చట్టసభలలో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందన్నారు.మహిళలకు రిజర్వ్ చేయబడిన సీట్లు ప్రతి డీలిమిటేషన్ తర్వాత రొటేషన్ (మార్పు) చేయబడతాయన్నారు. తద్వారా రాజకీయాల్లో లింగ సమానత్వాన్ని సాధించవచ్చును అన్నారు.ఈ బిల్లు వల్ల 2029 నాటికి పార్లమెంటు మరియు అసెంబ్లీలలో మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నట్టు ఆయన వివరించారు.ఇందిరా గాంధీ,మమతా బెనర్జీ,మురుము వంటి వారు ఆదర్శమన్నారు. తదనంతరం మహిళా రిజర్వేషన్కు మద్దతుగా తీర్మానం చేశారు.మహిళా సాధికారత ప్రతిబింబించే పాటను విద్యార్థులు పాడారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రవిశంకర్, వెంకటేశ్వర్లు,ఎం హరిప్రసాద్,మురళీమోహన్, సుధాకర్,ఈశ్వరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏర్పేడు తాసిల్దార్ గా రాజశేఖర్. మర్యాదపూర్వకంగా కలిసిన ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పారి రమేష్.



ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.

శ్రీకాళహస్తి నియోజవర్గం ఏర్పేడు మండల తాసిల్దార్గా రాజశేఖర్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రగతి సంస్థ ఏర్పేడు మండలం కోఆర్డినేటర్ శిరీష అదేవిధంగా ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ పారి రమేష్. మర్యాదపూర్వకంగా కలిసి తాసిల్దార్ రాజశేఖర్ నీ శాలువాతో సత్కరించి ప్రజా భూమి డైరీ అందజేయడం జరిగింది.ఇక్కడ తాసిల్దార్ గా ఉన్న భార్గవిని జిల్లా కలెక్టరేట్ కు బదిలీ చేశారు ఆ స్థానంలో సత్యవేడు తాసిల్దార్ గా పనిచేసిన రాజశేఖర్ ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించి.. మీడియాతో మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలు యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించడానికి తాను అన్ని విధాలా చొరవ చూపుతానని, భూ ఆక్రమణల పై ఉక్కు పాదం మోపుతానని, ఫిర్యాదుల్లో వాస్తవం ఉండాలని ఆయన పేర్కొన్నారు.

## హెచ్చరిక ఉన్నా..చెత్త చెత్తే..



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు పట్టణంలో పలుచోట్ల చెత్త సమస్య తీవ్రంగా మారింది. అధికారులు పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ప్రజలు నిర్లక్ష్యంగా ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. దీంతో కాలుష్యం పెరిగి, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంచాయితీ పారిశుధ్య కార్మికుల పనితీరును పర్యవేక్షించే మేస్త్రి పనితీరు అధ్వానంగా ఉందని స్థానికులు వాపోతున్నారు ఆయన ఎక్కడుంటారు? ఎప్పుడు వస్తారో ఎవరికీ తెలియడం లేదు పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారులు వీధుల బాట పట్టిన దాఖలాలు కనిపించలేదు దాంతో స్థానికులు కూడా ఎక్కడబడితే అక్కడ చెత్తను పోసేస్తున్నారు ప్రధానంగా మహాత్మా గాంధీ విగ్రహం పరిసరాలు చుట్టూ ఉదయం అయితే నిత్యం చెత్తతోనే దర్శనమిస్తున్నాయి ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య విషయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రాష్ట్రపతి ముర్మకు కృతజ్ఞతలు తెలియజేసిన మంత్రి నారా లోకేష్ , చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు కూటమి ఎంపీల బృందం




ప్రజా భూమి ప్రతినిధి -చిత్తూరు

అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఆమోదించిన బిల్లుకు ఆమోదముద్ర వేసినందుకు ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ . చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ,కూటమి ఎంపీల బృందం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కృతజ్ఞతలు తెలిపారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్లో జరిగిన ఈ భేటీలో, రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతూ, అమరావతి విశిష్టతను వివరించే బుక్లెట్ను మంత్రి లోకేష్ సమర్పించారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ..రాష్ట్రపతి ద్రౌపది ముర్మును సోమవారం ఉదయం మంత్రి నారా లోకేష్ , కూటమి ఎంపీల బృందం కలసి, అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో చివరి చట్టపరమైన అడుగుకు ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలియజేసినట్లు చెప్పారు. రాష్ట్రపతి ముర్మును కలిసిన వారిలో కేంద్ర మంత్రి డి.శ్రీనివాస వర్మ , పలువురు తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఎంపీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము, సీఎం చంద్రబాబు విజన్ను, రాజధాని అమరావతి కోసం భూములను ఇచ్చిన రైతులను (33 వేల ఎకరాలు) అభినందించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి అభివృద్ధికి రాష్ట్రపతి, కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలని రాష్ట్రపతి ముర్మును రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ . కోరినట్లు ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు . వెల్లడించారు.

## రుచికరమైన స్వచ్ఛత కల్గిన "స్కందా కాఫీ కేఫ్" శ్రీకాళహస్తిలో ప్రారంభం

### స్కందా కాఫీ కేఫ్ ప్రారంభంలో పాల్గొన్న మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి





ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.

శ్రీకాళహస్తి పట్టణంలో వీఎంసీ థియేటర్ ఎదురుగా "స్కందా కాఫీ కేఫ్" ని ఈ రోజు ఉదయం అత్యంత వైభవంగా ప్రారంభించడం జరిగింది. అగ్రికల్చర్ శాఖలో అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తున్న, చిన్నాటి స్నేహితుడు మణి కుమారుడు ఫణి కుమార్ హోటల్ మేనేజ్మెంట్ చదువుకుని స్వచ్ఛతతో పాటు ఆరోగ్యాన్నిచ్చే పాల ఉత్పత్తితో స్కందా కాఫీ కేఫ్ వ్యాపారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి ఫణి కుమార్ ని శ్రీకాళహస్తీశ్వరా స్వామీవారి దేవస్థానం శేష వస్త్రంతో ఘనంగా సన్మానించి ఆశీర్వాదించారు.

## కటికాల భాగ్యలక్ష్మి ని పరామర్శించిన :మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

శ్రీకాళహస్తి పట్టణం, భాస్కర్ పేటకు చెందిన వైఎస్ఆర్సీపీ నాయకుడు కటికాల రమేష్ సతీమణి కటికాల భాగ్యలక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురై, ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటూ కోలుకుంటున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి గారు వారి నివాసానికి వెళ్లి, భాగ్యలక్ష్మి ని పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్ఆర్సీపీ రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పులి రామచంద్ర, ఈశ్వరయ్య, కంఠ ఉదయ్ కుమార్, బొమ్మన సురేంద్ర, శ్రీవారి సురేష్, మున్నా రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 10

మంగళవారం 14 ఏప్రిల్ 2026

## విద్యార్థుల భవిష్యత్తుకు వృత్తి విద్యే బాట -- బుచ్చినాయుడు కండ్రిగలో వేసవి శిక్షణ శిబిరం. విజయవంతం




ప్రజా భూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ తిరుపతి జిల్లా బి.ఎన్ కండ్రిగ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ 4, 2026 నుండి ఏప్రిల్ 13, 2026 వరకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో సమాచార సాంకేతిక -- సమాచార సాంకేతిక సేవల విభాగానికి సంబంధించిన వేసవి శిక్షణ నైపుణ్య కోర్సు విజయవంతంగా నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం చివరి రోజున ప్రధానోపాధ్యాయులు రమణయ్య శిక్షణ తరగతులను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు అనేక ప్రాయోగిక నైపుణ్యాలను నేర్చుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, జీవితంలో స్థిరపడాలంటే వృత్తి విద్యా కోర్సులు ఎంతో ముఖ్యమని, విద్యార్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సమాచార సాంకేతిక -- సేవల వృత్తి శిక్షకురాలు యు. పార్వతమ్మ సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేయడంతో పాటు, ఇలాంటి శిక్షణలు మరింతగా నిర్వహించాలని కోరారు.

## రేణిగుంట మండల తాసిల్దారుగా, జి,శ్యాంప్రసాద్ కు బాధ్యతలు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

తిరుపతి జిల్లా రేణిగుంట మండలం తహసిల్దారుగా శ్యాం ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, శుభాకాంక్షలు



తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దిలీప్ (ఆర్ఎస్డిటి) , కరుణాకర్ మండల సర్వేయర్,ఎ. శంకర్ వీఆర్వో,శ్రీకాళహస్తి డివిజన్ విఆర్ఓ అసోసియేషన్ ప్రెసిడెంట్, బాబు రేణిగుంట మండల విఆర్ఓ అధ్యక్షులు, హేమంత్ ఆర్గనైజింగ్ సెక్రటరీ,ఖ. సుబ్రహ్మణ్యం, నలిని, రామ్మూర్తి, దిలీప్ విఆర్వోలు, మరియు వీఆర్ఏలు కార్యాలయ సిబ్బంది ప్రజా ప్రతినిధులు, టిడిపి సీనియర్ నాయకులుసుబ్రహ్మణ్యం రెడ్డి , ముని చంద్రారెడ్డి, సింగల్ విండో భాస్కర్ రెడ్డి, జీ పాల్యం రాజశేఖర్ రెడ్డి, కాపీ రెడ్డి నాదముని రెడ్డి, అనాసంపల్లి భాస్కర్ రెడ్డి తదితరపాల్గొన్నారు

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో యువకుడికి 14 రోజుల జైలు, రూ. 10వేల జరిమానా




ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట (రూరల్)


మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసులు, న్యాయస్థానం ఉక్కుపాదం మోపుతున్నాయి. మద్యం సేవించి వాహనం నడిపిన ఒక యువకుడికి తిరుపతిలోని స్పెషల్ జేఎస్సీఎం కోర్టు,కఠిన శిక్ష విధిస్తూ సోమవారం విడుదల చేసింది. వడమాలపేట మండలం, టి.సి. అగ్రహారం గ్రామానికి చెందిన మునేంద్ర (25), తండ్రి బి. భాస్కర్ రెడ్డి, మద్యం సేవించి ఎన్.ఆర్. ఐ. విద్యాసంస్థల వాహనం నడుపుతూ గాజులమండ్యం పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుడిపై ఎం.వి. చట్టం సెక్షన్ 185(ఎ)కింద కేసు నమోదు చేసిన పోలీసులు, సోమవారం (13.04.2026) నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరిచారు. విచారణ సందర్భంగా నిందితుడు తన నేరాన్ని అంగీకరించడంతో, గౌరవ న్యాయమూర్తి 275 (బి ,ఎన్ ,ఎస్ ,ఎస్) సెక్షన్ కింద నిందితుడికి 14 రోజుల సాధారణ జైలు శిక్ష (13.04.2026 నుండి 26.04.2026 వరకు) విధించారు. జైలు శిక్షతో పాటు రూ. 10,000/- (పది వేల రూపాయలు) జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మీ ప్రాణాలతో పాటు అమాయక ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుంది. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని గాజులమండ్యం పోలీసులు హెచ్చరించారు.

## తిరుపతి జిల్లా రేణిగుంట ఫుట్‌బాల్ పండుగ

### జూన్ 5 నుంచి సౌత్ ఇండియన్ 7ఎస్ టోర్నీ.



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట. క్రీడాభిమానుల ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సౌత్ ఇండియన్ 7ఎస్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహణకు రేణిగుంట ముస్తాబవుతోంది.స్థానిక ఇండియన్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో జూన్ 5, 6, 7 తేదీలలో ఈ పోటీలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. రేణిగుంట రైల్వే స్టేషన్ వెనుక భాగంలో ఉన్న రైల్వే ఇన్‌స్టిట్యూట్ గ్రౌండ్ ఈ భారీ క్రీడా సమరానికి వేదిక కానుంది. దాదాపు అర్థ శతాబ్దం నుండి సాగుతున్న ఈ టోర్నమెంట్‌కు ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఈసారి మరిన్ని హంగులతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా టోర్నమెంట్ ప్రతినిధి మునిరత్నం (బాబు) మాట్లాడుతూ.. ప్రతిభ ఉన్న ప్రతి క్రీడాకారుడికి ఈ ఓపెన్ టోర్నమెంట్ ఒక అద్భుతమైన వేదిక అని కొనియాడారు.గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈ ఏడాది ఎటువంటి లోటుపాట్లు లేకుండా



కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఆయన స్పష్టం చేశారు. కేవలం ఆట కోసమే కాకుండా, క్రీడాకారుల ప్రోత్సాహం కోసం భారీ స్థాయిలో బహుమతులను ప్రకటించడం ఈ టోర్నీ ప్రత్యేకత అని ఆయన పేర్కొన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్లకు నగదు పురస్కారాలు ప్రథమ బహుమతి: 1,00,000 (ఒక లక్ష రూపాయలు),ద్వితీయ బహుమతి: 80,000,తృతీయ బహుమతి: 3,000,నాల్గవ బహుమతి: 2,000,వీటితో పాటు ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు వ్యక్తిగత బహుమతులు కూడా అందజేయనున్నారు.దూర ప్రాంతాల నుండి వచ్చే జట్ల కోసం నిర్వాహకులు ప్రత్యేకంగా బోర్డింగ్ లాడ్జింగ్ (వసతి, భోజన) సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఆసక్తి కలిగిన ఫుట్‌బాల్ జట్లు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాల కోసం రిజిస్ట్రేషన్ల కోసం 9949298357 అనే నంబర్‌ను సంప్రదించాలని మునిరత్నం విజ్ఞప్తి చేశారు.స్థానిక జనాదరణ మెండుగా ఉన్న ఈ టోర్నీని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# మత్స్యకారుల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోంది

### తీర ప్రాంత మత్స్యకార గ్రామాల మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రామం నిర్వహణ: జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్. తిరుపతి, జిల్లాలోని తీర ప్రాంత మత్స్యకార గ్రామాల మత్స్యకారుల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు, అటవీ శాఖ అధికారి సాయి బాబ,లతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్. సోమవారం మధ్యాహ్నం ..... తీర ప్రాంత మత్స్యకార గ్రామాల మత్స్యకారులతో ముఖాముఖి కార్యక్రామం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....మత్స్య కారులకు శాశ్వత పరిష్కారం కొరకు 4 బోట్లను గస్తీ కొరకు మంజూరు చేయడం జరిగినది. అందులో 2 బోట్లు -నెల్లూరు, 1 బోటు తిరుపతి, 1బోటు ప్రకాశం మత్స్య కారులు కోరుకునే విధంగా 800 ఇంజనుతో త్వరలో అందించుటకు అన్ని చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మత్స్యకారుల భద్రత, సంక్షేమం ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఇతర రాష్ట్రాల అక్రమంగా నుంచి వచ్చే బోట్లను నియంత్రించడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ మేరకు 24 గంటల గస్తీ విధానం అమలు చేస్తూ, ఉదయం, మధ్యాహ్నం, రాత్రి షిఫ్టుల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అన్నారు. మెరైన్ పోలీసులతో సమన్వయం చేసుకుని లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్, బైనాక్యులర్స్ వంటి అవసరమైన సామగ్రి అందజేస్తామన్నారు. మెరైన్ పోలీసులకు సుమారు రూ.25 లక్షల నిధులు మంజూరు చేసి, అవసరమైన పరికరాలు కొనుగోలు చేసుకునేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్త బోట్లు కూడా త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. జువ్వలదిన్నె ప్రాంతంలో చిన్న జెట్టీ ఏర్పాటు విషయాన్ని ప్రభుత్వానికి నివేదించి, త్వరితగతిన చర్యలు చేపడతామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా వచ్చే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, బోట్లను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ విధంగా నిరంతర పర్యవేక్షణతో వారి ప్రవేశాన్ని పూర్తిగా అడ్డుకుంటామని తెలిపారు. రెవెన్యూ, పోలీస్, ఫిషరీస్, ఫారెస్ట్ శాఖలు గ్రామస్థులతో సమన్వయం చేసుకుని వారి సూచనలు తీసుకుంటూ ముందుకు సాగాలని కోరారు. ప్రభుత్వం మత్స్య కారుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని మత్స్యకారుల ఆదాయం దెబ్బతినకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ఎస్.పి. సుబ్బారాయుడు మాట్లాడుతూ.... మత్స్యకారుల భద్రతను మరింత బలోపేతం చేయడానికి గ్రామ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామం నుండి ప్రతినిధులను తీసుకుని, మత్స్యకారులు, ఫిషరీస్ శాఖ, మెరైన్ పోలీస్ కలిసి ఒక సమన్వయ వ్యవస్థగా పని చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏదైనా సమస్య వచ్చిన వెంటనే స్పందించే విధంగా ఈ కమిటీలు పనిచేస్తాయని, ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు పటిష్టమైన పెట్రోలింగ్ వ్యవస్థను అమలు చేయడానికి అవసరమైన అన్ని సూచనలు నమోదు చేసుకున్నామన్నారు. త్వరలోనే 800 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన స్టీల్ బోట్‌ను ఏర్పాటు చేసి, 24/7 విధానంలో డ్రైవర్, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మెరైన్ పోలీస్, సంబంధిత శాఖల సిబ్బంది నిరంతరం బోటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని, అవసరమైతే సాగర మిత్రలు లేదా ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని కూడా వినియోగిస్తామన్నారు. బోట్లలో సైరన్, బైనాక్యులర్స్, లైఫ్ జాకెట్లు, లైఫ్ బాయ్స్ వంటి అన్ని భద్రతా పరికరాలను ఏర్పాటు చేస్తామని, అదనంగా చిన్న బోట్లు కూడా అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం కృష్ణపట్నం నుండి కార్యకలాపాలు నిర్వహించడం వల్ల సమయం ఎక్కువగా పడుతున్న నేపథ్యంలో, సమీప ప్రాంతంలో కొత్త జెట్టీ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. మెరైన్ పోలీస్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడానికి కొత్త బోట్లు మరియు అవసరమైన పరికరాలను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు మీ గ్రామ ప్రతినిధులు వెంటనే మెరైన్ పోలీస్, పోలీస్, రెవెన్యూ, ఫిషరీస్ శాఖలకు సమాచారం అందిస్తే, అధికారులు తక్షణమే స్పందించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని మత్స్యకారులు తమకు సమస్యలు తలెత్తి నప్పుడు అధికారులకు సమాచారం చేరవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట ఆర్డీఓ దేవేంద్ర రెడ్డి, డిఎస్పీ లు, అటవీ శాఖ అధికారులు, మత్స్య శాఖ అధికారి రాజేష్, రమణ,సంబందిత అధికారులు, మత్స్యకార గ్రామాల కాపు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# హరిప్రియ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం... బాధితుడు ప్రాణాలతో చెలగాటం

### - న్యాయం చేయాలని కోరుతూ బాధితుడు ఆర్ బి ఎస్ రాము కలెక్టర్, డి ఎం హెచ్ ఓ కు ఫిర్యాదు

### - కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్పిటల్ యాజమాన్యంపై రెండు కమిటీలు వేయనున్నట్లు డి ఎం హెచ్ ఓ వెల్లడి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి కలెక్టరేట్. తిరుపతి ఎంఆర్ పల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని హరిప్రియ హాస్పిటల్ వైద్యుల నిర్లక్ష్యం... బాధితుడు ఆర్ బి ఎస్ రాము ప్రాణాలతో చెలగాడాటంతో పాటు అతనికి జరిగిన అన్యాయం పై సోమవారం జిల్లా కలెక్టరేట్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) లో తిరుపతి జిల్లా కలెక్టర్, డి ఎం హెచ్ ఓ కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే డి ఎం హెచ్ ఓ స్పందించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు హాస్పిటల్ పై రెండు కమిటీలు వేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం బాధితుడు ఆర్ బి ఎస్ రాము మాట్లాడుతూ తాను మంగళం డోర్ నెంబర్ 203, సెకండ్ ఫ్లోర్, వాసవి దీప్తి టవర్స్, మంగళం లో కాపురం ఉంటున్నామని అన్నారు. కడుపు నొప్పి కారణంతో తిరుపతి ఎం ఆర్ పల్లి పోలీస్ స్టేషన్ సమీపంలోని హరిప్రియ హాస్పిటల్లో ఏప్రిల్ 28 2025న చేరడం జరిగిందన్నారు. అన్ని పరీక్షలు నిర్వహించి పిత్తాశయంలో రాయి ఉందని చెప్పి సర్జరీ చేసి జూన్ 18 2025 అన్న డిశ్చార్జ్ చేశారు. ఆపరేషన్ చేసిన తిరిగి యధా ప్రకారం జ్వరం కడుపునొప్పి వాంతులు దురద రావడంతో తిరిగి హరిప్రియ హాస్పిటల్ ఎండి డాక్టర్ ఆదిత్యాను కలవడం జరిగిందన్నారు. మళ్లీ పరీక్షలు నిర్వహించి పిత్తాశయం దగ్గర చీము ఉందని చెప్పారు. కానీ నిజానికి ఆపరేషన్ సమయంలో కామన్ డాక్ట్ కి గాయం కావడంతో టైప్ ఎ బైల్ లీక్ అయింది. ఈ విషయాన్ని దాచిపెట్టి ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ల బృందం మోసం చేయడంతో పాటు నా ప్రాణాలతో చెలగాటం ఆడారని ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత కేస్ రిపోర్ట్ తీసుకొని జులై 4 2025న మధు గ్యాస్ట్రో లివర్ హాస్పిటల్కు వెళ్లడం జరిగిందని చెప్పారు. హాస్పిటల్లో అన్ని పరీక్షలు నిర్వహించి హరిప్రియ హాస్పిటల్ యాజమాన్యం వైద్యుల చేసిన నిర్వహణ గురించి వివరించి వెంటనే బాధితున్ని చెన్నై ఎం ఎం ఎం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆ ఆస్పత్రిలో అన్ని పరీక్షలు నిర్వహించి సర్జికల్ తప్పిదం వల్ల ఇలా జరిగిందని ఇ ఆర్ సి పి ద్వారా స్టంట్ వేశారు. ఇప్పుడు నా ఆరోగ్య పరిస్థితి దయనీయంగా మారింది. హరిప్రియ హాస్పిటల్ యాజమాన్యం వైద్యుల నిర్లక్ష్యం వల్ల దాదాపు 17 లక్షల రూపాయలు ఖర్చు అయింది. అంతేకాకుండా నా ప్రాణానికి



ప్రమాదం వచ్చి పడింది. అంతేకాకుండా ఉద్యోగం కూడా పోయింది. కావున నా మీద దయ ఉంచి కలెక్టర్ . డి ఎం హెచ్ ఓ వెంటనే స్పందించి హాస్పిటల్ యాజమాన్యం, నిర్లక్ష్యంపై తగు చర్యలు తీసుకొని నాకు జరిగిన ఆర్థిక నష్టంతో పాటు, నా ప్రాణాలతో చెలగాట మాడిన హరిప్రియ హాస్పిటల్ యాజమాన్యం వైద్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాధితుడు ఆర్ బి ఎస్ రాముతో పాటు బాధితుడు భార్య జయశ్రీ, అసోసియేషన్ ఫోర్ పీపుల్స్ హ్యూమన్ రైట్స్ కన్వెన్షన్ (ఏ పి హెచ్ ఆర్ సి) చైర్మన్ ఎన్ చంద్రకళ , మహిళా నాయకురాలు లక్ష్మీదేవి పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా “పబ్లిక్ గ్రీవిన్స్ రిడ్రెస్సల్

### ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం చేయకండి -ఎస్పీ తుషార్ డూ



ప్రజా భూమి ప్రతినిధి, చిత్తూరు

సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారంకార్యక్రమంలో 44 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్.పి తుషార్ డూడి, ఐపీఎస్ ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్.పి తుషార్ డూడి, ఐపీఎస్ ఆదేశించారు. “ప్రజలు తమ సమస్యలపై న్యాయం పొందేలా నిబద్ధతతో పని చేయాలి”.జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, నేరుగా ఎస్.పి ని అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ మరియు అడ్మిన్ ఇంచార్జ్ ఎస్.ఆర్.రాజశేఖర రాజు ని మరియు చిత్తూరు సబ్ డివిజన్ డి.ఎస్పీ వెంకట నారాయణ ని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. “ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే మా లక్ష్యం” అని ఎస్.పి అన్నారు. ఈ ఫిర్యాదులపై తక్షణ చర్య తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. “పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాల్సిన బాధ్యత ఉంది,”లి అని ఎస్.పి మరోసారి గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 44 ఫిర్యాదులు అందాయి, వాటి వివరాలు... కుటుంబ తగాదాలు -- 8, వేధింపులు -- 1, భూ తగాదాలు -- 17, డబ్బు తగాదాలు -- 3, చిన్న గొడవలు -- 1, పోలీసు సేవలు -- 6, దారి సమస్యలు - 5, ఆస్తి తగాదాలు -- 3.

# స్వాహా చేసిన డ్వాక్రా సంఘాల నిధులను రికవరీ చేయాలి..

- అక్రమాలకు పాల్పడిన వెలుగు సిబ్బందిని విధుల నుండి తొలగించాలి
- ఉదాసీనంగా వ్యవహరించిన బ్యాంకు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి: సిపిఎం



ప్రజాభూమి ప్రతినిధి కేవీబీపురం

వగత్తూరు పంచాయతీ పరిధిలోని డ్వాక్రా సంఘాల నిధులను 40 లక్షలు స్వాహా చేసిన వెలుగు సిబ్బందిని విచారణ జరిపి రికవరీ చేసి బాధ్యులను విధులనుంచి తొలగించి, క్రిమినల్ కేసులు పెట్టాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం నాడు కె వి బి పురం మండల అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద వగత్తూరు పరిధిలోని డ్వాక్రా మహిళలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి జనార్ధన్, నాగరాజు మాట్లాడుతూ 2023 వ సంవత్సరం నుండి 10 ఎస్ హెచ్ జి లలో బ్యాంకు లింకేజీ రుణాలు, పొదుపు, అంతర్గత అప్పులను ప్రతినెల సభ్యులు వసూలు చేసి బ్యాంకులకు చెల్లించే క్రమంలో సంఘమిత్ర జోక్యం చేసుకొని బ్యాంకులో సిబ్బందిని తప్పుదోవ పట్టించి తన ఖాతాకు వేసుకోవడం, తన బంధువుల ఖాతాకు,



వేసుకోవడం, బ్యాంకు కరస్పాండెంట్ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది చేతివాటంతో సంఘమిత్ర మునెమ్మ 40 లక్షల రూపాయలకు పైగా స్వాహా చేసినట్లు, మరియు సిసి చంద్రకళ 3,70,000 మరొక్క బదిలీ అయిన సిసి వీర జిన్నా 6 లక్షల రూపాయలు స్వాహా చేసినట్లు విచారణ అధికారులు తేల్చినప్పటికీ, మూడు నెలలకు పైగా విచారణ పేరిట కాలయాపన చేస్తున్నారని దళితులు గిరిజనులు కూలీనాలే చేసి బ్యాంకు అప్పులు పొదుపులు చెల్లిస్తున్న నిధులను అక్రమాలు చేసి సొంతానికి వాడుకోవడం దారుణమన్నారు. కిందిస్థాయి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతుంటే పై స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంపై మండిపడ్డారు. బ్యాంకులో సిబ్బంది కూడా డ్వాక్రా సంఘాలలో జరుగుతున్న అక్రమాలపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. వెలుగు సిబ్బందితో బ్యాంకు అధికారులు కూడా కుమ్మక్కై పేదల సొమ్మును పక్కదారి పట్టించారని విమర్శించారు .తక్షణమే జిల్లాస్థాయి అధికారులు జోక్యం చేసుకొని దళితులు గిరిజనులకు రావాల్సిన సొమ్మును రికవరీ చేసి బాధ్యతారహితంగా వ్యవహరించిన వెలుగు సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బ్యాంకు సిబ్బందిపై కూడా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని ఎంపీడీవో మాలతికి ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో వగత్తూరు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు

ప్రజాభూమి
జనరల్ 11
మంగళవారం 14 ఏప్రిల్ 2026

# జీవనోపాదుల అభివృద్ధికి స్వయం సమృద్ధి సాధనకు అందరూ సన్నద్ధం కావాలి - ఏపీఎం టి.ధనంజయ రెడ్డి




ప్రజా భూమి ప్రతినిధి నారాయణవనం

మహిళా స్వయం ఉపాధి తో జీవనోపాధి అభివృద్ధి కి సెర్ప్ అమలు చేసే వార్షిక ఆర్థిక రుణ ప్రణాళికతో ఏం సి పి చాలా ప్రముఖ్యమని సెర్ప్ సహాయ ప్రాజెక్టు మేనేజర్ టి.ధనంజయ రెడ్డి తెలియజేసారు.నారాయణవనం మహిళా సమాఖ్య కార్యాలయం నందు సోమవారం నారాయణవనం, కీలగరం క్లస్టర్ల లోని వి ఓ ఏ లు, సిఆర్పిలు, ఈనారీలకు శిక్షణ 2026 -27 వార్షిక ఆర్థిక రుణ ప్రణాళిక పై వర్క్ షావ్ నిర్వహించడమైనది.ఈ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు జీవనోపాదులు అభివృద్ధి పరుచుకొని స్వయం సంవృద్ధిసాధనకు అందరూ సన్నద్ధం కావాలని కోరారు. ఇందులో ప్రతి మహిళ భాగస్వామ్యమై స్వయం సహాయ సంఘశీ లో ఋణ ప్రణాళిక తీర్మానం చేయాలని సూచించారు.గత సంవత్సరం జరిగిన వార్షిక ఆర్థిక రుణ ప్రణాళికల తో అందరూ ఆర్థికంగా చైతన్యం పొంది పెద్ద ఎత్తున ఆస్తులు సమకూర్చుకోవడం జరిగిందన్నారు.అందుకు కావలసిన రుణాలను పొంది జిల్లాలో ప్రత్యేక స్థానంలో నిలిచిన విధంగా ఈ సంవత్సరం కూడా కృషి చేయాలన్నారు. ఇప్పటికే ఇన్కమ్ ప్రొఫైల్ సర్వే చేపట్టడం ద్వారా వారి యొక్క కుటుంబ ఆర్థిక స్థితిని తెలుసుకోవడం జరిగిందని తెలిపారు. దీని ద్వారా ప్రతి గ్రామసంఘం లో ఈ ఏడాది 20 మందికి తక్కువ లేకుండా కొత్త వ్యాపారాలను ప్రారంభించడం ఆవశ్యమని తెలిపారు.రీసైకిల్ ప్రాసెసింగ్ యూనిట్స్ ని ఏర్పాటు చేసుకుని సంపద సృష్టించుకోవాలని సూచించారు.కుటుంబ సభ్యులతో చర్చించి అన్ని రకాల ఆదాయలు పొందే జీవనోపాదు లను ఎంసీపీలో పొందుపరచుకోవడం ముఖ్య మన్నారు. డైరీ ఏ పి ఎం సుదర్శన్ రాజు మాట్లాడుతూ అన్ని రకాల జీవనోపాదులు అభివృద్ధి చేసుకునేందుకు ప్రతి మహిళా అధికవడ్డీలకు ఇతర లోన్లు కాకుండా తాకట్టు లేని అంతర్గత రుణాలు, సిఐఎఫ్, స్త్రీ నిధి, ఉన్నతి, బ్యాంకురుణాల విరివిగా ఉపయోగించు కోవాలని తెలిపారు.సమ్మిళిత అభివృద్ధి సాధనకు వివో ఏ లు, ఈనారి, సిఆర్పిలు స్వయం సహాయక సంఘాల సమావేశాలలో అందరి సభ్యులకు తెలియ జేసి ఏసిఎల్ పి ని యాప్ నందు పారదర్శకంగా సర్వే చేపట్టాలని సూచించారు.సంఘాలకు కేటాయించిన రోజులో డిజిటల్ ఎంసీపీలను పూర్తి చేసుకుని ఈ నెల 30 వ తేదీ లోపు బ్యాంకులకు సమర్పించి అప్రూవల్ పొందాలన్నారు.సి సిఎల్ లోన్ల తో అవసరమైనప్పుడు లోన్లు తీసుకోవచ్చునని తెలిపారు.బ్యాంకు రుణాలను సులభతరంగా అందుకునే విధంగా డిజిటల్ డాక్యుమెంట్ ద్వారా సరళతరం చేయడం జరిగిందని తెలిపారు. తీసుకున్న రుణాలను అధిక ఆదాయం పొందే వ్యాపారాలకు, ఆవులు, గొర్రెలు, కోళ్లు , చేపల పెంపకం, పండ్ల చెట్లు పెంపకం, వ్యవసాయానికి,ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు సమాకుర్చుకొని అభివృద్ధి చెందాలన్నారు. తీసుకున్న రుణాలను బ్యాంక్ లకు సకాలంలో కంతులు తిరిగి చెల్లించాలని కోరారు.

**నారీ శక్తి వందన్ పై విస్తృత ప్రచారం**

నారీ శక్తీ వందన్ పై ప్రధానమంత్రి సందేశాన్ని అందరూ తిలకించడం జరిగింది. అన్ని కేంద్ర ప్రభుత్వ పథకాలు, తల్లి బిడ్డల సంరక్షణ మాతృ వందన యోజన,లక్ పతి దిదీ, పి ఏం సురక్ష బీమయోజన,మహిళా సురక్ష, ఎం ఎస్ ఏం ఈ లపై విస్తృతంగా మహిళా సంఘాలలో అవగాహణ కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమశీలో ఏపిఎంలు బి.సుదర్శనరాజు,టి.ధనంజ య రెడ్డి , సి సి లు రాజేశ్వరి,నిమ్మి,నాగేంద్రరావు, అరుణ్ కుమార్, అకౌంటెంట్ మల్లిక, వి ఓ ఏ లు, సి ఆర్ పి లు, ఈనారి లు పాల్గొన్నారు.

# నిమ్మల రామానాయుడు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు

## వైయస్ జగన్ గురించి మాట్లాడే అర్హత నీకు లేదు

## హత్యా రాజకీయాలను ప్రోత్సహించే సంస్కృతి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి లేదు - వైకాపా నాయకులు

ప్రజాభూమి,పులివెందుల

నిమ్మల రామానాయుడు నోరు అదుపులో పెట్టుకొ ని మాట్లాడు అని, వైయస్ జగన్మోహన్ రెడ్డి గురించి మాట్లాడే అర్హత నీకు లేదని, హత్య రాజకీయాలను ప్రోత్సహించే సంస్కృతి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి లేదని వైకాపా బలిజ సంఘం నాయకులు సోపాల వీర, కొంగనపల్లి మురళి, బ్యాటరీ ప్రసాద్, కొంగనపల్లి విజయ్ కుమార్, తోటం శెట్టి హరి, బత్తిన శేఖర్ లు అన్నారు. సోమవారం జగన్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హత్య రాజకీయాలకు, వెన్నుపోటు రాజకీయాలకు పేటెంట్ హక్కులు కలిగిన పార్టీ , కుటుంబం నారా కుటుంబమే అన్నారు.రాజకీయంగా ఎదుర్కోలేక లేని పోనీ ఆరోపణలు చేస్తూ వ్యక్తిత్వ హనానికి పాల్పడుతున్నారు అన్నారు.పరిటాల హత్యాకేసు కేసులో జగన్ ప్రమేయం ఉందని తేలితే ఉరి తీయండి అని వైయస్సార్ అసెంబ్లీ సాక్షి గా చెప్పి కేసు సిబిఐ కి అప్పగించారు అన్నారు. వైయస్ కుటుంబం లో చిచ్చు పెట్టి జగన్ మోహన్ రెడ్డి పై బురద చల్లే ప్రయత్నం లో భాగమే వివేకా హత్య కేసు లో అవినాష్ రెడ్డి ని ఇరికించి అక్రమ కేసులు బనాయించడం జరిగింది అన్నారు.మీ పార్టీ అధికారం లో ఉన్నా వైఎస్ అవినాష్ రెడ్డి తప్పు లేదనే సుప్రీమ్ కోర్టు తెలిపింది అన్నారు.ఎన్ని కుయుక్తులు పన్నిన చివరకు న్యాయమే గెలుస్తుం ది జగన్ మోహన్ రెడ్డి కడిన ముత్యంలా బయటకు వచ్చారు అన్నారు. పులివెందుల అంటే ఒకప్పుడు కరుడుగట్టిన ఫ్యాక్షన్ ప్రాంతం గా ఉండేది కానీ వైయస్సార్ కుటుంబం



వలనే పులివెందుల తో పాటు కడప జిల్లా లో ఫ్యాక్షన్ పూర్తిగా అంతమొందించడం జరిగింది అని తెలిపారు.వంగవీటి ని హత్య చేయించింది ఎవ్వరో ఈ రాష్ట్రం అంతా తెలుసు, ఆ మచ్చ పోవడానికి బలిజ కులం ఓట్లు పొందడానికే పవన్ కళ్యాణ్ తో జట్టు కట్టారు అన్నారు.నిమ్మల రామానాయుడు ఎన్నికల ముందు నీకు 15 వేలు నీకు 15 వేలు అని చెప్పి ప్రజలను మోసం చేశావు ఇప్పుడు బయటకు వస్తే ప్రజలు చీపురు తో కొట్టే పరిస్థితి నెలకొంది అన్నారు.ఇకనైనా బుద్ధి తెచ్చుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి, ఇంకోసారి వైఎస్ జగన్ గురించి మాట్లాడి, బలిజ కులాన్ని నీ నీచ రాజకీయాలకు ముడిపెడితే నీ ఇంటిని ముట్టడించి నిరసన వ్యక్తం చేస్తాం అని తెలిపారు.

# ఇంటింటికీ వెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన టీడీపీ నాయకులు



ప్రజాభూమి,పులివెందుల

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవడంలో తామెప్పుడూ ముందుంటామని మరోసారి నిరూపించారు.శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి , ఆయన ఆదేశాల మేరకు, పులివెందుల పట్టణంలో అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు నేరుగా వారి ఇంటి వద్దకే టిడిపి నాయకులు మోపూరి దేవాలయం చైర్మన్ రమణారెడ్డి, కడప పార్లమెంట్ మాజీ కార్యదర్శి బొజ్జ మైసూరా రెడ్డి , గంగిరెడ్డి, తాళ్లపల్లె వెంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్ నాయుడు, ముచ్చుమర్రి మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసు లరెడ్డి, మల్లెల శీను, వారు వెళ్లి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా నలుగురు లబ్ధిదారులకు మొత్తం రూ.1,65,484 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కష్టసమయంలో వారికి అండగా నిలవడం, అవసరమైన ఆర్థిక సహాయాన్ని వేగంగా అందించ డం ప్రభుత్వం తీసుకుంటున్న బాధ్యతాయుతమైన చర్యలలో భాగమని వారు తెలిపారు.ప్రతి అర్హుడికి న్యాయం జరిగేలా, సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుం టున్నామని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడమే తమ లక్ష్యమని వారు తెలిపారు.

# చంద్రగిరి పోలీస్ స్టేషన్ ఆవరణములో చలివేంద్రం ఏర్పాటు..!




ప్రజా భూమి ప్రతినిధి, చంద్రగిరి:

నాంది స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ పసల ప్రసాద్ ఆధ్వర్యంలో చంద్రగిరి పోలీస్ స్టేషన్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్ సిఐ సురేష్ కుమార్ చేతులు మీదుగా సోమవారం చంద్రగిరి పోలీస్ స్టేషన్ ఆవరణంలో ఘనంగా చలివేంద్ర ప్రోగ్రాం ప్రారంభించడం జరిగింది. ముఖ్య అతిథులుగా నాంది స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ పసల ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, మెంబర్స్ యువూరి వెంకటయ్య, మరియుడాక్టర్ కిరణ్ కుమార్, తో పాటు నాంది స్వచ్ఛంద సేవా సంస్థ మిత్ర బృందం పాల్గొనడం జరిగింది.

# జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటించనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా, సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్

## క్రీడా ప్రాంగణాలను ప్రారంభించనున్న మంత్రి

## కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

రాష్ట్ర విద్యా, సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్ ఏప్రిల్ 14 మరియు 15 తేదీలలో జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ చంద్రగిరి ఎం ఎల్ ఏ పులివర్తి నానితో కలసి సోమవారం పరిశీలించారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా రాష్ట్ర విద్యా, సాంకేతిక శాఖ మంత్రి ఏప్రిల్ 14 న రాత్రి 7.40 గం. లకు తిరుపతి విమానాశ్రయం చేరుకుని తిరుపతి లో రాత్రి బస చేస్తారన్నారు. రెండవ రోజు ఉదయం 9.15 లకు తిరుపతి గొల్లవాని గుంట లోని ఎన్ టి ఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని, అనంతరం ఉదయం 10.40 గం.లకు చంద్రగిరి లోని నూతన మండల పరిషత్ కార్యాలయ భవనం మరియు నారా రామమూర్తి నాయుడు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభిస్తారన్నారు. తదుపరి మద్యాహ్నం 01 గం.కు రామా నాయుడు కళ్యాణ మండపంలో రాజకీయ పార్టీ సమావేశంలో పాల్గొని సా.5.00 గం.లకు నెల్లూరు బయల్దేరి వెళతారని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా తిరుపతి గొల్లవాణి గుంటలోని నందమూరి తారక రామారావు క్రీడా ప్రాంగణము, చంద్రగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఇండోర్ స్టేడియం, రామానాయుడు కళ్యాణ మండపంలను జిల్లా ఎస్పి ఎల్ సుబ్బరాయుడు, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, శాప్ చైర్మన్ రవినాయుడు, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి లతో కలసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, ఏ ఎస్పి రవి మనోహరాచారి, జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్, జిల్లా స్పోర్ట్స్ అధికారి శశిధర్, తుడా సెక్రటరీ శ్రీకాంత్, తహసిల్దార్ సురేష్ బాబు, తుడా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, శాప్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.





# గుమ్మిరెడ్డి లక్ష్మీదేవి నేత్రదానం ఇద్దరు అంధులకు చూపు



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణం బైపాస్ రోడ్ లోని గుమ్మిరెడ్డి లక్ష్మీదేవి(77 సంవత్సరాలు) సోమవారం మరణించడంతో ఆమె కుమారుడు విష్ణు వర్ధన్ రెడ్డి, కుమార్తె లు అపర్ణ, కవిత, నాగలక్ష్మి,కోడలు మమత, అల్లుడు గోపాల్, మనవడు విశ్వతేజ, మనవరాలు కౌశిక లు నేత్రదానానికి అంగీకరిస్తూ జిల్లా అంధత్వ నివారణ సంస్థ , స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజు లకు సమాచారం అందజేశారు. దీంతో టెక్నీషియన్ ప్రశాంత్ కుమార్ తో కలిసి మృతురాలి నివాసం వద్ద పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి కడప ఎల్ వి ప్రసాద్ నేత్రాలయానికి పంపడం జరిగింది.ఈ సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఎంతోమంది కార్నియా సమస్య కారణంగా చూపు కోల్పోయి ఈ ప్రపంచాన్ని చూడలేక అంధత్వం తో బాధపడుతూ కార్నియా ల కోసం ఎదురుచూస్తూ ఉన్నారని ఆయన అన్నారు. అలాంటి వారికోసం నేత్రదానం చేసేందుకు ప్రతి కుటుంబం ముందుకు రావాలని, కుటుంబం లోని వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన వెంటనే 9966509364 కి సమాచారం ఇచ్చినట్లు అయితే ఇంటి వద్దకే వచ్చి పార్థివ దేహం నుండి కార్నియా లను సేకరించి అంధత్వం తో బాధ పడుతున్న వారికి అమర్చి చూపు ఇచ్చి మరణించిన తరువాత కూడా మళ్ళీ ఈ ప్రపంచాన్ని చూసే బృహత్కార్యం నేత్రదానం మాత్రమే అని కావున ప్రతి కుటుంబం నేత్రదానం పై అవగాహన కలిగి నేత్రదానం చేసి అందరహిత సమాజం కోసం ప్రతిఒక్కరు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞత అభినందనలు తెలిపారు.

# పి.జి.ఆర్.ఎస్‌లో 76 వినతుల స్వీకరణ

## సమస్యలపై వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఫిర్యాదుదారుల నుంచి వినతులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 76 మంది ఫిర్యాదుదారుల సమస్యలను స్వయంగా విని, ప్రతి అంశంపై వెంటనే స్పందించారు. ఫిర్యాదుదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యలను శ్రద్ధగా తెలుసుకున్న ఎస్పీ, అందిన వినతులను సంబంధిత అధికారులకు వెంటనే పంపిస్తూ ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి సమస్యకు త్వరితగతిన న్యాయం జరిగేలా అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు (పరిపాలన), శ్రీనివాస్ (క్రైమ్) పాల్గొన్నారు.

# క్షత్రియ సేవా సంఘం ఆర్గనైజింగ్ సెక్రెటరిగా రాధాకృష్ణ వర్మ



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

క్షత్రియ సేవా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కీర్తిపాటి రాధాకృష్ణ నియమింపబడం పట్ల పలువురు అభినందనలు





తెలియజేసారు. తిరుపతిలో క్షత్రియ సేవా సంఘం నూతన కమిటి ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడిగా సిద్దార్థ విద్యా సంస్థల నిర్వాహకులు అశోక్ రాజు, ప్రధాన కార్యదర్శిగా నారాయణ బాబు, కోశాధికారిగా శివరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా బీరేంద్రవర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కీర్తిపాటి రాధాకృష్ణ తదితరులు నియమింపబడ్డారు. ఈ సందర్భంగా గత తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్, రాష్ట్ర మునిసిపల్ కార్పొరేషన్ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు లోకేష్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నూతన కమిటికి అభినందనలు తెలియజేస్తూ, క్షత్రియ సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

# పులివెందులలో సిఐల బదిలీలు

ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల రూరల్,ట్రాఫిక్ సిఐ లను బదిలీ చేస్తూ కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. పులివెందుల రూరల్ సీఐ గా విధులు నిర్వహిస్తున్న సీతారామిరెడ్డిని నంద్యాల డిటిసి కి బదిలీ బదిలీ అయ్యారు.ఆయన స్థానం లో పులివెందుల ట్రాఫిక్ సీఐ గా విధులు నిర్వర్తి స్తున్న శాంతి లాల్ రూరల్ సీఐ గా బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే మంత్రాలయం లో పని చేస్తున సీఐ రామాంజులును పులివెందుల ట్రాఫిక్ సీఐ గా బదిలీ చేస్తూ కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఒంటిమిట్ట నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీహరి



ప్రజాభూమి, ఒంటిమిట్ట: ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీహరి సోమవారం నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. కడప సీపీఎస్ విభాగం నుండి బదిలీపై వచ్చిన ఆయన, స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణే తన ప్రథమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ఈ పదవిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ, అసాంఘిక కార్యకలాపాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముఖ్యంగా చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఒంటిమిట్ట ప్రాంతంలో భక్తులకు, స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.బాధ్యతలు స్వీకరించిన నూతన సీఐ శ్రీహరిని పలువురు పోలీసులు, స్థానిక నాయకులు కలిసి మర్యాదపూర్వకంగా అభినందనలు తెలియజేశారు.

# జలియన్ వాలాబాగ్ దురంతంలో అశువులు బాసిన భారతీయులకు: జనసేన పార్టీ తరపున నివాళులు

## -జనసేన నాయకులు జయప్రకాష్.



ప్రజా భూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్

1919, ఏప్రిల్ 13 న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న జలియన్ వాలాబాగ్ మైదానంలో సమావేశమైన వేల మంది భారతీయులపైన జనరల్ డయ్యర్ నేత్రుత్వంలోని సాయుధులైన బ్రిటిష్ సైనికులు ఎటువంటి హెచ్చరికలు లేకుండా కాల్పులు జరిపి దారుణ మారణహోమం సృష్టించారు. ఈ ఘటనలో వెయ్యికి పైగా భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. జలియన్ వాలాబాగ్ కేవలం ఒక రక్తపాతం మాత్రమే కాదు, అది భారత స్వాతంత్ర్య పోరాటంలో ఒక మలుపు. అమాయక ప్రజల త్యాగాలు వృథా పోలేదు.. వారి బలిదానమే మనకు నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛను ప్రసాదించింది. ఈ మారణహోమంలో ప్రాణాలు కోల్పోయిన భారతీయులకు జనసేన పార్టీ తరపున ఘనంగా నివాళులు అర్పిస్తున్నాం. ఈ దుర్ఘటనకు నేటితో 107 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆనాటి త్యాగాలను గుర్తుచేసుకోవలసిన ఆవస్యకత నేటి తరానికి ఎంతైనా ఉంది.

# కళ్యాణ వెంకన్న ఆలయంలో ఘనంగా ప్రారంభమైన భాస్యకారుల ఉత్సవాలు



ప్రజా భూమి ప్రతినిధి నారాయణవనం

మండల కేంద్రమైన నారాయణవనంలో వెలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం టిటిడి ఆలయమైన శ్రీ పద్మావతి సమేతకళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భాస్యకారుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నిత్య పూజా కార్యక్రమాల అనంతరం స్వామి వారికి అభిషేకం జరిగింది. సాయంత్రం తిరుచ్చి వాహనంపై భాస్యకారుల స్వామివారిని అధిరోహించి ఆలయమాడ వీధులలో ఊరేగించారు. భక్తులు టెంకాయ హారతులు ఇచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు శ్రీధర్ భట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు ఆలయ సిబ్బంది వాహన మోతగాళ్లు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## అన్ని పార్టీలూ 'బూత్ ఏజెంట్లను' త్వరగా నియమించాలి

**కృష్ణజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**
**రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం**
**అవనిగడ్డలో జనసేన ఫుల్.. మిగిలిన చోట్ల పెండింగ్**
**స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీలో బీఎల్ఏల పాత్ర కీలకం**

((ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా):

జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ వంతు బాధ్యతగా ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి ఏజెంట్లను (BLA) వెంటనే నియమించాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన ఎన్నికల సన్నద్ధతపై సుదీర్ఘంగా సమీక్షించారు.ఏ పార్టీ పరిస్థితి ఏమిటి? (1769 పోలింగ్ కేంద్రాలకు గాను..)జిల్లాలోని మొత్తం పోలింగ్ కేంద్రాల వారీగా ఏజెంట్ల నియామక పరిస్థితిని కలెక్టర్ ఈ సందర్భంగా విశ్లేషించారు:తెలుగుదేశం పార్టీ: 1710 మందిని నియమించింది. మచిలీపట్నం, గుడివాడ, గన్నవరంలో ఇంకా కొంతమంది పెండింగ్‌లో ఉన్నారు.వైఎస్సార్‌సీపీ: 1233 మందిని నియమించింది. గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల్లో ఇంకా ఎవరినీ నియమించలేదు.జనసేన పార్టీ: అవనిగడ్డ నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ఏజెంట్లను నియమించి ముందంజలో ఉంది.బీజేపీ: ప్రస్తుతానికి అవనిగడ్డలో మాత్రమే 21 మందిని నియమించింది.కాంగ్రెస్, సీపీఐ(ఎం), బీఎస్పీ: ఈ పార్టీలు ఇంకా ఏజెంట్ల నియామక ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంది.ఏజెంట్లు లేనిదే ఫిర్యాదులు తీసుకోం!వచ్చే సమావేశం నాటికి అన్ని పార్టీలు తమ జాబితాను సంబంధిత *ఈఆర్ఓ (ERO)*లకు అందజేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. "బూత్ స్థాయి ఏజెంట్లను నియమించకుండా ఓటర్ల జాబితాపై వచ్చే ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోం" అని ఆయన తేల్చి చెప్పారు. త్వరలోనే వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, బీఎల్ఓలతో కలిసి ఇంటింటికీ పంపి స్వచ్ఛమైన ఓటర్ల జాబితా రూపొందిస్తామన్నారు.ఓటర్ల దరఖాస్తుల పరిష్కారంలో వేగంజిల్లాలో ఫారం 6, 7, 8 కింద అందిన 86,313 దరఖాస్తుల్లో ఇప్పటికే 84,354 (97%) పరిష్కరించామని, మిగిలిన 1959 దరఖాస్తులు వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అలాగే, 2002 ఓటర్ల జాబితాను 2025 జాబితాతో మ్యాపింగ్ చేసే ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియ 69 శాతం పూర్తయిందని వెల్లడించారు.సమావేశంలో పాల్గొన్నవారు:ఈ భేటీలో డీఆర్ఓ చంద్రశేఖర రావుతో పాటు వివిధ పార్టీల ప్రతినిధులు దాస్ (TDP), మతీన్ ఖాన్ (INC), పి.వి. గజేంద్ర రావు (BJP), కొడాలి శర్మ (CPM), రాజేష్, బాలాజీ (BSP), ఉపేంద్రనాథ్, సిలార్ దాదా, బాషా (YSRCP) మరియు ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు."

## అర్జీల పరిష్కారంలో జాప్యం వద్దు.. నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులే



**జిల్లా కలెక్టర్‌కలెక్టరేట్‌లో 'మీ కోసం'.. 132 వినతుల స్వీకరణ**
**అవినీతిపై ఫిర్యాదుకు వాట్సప్ నంబర్ 90631 51600**
**ఉత్తమ అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ప్రశంసలు**

మచిలీపట్నం (ప్రజాభూమి ప్రతినిధి)

ప్రజల నుండి అందుతున్న 'మీ కోసం' అర్జీలను అత్యంత ప్రాధాన్యతతో, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను కఠినంగా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుంచి స్వయంగా 132 అర్జీలను స్వీకరించారు.కలెక్టర్ ప్రధాన ఆదేశాలు:తనిఖీలు తప్పనిసరి: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను చెత్తరహితంగా ఉంచాలి. మంచినీటి జలాశయాలను 15 రోజులకు ఒకసారి బ్లీచింగ్‌తో శుభ్రం చేసి, స్థానికుల సంతకాలు తీసుకోవాలి.కఠిన చర్యలు: అర్జీల పరిష్కారంలో ఆన్‌లైన్ ఎండార్స్ మెంట్లపై నిర్లక్ష్యం వహించే అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.అవినీతిపై పోరు: కార్యాలయాల్లో



ఎవరైనా లంచం అడిగితే 90631 51600 నంబర్‌కు వా ట్సప్ చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని కలెక్టర్ స్పష్టం చేశారు.అర్జీల్లో కొన్ని.. టిడ్కో ఇళ్ల కేటాయింపులో ఇబ్బందులు, భూ కబ్జా ఫిర్యాదులతో పాటు, మొంతా తుఫాను నష్టపరిహారం మరియు కాలువల పూడికతీతపై రైతు సంఘం నేతలు గౌరిశెట్టి నాగేశ్వరరావు బృందం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ప్రతిభావంతులకు పురస్కారాలు:అర్జీల పరిష్కా రం లో ప్రతిభ కనబరిచిన ఉంగుటూరు, బాపులపాడు, మొవ్వ, ఉయ్యూరు తహసీల్దార్లు, తాడిగడప మున్సిపల్ కమిషనర్ సహా 10 మంది అధికారులను కలెక్టర్ అభినందించి బహుమతులు అందజే శారు. అనంతరం సంక్షేమ వసతి గృహాల కోసం మంచినీటి పరీక్ష పరికరాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో డీఆర్ఓ చంద్రశేఖర రావు, విజిలెన్స్ డీసీ పోతురాజు, డీఎస్పీ శ్రీనివాసరావు మరియు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ

**వేణు దంపతుల వివాహ వేడుకలో సందడి..ఘనంగా స్వాగతం పలికిన కుటుంబ సభ్యులు, జనసైనికులు**



మచిలీపట్నం, ( రూరల్ ప్రజాభూమి):

మచిలీపట్నంలోని తాళ్లపాలెం పంచాయతీ జొన్నలవారిమోడీలో జరిగిన వేణు దంపతుల వివాహ రిసెప్షన్ వేడుకకు ముఖ్యఅతిథిగా మచిలీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ హాజరయ్యారు.వేడుకకు విచ్చేసిన ఆయనకు జనసైనికులు, కుటుంబ సభ్యులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ నూతన వధూవరులను అభినందించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ క్లస్టర్ ఇంచార్జ్ సూర్య,మాచవరం జనసేన 2 వ డివిజన్ ఇంచార్జి ఈమన మణి బాబు, సతీష్ మరియు పెద్ద సంఖ్యలో జనసైనికులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని సందడి చేశారు.

# వసతి గృహాల రూపురేఖలు మార్చండి

**కలెక్టర్‌కు 'జనతా వారధి' వినతి**
**వేసవిని 'సంస్కరణల కాలం'గా ప్రకటించాలి**
**హాస్టళ్లలో మౌలిక సదుపాయాలపై ఆడిట్ జరపాలి**
**కృష్ణాజిల్లా కలెక్టర్‌ను కలిసిన బిజెపి నేతల బృందం**

మచిలీపట్నం, ( ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా ):

రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి, ఈ వేసవి సెలవులను 'వసతి గృహాల సంస్కరణ కాలం'గా పరిగణించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా నేతలు కోరారు.





బిజెపి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పలు హాస్టళ్లను సందర్శించిన నేతలు, అక్కడ తాము గమనించిన సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ప్రధాన డిమాండ్లు ఇవే:

ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆడిట్: హాస్టల్ భవనాల స్థితిగతులపై తక్షణమే తనిఖీలు నిర్వహించి, శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు చేయాలి.

డైట్ చార్జీల పెంపు: ప్రస్తుత నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచి, నాణ్యమైన భోజనం అందించాలి.

రక్షణ & భద్రత: ప్రతి హాస్టల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. బాలికల హాస్టళ్లలో తప్పనిసరిగా మహిళా వార్డెన్లను నియమించాలి.తల్లిదండ్రుల సమావేశాలు: విద్యార్థులు సెలవులకు వెళ్లే ముందు ప్రజాప్రతినిధుల సమక్షంలో పేరెంట్స్ మీటింగ్స్ నిర్వహించి సమస్యలు తెలుసుకోవాలి.

ఆరోగ్య సంరక్షణ: ప్రతి నెలా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి."పేద విద్యార్థి తన హాస్టల్‌ను చూసి 'ఇది నా ఇంటికంటే సురక్షితమైన ప్రదేశం' అని గర్వంగా చెప్పుకునేలా ప్రభుత్వ పరిపాలన ఉండాలి. గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వీడి, ప్రస్తుత ప్రభుత్వం హాస్టళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి."— జనతా వారధి బృందంపాల్గొన్న నేతలు:ఈ కార్యక్రమంలో జనతా వారధి జిల్లా కన్వీనర్ గాజుల సిద్ధార్థ, కో-కన్వీనర్ ఘంటా సతీష్ కుమార్, బిజెపి యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మిడి నారాయణ, గోరంట్ల ప్రసాద్ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ చేసిన మంత్రి సవిత



జగ్గయ్యపేట,ప్రజాభూమి ప్రతినిధి

జగ్గయ్యపేట నియోజకవర్గం, వత్సవాయి మండలం, వత్సవాయి గ్రామంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలను రాష్ట్ర మంత్రి ఎస్. సవిత ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తో కలిసిఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు పాఠశాలలో అందుతున్న విద్యా ప్రమాణాలు, హాస్టల్ వసతులు, భోజన నాణ్యత వంటి అంశాలను పరిశీలించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి బోధన విధా నం, ఉపాధ్యాయుల పనితీరును సమీక్షించారు.హాస్టల్‌ను తనిఖీ చేసిన వారు ఆహార నాణ్యతను పరిశీలించడంతో పాటు విద్యార్థుల అభిప్రాయాలను నేరుగా తెలుసుకున్నారు._ సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు._స్టోర్ రూమ్‌ను పరిశీలించిన మంత్రి సవిత నిల్వ సరుకుల నాణ్య తపై దృష్టి సారించి, వాటిని శుభ్రంగా మరియు క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు.అనంతరం పాఠశాలకు సహకరించిన దాతలను శాలువాతో సత్కరించారు.మంత్రి సవిత మాట్లాడుతూ..గురుకుల పాఠ శా లల్లో విద్యా ర్థుల కు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు.గురుకుల పాఠశాలలు పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య సాధనలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు డిజిటల్ విద్య, ఇంగ్లీష్ మీడియం బోధన, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ.. మంత్రి సరిత వత్సవాయి హాస్టల్‌ను సందర్శించడం ఆనందదాయకమని తెలిపారు._ రాష్ట్రంలోని హాస్టళ్ల పరిస్థితిని పరిశీలించాలని మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఈ సందర్శనం జరిగిందన్నారు.హాస్టల్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు. వాటర్ లీకేజీ సమస్యను పరిష్కరించేందుకు ఎన్ఆర్ఐ రాంబాబు గారి సహకారంతో షెడ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. త్వరలో ఫ్లోరింగ్ పనులు కూడా చేపడతామని తెలిపారు.హాస్టల్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం, విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడేందుకు ల్యాండ్ ఫోన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ. 8 లక్షలు మంజూరు చేస్తామని వెల్లడించారు._భవిష్యత్తులో జగ్గయ్యపేట లేదా గండ్రాయి ప్రాంతంలో పది ఎకరాల స్థలంలో ప్లేగ్రౌండ్‌తో కూడిన సమగ్ర పాఠశాల నిర్మాణం చేపడతామని తెలిపారు.విద్యార్థులు తమ సమస్యలు, సూచనలు మంత్రిదృష్టికి తీసుకురావాలని కోరారు._ఈ కార్యక్రమంలో అధికారులు, పాఠశాల సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అమరావతి రాష్ట్రానికి మోయలేని 'గుదిబండ': మాజీ మంత్రి పేర్ని నాని

**చంద్రబాబు అత్యాశే ఏపీ దివాళాకు కారణం**
**బూతులతో 'మావిగన్' అంశాన్ని డైవర్ట్ చేయలేరు**
**చంద్రబాబు కేబినెట్‌లో సగం మంది ఆయన్ని తిట్టిన వారే!**

తాడేపల్లి, (ప్రజా భూమి ప్రతినిధి):



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనాలోచిత నిర్ణయాలు, అంతులేని అవినీతి కారణంగా అమరావతి అనేది ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి మోయలేని గుదిబండగా మారిందని మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లిలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన కూటమి ప్రభుత్వంపై విమర్శల జడివాన కురిపించారు. రాష్ట్రాన్ని దివాళా తీయిస్తున్నారు రాజధాని నిర్మాణం పేరుతో చంద్రబా బు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి దివాళా తీయించే మార్గంలో నడిపిస్తున్నారని పేర్ని నాని మండిపడ్డారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిపాదించిన 'మావిగన్' కాన్సెప్ట్‌పై సమాధానం చెప్పలేక కూటమి నేతలు వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. మంత్రులకు బూతు పాఠాలు నేర్పించి అబద్ధాలతో కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు.చంద్రబాబుపై సొంత మంత్రులకే నమ్మకం లేదు:"చంద్రబాబు కేబినెట్‌లో ఉన్న సగం మంది మంత్రులు ఒకప్పుడు ఆయన్ని తిట్టిన వీడియోలు కోకొల్లలుగా ఉన్నా యి. కూటమిలోని 164 మంది ఎమ్మెల్యేల్లో వంద మందికి పైగా గతంలో బాబును దూషించిన వారే" అని నాని ఎద్దేవా చేశారు. బూతు బంట్రోతుగా అచ్చెన్న: మంత్రి అచ్చెన్నాయుడు చంద్రబాబుకు బూతు బంట్రోతుగా మారిపోయారని ఘాటుగా విమర్శించారు. గతంలో చంద్రబాబును ఔరంగజేబుతో పోల్చిన విషయాన్ని గుర్తు చేశారు. పవన్, మోడీ వ్యాఖ్యల ప్రస్తావన: పవన్ కళ్యాణ్ సైతం గతంలో చంద్రబాబును అవినీతిపరుడిగా పేర్కొ న్నారని, మోడీ-చంద్రబాబు ఒకరినొకరు దూషించుకున్న చరిత్ర అందరికీ తెలుసన్నారు.దగ్గుబాటి పుస్తకాలపై సవాల్: చంద్రబాబు గురించి ఆయన తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన పుస్తకాలను టీడీపీ శిక్షణ తరగతుల్లో పంచిపెట్టగలరా? అని ప్రశ్నించారు. చంద్రబాబును 'టార్చ్ లైట్ మినిస్టర్' అని పిలిచిన వారు నేడు ఆయన పక్కనే ఉండటం విడ్డూరమన్నారు.రాజకీయాలను రాజకీయాలుగా చూడాలని, వ్యక్తిగత దూషణలు మాని రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పనిచేయాలని ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు.



## ఎస్.ఎస్.సి మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెకర్ డీకే బాలాజీ

**మచిలీపట్నం ఎల్ ఏ హైస్కూల్‌లో 8వ రోజుకు చేరిన స్పాట్ వాల్యుయేషన్**
**ఏర్పాట్లపై కలెక్టర్ సంతృప్తి.. అధికారులకు పలు సూచనలు**
**విధులు నిర్వహిస్తున్న 775 మంది సిబ్బంది**

మచిలీపట్నం, (ప్రజాభూమి ప్రతినిధి )

స్థానిక LA ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి (SSC) సమాధాన పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ శ్రీ డీకే బాలాజీ గారు సోమవారం సందర్శించారు. 8వ రోజుకు చేరుకున్న మూల్యాంకన ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించి, కేంద్రంలో కల్పిస్తున్న సౌకర్యాలు మరియు భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.నిశితంగా పరిశీలన: కలెక్టర్ మూల్యాంకన కేంద్రంలోని ప్రతి విభాగాన్ని సందర్శించి, మార్కుల నమోదు మరియు స్కానింగ్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా, అత్యంత పారదర్శకతతో వాల్యుయేషన్ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



ఎండ తీవ్రత దృష్ట్యా సిబ్బందికి తగిన మంచినీటి సదుపాయం, చల్ల ని వాతావరణం కల్పించి నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు కలెక్టర్‌కు వివరిం చారు.ఈ మూ ల్యాంకన కేంద్రంలో మొత్తం 775 మంది సిబ్బంది నిరంతరాయంగా విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.చీఫ్ ఎగ్జామినర్లు (CEs): 80 మందిఅసిస్టెంట్ ఎగ్జామినర్లు (AEs): 461 మంది ఇతర సిబ్బంది: 234 మందిఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి (DEO) యు.వి. సుబ్బారావు మూల్యాంకన కేంద్రం బాధ్యులు మరియు ఇతర విద్యాశాఖ అధికారులు పాల్గొని, ప్రక్రియ సాఫీగా సాగేలా కలెక్టర్ పర్యవేక్షణలో తగిన చర్యలు చేపట్టారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం క్లాత్ బజార్ చందన సాయి శిల్క్ వద్ద వాసవి క్లబ్ కవుల్స్ ఆధ్వర్యంలో వేసవి దృష్ట్యాం బాట సారులకు. మజ్జిగ పంపిణి కార్యక్రమం జరుగుతుంది ఈ సందర్భంగా సెక్రటరీ. యెందూరి సురేష్ మాట్లాడుతు ఈ నెల ఒకటో తారీకు నుంచి మజ్జిగ పంపిణి కార్యక్రమం జరుగుతుంది ఇరువైపులా నుండి నుండి వచ్చే బాటసారులకు ఎండ దుష్యం మజ్జిగ సేవ కార్యక్రమం చేస్తున్నాము ప్రతి రోజు దాదాపుగా 500 మందికి తగ్గట్టు మా వాసవి సేవా కార్యక్రమం ద్వారా మజ్జిగ పంపిణి కార్యక్రమం చెయ్యడం జరుగుతుంది మా ప్రసిడెంట్ శిద్దా సూర్య ప్రకాశరావు గవర్నర్. హరి ప్రసాద్.ఆదేశాను సారము ఈ రెండు క్లబ్ లు కూడా ఈ రోజున మజ్జిగ పంపిణి కార్యక్రమం చేస్తున్నాము మా వాసవి అంటేనే సేవా సంస్థ సేవ కార్యక్రమాలు అని అయితే ఎవ్వరు వచ్చిన కుడా వాళ్ళకి మా సంస్థ ద్వారా ఎన్నో కార్యక్రమాలు అన్నం అశోక్ కూమార్ ఆధ్వర్యంలో దాదాపుగా ఈ సంవత్సరంలో 12 కబ్ల్ ల ద్వారా కార్యక్రమాలు చేస్తున్నాము ఇవి అన్ని కూడా అన్నం అశోక్ ఆధ్వర్యంలో జరుగుతు వస్తున్నాయీ ఎతోం మంది దాతలు మేము తలపెట్టే ఈ కార్యక్రమలకు సహకారించి ముందుకు తీసుకొని వెళ్తున్నారు వారి అందరికి కూడా ప్రతేక ధన్యవాదములు తెలుపుతున్నామని అయన తెలిపారు. అన్నం అశోక్ మాట్లాడుతు ఈ సంవత్స రంలో నూతనంగా సభ్యత్వ లో చేరే సభ్యులకు మగవారికి. పట్టు పంచె. కండువా. మహిళాలకు. చీర పసుపు. కుంకుమ. ఇవ్వండం జరుగుతుంది ఈ సాదా అవకా శాన్ని ఆర్యవైశ్యులు అందరు స్వాదినియోగం పరుచుకోవాలని పేర్కొన్నారు. డి. పి. వో వి. కె. ఎన్. మూర్తి.( ప్రెసిడెంట్) దేవత రాఘవేంద్రరావు. (సెక్రటరీ.) జయవరపు ప్రసాద్. అన్నం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ముళ్లపరు గ్రామంలో పెద్దకర్మ కార్యక్రమంలో కొరియర్ శ్రీను

ప్రజాభూమి పెడన

ముళ్లపరు గ్రామ మాజీ జనసేన వైస్ ప్రెసిడెంట్ బత్తుల సాంబశివరావు తల్లి కీ.శే. బత్తుల నాగమల్లేశ్వరమ్మ పెద్దకర్మ కార్యక్రమంలో పాల్గొన్న జనసేన పార్టీ సెంట్రల్ ఆంధ్ర కో-కన్వీనర్ శ్రీ వికృతి శ్రీనివాస్ బాబు (కొరియర్ శ్రీను) మరియు జనసేన పార్టీ మండల నాయకులు కార్యకర్తలుమరణించిన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.




Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

# పీజీఆర్ఎస్ అర్జీలు పరిష్కారానికి అధికారులు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

- అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తప్పనిసరిగా గడువులోపు పరిష్కరించాలి
- ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 437 అర్జీలు.
- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.

**ప్రజాభూమి ప్రతినిధి-కాకినాడ**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిని అర్జీలకు అధిక ప్రాధాన్యానికి ఇచ్చి తప్పనిసరిగా నిర్దేశించిన గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్ లో జరిగిన జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్.. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, కాకినాడ కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, ఎన్.శ్రీధర్, సీపీవో పీ త్రినాథ్, డీఎల్డీవో వాసు దేవరావు ఇతర అధికారులతో కలిసి హాజరై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారు నుంచి వినతులు, అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం, సమగ్రమైన విచారణ చేపట్టి, తగిన పరిష్కారం అందించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులలోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, మురికి కాలువలపై ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం వంటి అంశాలపై మొత్తం 437 అర్జీలు అందాయి.తొలుత జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్.. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కార పురోగతి, పాజిటివ్ పబ్లిక్ ఫర్ఫెక్షన్, కోర్టు కేసులు వంటి అంశాలపై జిల్లా అధికారులతో చర్చించారు. పీజీఆర్ఎస్ అర్జీలు సకాలంలో పరిష్కరించి, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్.. అధికారుకు దిశా నిర్దేశనం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి, నిర్దేశించిన గడుగులోపు పరిష్కారించేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు అర్జీల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత నివ్వాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యకు సంబంధించిన విషయాలను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, సవివరంగా పరిష్కార వేదిక చోత ఇవ్వాలనిరు. అర్జీదారుని సమస్యకు తగిన పరిష్కారం చూపులేకపోతే అందుకు గల కారణాలు స్వయంగా అర్జీదారునికి వివరంగా తెలియజేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజల నుంచి అందిన సమస్యలను సరైన పద్ధతిలో పరిష్కరించడం ద్వారా పాజిటివ్ పబ్లిక్ పర్ఫెక్షన్ శాతాన్ని పెంచవచ్చు అన్నారు. కోర్టు కేసులు పట్ల అధికారులు అప్రమత్తుతో వ్యవహరించాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు పరిష్కరించని అర్జీలను వారం రోజుల్లో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు



**రెవెన్యూ క్లినిక్ కు 11 అర్జీలు..**

రెవిన్యూ అంశాలలోని సమస్యల పరిష్కారం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ వివేకానంద హాలు పైన జరిగింది. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, ఎన్.శ్రీధర్, కెఆర్ఆర్సీ ఎస్డీసీ జి.రత్నమణిలతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే, భూముల వివరాలు ఆన్ లైన్ లో నమోదు, జాయింట్ ఎల్పీఎంలు, 22ఏలోని భూములు, సర్వే నెంబర్లు ఇతర రెవెన్యూ అంశాలపై మొత్తం 11 అర్జీలు అందాయని జేసీ అపూర్వ భరత్ తెలిపారు.కార్యక్రమలలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు, అన్ని మండలాల తహాశీల్దార్లు, సర్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గెల్ల వారి వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు



**ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం**

అమలాపురం పట్టణంలోని మద్దాల వారి పేటలో జరిగిన గెల్లా వారి వివాహ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందరావు.ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే , వారు తమ వైవాహిక జీవితంలో సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మెట్ల రమణబాబు. అల్లాడ శోంబాబు పార్టీ నాయకులు గెల్లా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అంబేద్కర్, జ్యోతిరావు పూలే మహనీయులు

**ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం**

భారత రాజ్యాంగ నిర్మాత,దళిత హక్కుల పరిరక్షకుడిగా, సామాజిక సమానత్వానికి పరిరక్షకుడిగా ప్రాతినిధ్య వహించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. ఈ మేరకు సోమవారం రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలపొలిటికల్ సైన్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు కె. రవిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. రామకృష్ణ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. వీరి ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే , డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సభను నిర్వహించారు. సామాజిక న్యాయం, సమానత్వం, విద్యా విస్తరణ కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు జ్యోతిరావు పూలే , డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. పూలే అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్య ప్రాచుర్యానికి విశేష కృషి చేశారు. సమాజంలో ఉన్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి సమానత్వ భావనను బలపరిచారని పేర్కొన్నారు. అదే విధంగా, డాక్టర్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా, దళితుల హక్కుల పరిరక్షకుడిగా, సామాజిక సమానత్వానికి ప్రాతినిధ్యం వహించిన మహానుభావుడు అని తెలియజేశారు. అదేవిధంగా పార్లమెంటులో 30 ఏళ్ల నిరీక్షణకు మహిళ సాధికారతలో ఒక నూతన అధ్యాయానికి నాంది ఏర్పడిందని ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచేసిన మోడ్రన్ కళాశాల ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ మహనీయుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సోదరభావం, న్యాయ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని వారు చూపిన మార్గాన్ని అనుసరించడం మనందరి బాధ్యత. ఈ సందర్భంగా అందరూ వారి స్ఫూర్తిని స్మరించుకుంటూ, సమాజాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వై. పద్మజ , డాక్టర్ ఎన్వి రమణ ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని మహనీయులకు ఘన నివాళిని అర్పించారు.




# క్రికెట్‌ను ఆస్వాదించండి... బెట్టింగ్లు వద్దు

## ఎస్సై రామకృష్ణ హెచ్చరిక

**ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి**

ఐపీఎల్ 2026 సీజన్ హోరెత్తుతున్న వేళ, క్రికెట్ ను కేవలం ఒక క్రీడగా ఆస్వాదించాలని, బెట్టింగ్ యాప్స్ ఊబిలో చిక్కుకోవద్దని తాళ్లపూడి మండలం యువతకు ఎస్.ఐ రామకృష్ణ పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు సోమవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ ఐపీఎల్ మ్యాచ్లు ప్రారంభమైన వెంటనే బెట్టింగ్ సిండికేట్లు క్రియాశీలమవుతాయని, యువత ఆర్థికంగా, మానసికంగా నాశనం కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. క్రికెట్ ఆడటం చూడండి, ఆనందించండి కానీ బెట్టింగ్ చేసి మీ జీవితాలను నాశనం చేసుకోవద్దు అని ఆయన విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం "సే నోటు బెట్టింగ్ యాప్స్' కార్యక్రమం ద్వారా వందలాది బెట్టింగ్ యాప్లపై నిషేధం విధించినా, సోషల్. మీడియా, టెలిగ్రామ్, వాట్సాప్ వంటి వేదికల ద్వారా నేరగాళ్లు మళ్లీ వలలు చేస్తున్నారని ఎస్సై తెలిపారు. డబ్బు కోసం ఈ తరహా అప్పులను ప్రమోట్ చేసే ఇన్ ఫ్లూయెన్సర్లు, సెలబ్రిటీలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెట్టింగ్ ఒక ప్రమాదకర వ్యసనం దేశవ్యాప్తంగా రోజుకు కోట్లాది మంది ఆన్లైన్ బెట్టింగ్లో నిమగ్నమవుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. ఐపీఎల్ సమయంలో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. యువత ఈ బెట్టింగ్ యాప్ ల బారిన పడి ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యలు, డిప్రెషన్ వంటి సమస్యలకు గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్లైన్ గేమింగ్ యాక్ట్, 2025 ను తీసుకువచ్చి, నగదు ముడిపడిన ఆన్లైన్ గేమింగ్లు (రియల్ మనీ గేమ్స్)ను నిషేధించింది. ఇప్పటివరకు వేలాది వెబ్సైట్లు, యాడ్లను బ్లాక్ చేసింది. అయినప్పటికీ, ఆఫ్ షోర్ ప్లాట్ఫామ్లు, సోషల్ మీడియా ద్వారా దందా కొనసాగుతోంది. మండలంలో ఎవరైనా బెట్టింగ్ చేస్తున్నట్లు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి అని ప్రజలను కోరారు. క్రికెట్ అనేది ఆనందం కోసం, వ్యసనం కోసం కాదు. యువత ముఖ్యంగా ఈ ప్రమాదకర యాప్ ల నుంచి దూరంగా ఉండి, క్రికెట్ ను స్వచ్ఛంగా అస్వాదించాలని విజ్ఞప్తి చేశారు. సే నో టు బెట్టింగ్ యాప్స్ బెట్టింగ్ గురించి ఏమైనా సందేహాలు ఉంటే లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా పోలీస్ స్టేషన్ కు తెలియజేయండి అన్నారు.




# తాగునీటి సమస్యపై ఫిర్యాదు వస్తే అధికారులపై కఠిన చర్యలు

- ఎమ్మెల్యే ఆనందరావు..
- పన్నుల వసూలు పూర్తి కావాలి
- గ్రామాల్లో మౌలిక వసతులపై ఎమ్మెల్యే ఆనందరావు కీలక ఆదేశాలు...
- అనధికార లే అవుట్లపై ఎమ్మెల్యే ఆనందరావు సీరియస్
- నిబంధనలు అతిక్రమిస్తే లీగల్ నోటీసులు తప్పవు!

**ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం**

నియోజకవర్గంలోని ఏ ఒక్క గ్రామంలోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదే నని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్పష్టం చేశారు. సోమవారం అమలాపురం పంచాయతీరాజ్ అతిథి గృహంలో పంచాయతీరాజ్ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు మరియు ఆర్.డబ్ల్యూ.ఎస్ అధికారులతో ఎమ్మెల్యే ఆనందరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారు ల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. గతంలో అధికారులు వారం వారం వచ్చి పరిపాలనపై వివరణ ఇచ్చేవారని, కానీ ప్రస్తుతం నెలకో సారి కూడా కనిపించడం లేదని మండి పడ్డారు. ప్రభుత్వం ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నప్పుడు, ఉద్యోగులు కూడా అంతే బాధ్యతగా ప్రజలకు సేవ చేయాలని హితవు పలికారు.ముఖ్యంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచు కుని తాగునీటి సరఫరా కు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని,జూన్15 వరకు కాలువలు మూసి వేసే అవకాశం ఉన్నందు న చెరువులను నీటితో నింపాలని ఆదేశించారు. నీటి సమస్య పరిష్కారా నికి అవసరమైన నిధుల కోసం15 రోజుల్లోగాహౌస్ టాక్స్ వసూలు పూర్తి చేయాలని, తాగునీటి విషయంలో తనకు ఒక్క ఫోన్ కాల్ వచ్చినా సంబంధిత కార్యదర్శే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరిం చారు. నియోజకవర్గం లోని పేరూరు, కామన గరువు,భట్నవిల్లి , బండారులంక వంటి అనేక గ్రామాల్లో ఉన్న అనధికార లేఅవుట్లపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా గతంలో ప్లాన్ అప్రూవల్స్ ఇచ్చిన కార్యదర్శుల డేటా సేకరించాలని, వారికి లీగల్ నోటీసులు పంపుతామని తెలిపారు. ఎల్ఆర్ఎస్ ద్వారా వచ్చే ఆదాయంలో 50 శాతం నిధులు తిరిగి పంచాయ తీలకే వస్తాయని, కాబట్టి ఎంపీడీవోలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి ఆదాయ వనరులను పెంచాలని సూచించారు.తాగునీటితో పాటు పారి శుధ్యం, విద్యుత్ సమస్య లపై కూడా అధికారులు అలసత్వం వహించ కూడదని ఎమ్మెల్యే కోరారు. దోమల నివారణ కు బ్లీచింగ్, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టాలని, విష జ్వరాలు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు. వీధి దీపాలు, వంగిపో యిన స్తంభాల సమస్య లను విద్యుత్ శాఖ అధికారులతో సమన్వ యం చేసుకుని వెంటనే పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా మ్యాన్ డేస్ టార్గెట్‌ను ఈ వేసవిలోనే పూర్తి చేయాలని, అలాగే ,సూర్య ఘర్, పథకం కింద ప్రతి ఇంటిపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచిం చారు. రానున్న లోకల్ బాడీ ఎన్నికల ఫలితాలు అధికారుల ప్రస్తుత పరిపాలనపైనే ఆధార పడి ఉంటాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. 15 రోజుల తర్వాత మళ్లీ సమీక్ష నిర్వహిస్తానని, అప్పటికి పన్నుల వసూ లు మరియు తాగునీటి పనులపై స్పష్టమైన నివేదికలతో రావాలని ఎమ్మెల్యే ఆనందరావు అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు , అమలాపురం మండల టిడిపి అధ్యక్షులు చొల్లంగి సాయిబాబు ఉప్పలగుప్తం మండల టిడిపి అధ్యక్షులు అరిగేలా నానాజీ , మరియు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.




# మధ్యాహ్న భోజనంపై అసంతృప్తి... పాఠశాల తనిఖీలో అధికారుల సూచనలు

**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

కృష్ణవరం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారులు శిలారపు హేబేలు, కొవ్వలి ఆనంద్ కుమార్‌లు వార్షిక తనిఖీలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల విద్యా ప్రగతి, పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల డైరీలను క్షుణ్ణంగా పరిశీలించి మొత్తం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంపై అసంతృప్తి వ్యక్తం చేసిన అధికారులు, ఆహార నాణ్యత మరియు నిర్వహణలో లోపాలున్నట్లు గుర్తించి సంబంధిత ఎండీఎం ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతులు, బోధన విధానాలను మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు. ఈ తనిఖీలో ప్యానెల్ సభ్యులు శోభన్ బాబు, అనురాధ, విజయదుర్గలు పాల్గొన్నారు.



## తుని నియోజకవర్గంలో అట్టహాసంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు

-భారీ ఏర్పాట్లు చేస్తున్న కూటమి శ్రేణులు...




**ప్రజాభూమి ప్రతినిధి-తుని**

వేదికగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలను తుని నియోజకవర్గంలో వాడవాడలా నిర్వహించాలని మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఆదేశించారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా కూటమి నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ విప్ శ్రీమతి యనమల దివ్య పర్యవేక్షణలో కూటమి శ్రేణులు బాబాసాహెబ్ అంబేద్కర్ కు ఘన నివాళులు అర్పించే కార్యక్రమాలు అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నారు.ఇక నియోజకవర్గ స్థాయిలో తుని పట్టణంలో అత్యంత అట్టహాసంగా నిర్వహణకు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు యినుగంటి సత్యనారాయణ ఆధ్వర్యంలో కూటమి దళిత నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అంబేద్కర్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసి ఎమ్మెల్యే శ్రీమతి యనమల దివ్య భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. అనంతరం గాంధీ సత్రంలో జరిగే అంబేద్కర్ జయంతి సభకు హాజరై కేక్ కట్ చేస్తారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే యనమల దివ్య ప్రారంభిస్తారు.గొల్ల అప్పారావు సెంటర్లో జరిగే అంబేద్కర్ జయంతి వేడుకల ఏర్పాట్లను సీనియర్ నేతలు యినుగంటి సత్యనారాయణ, యనమల లక్ష్మణరావు, పరవాద తాతబాబు, మోతుకూరి వెంకటేష్, కుక్కడపు బాలాజీ, దంతులూరి శ్రీనివాసరాజు, అల్లు రాజులతో పాటు దళిత నేతలు లంక సునీల్, బోడపాటి శ్రీను, కూరపాటి రఘు, సిద్ధాంతపు సత్తిబాబు, బోడపాటి అప్పారావు, సాకా సుభద్ర రావు, ఆరుగుల కృష్ణ, దిబ్బ గోవిందు, బోడపాటి షైరాబాన్, దాసరి నాగరాజు, బోడపాటి కిరణ్, బంగారు నాగేశ్వర్రావు లతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

## అంబేద్కర్ జీవిత చరిత్రను వివరించిన మాస్టర్ బడుగు




**ప్రజాభూమి ప్రతినిధి-అమలాపురం**

జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వన్నె చింతలపూడి సమనస నందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి కార్యక్రమాల అడబాల శ్రీనివాసరావు బడుగు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి విద్యాకమిటీ చైర్మన్ ఎలిపే ముత్యాల బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం పాఠశాల ఉపాధ్యా యిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొనగా గ్రామ పెద్దలు సమక్షము లో జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో పాఠశాల పూర్వ చైర్మన్ కుంచే వెంకటేశ్వరరావు వైస్ చైర్మన్ కే జగదాంబ రమేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్దేశించి అంబేద్కర్ యొక్క జీవిత విశేషాలు ఆయన పడిన కష్టాల గురించి ఆయన భారతదేశానికి చేసిన సేవ గురించి అలాగే బడుగు బలహీన వర్గాల కు ఆయన రాజ్యాంగ ద్వారా కల్పించిన హక్కుల గురించి ఆనాటి పరిస్థితులు నేటి పరిస్థి తులు తల్లిదండ్రుల యొక్క ఆర్థిక స్థితిగతు లు వివరించి విద్యార్థు లను ఉత్తేజ పరుస్తూ బడుగు సత్యనారాయణ అంబేత్కర్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు పాల్గొన్న అందరు కూడా ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించినందుకు పాఠశాల సిబ్బందిని అభినందించారు.

## ర్యాలి గ్రామ చివరిలో కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

-రూ.60 లక్షల ఆస్తి నష్టం

**ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.**



అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంచివరిలో -అంకంపాలెం రోడ్డులో ఉన్న ఒక కొబ్బరి పీచు (క్వాయిర్) ఫ్యాక్టరీలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పవన్ క్వాయిర్ ప్రోడక్ట్స్ పేరుతో రుద్రరాజు సూర్యనారాయణరాజు నిర్వహిస్తున్న ఈ కొబ్బరి పీచు ఫ్యాక్టరీలో మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగా యి. అక్కడ పనిచేస్తున్న సిబ్బంది, స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకపోయింది. దీంతో స్థానికులు అందించిన సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న కొత్తపే ట అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ఈ ప్రమాదం సంభ వించిందని, పీచుతో పాటు యంత్రాలు, ఇతర సామాగ్రి పూర్తిగా దగ్ధం కావడంతో సుమారు రూ.60 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని కొత్తపేట ఇన్చార్జి ఫైర్ ఆఫీసర్ మహేష్ శంకర్ తెలిపారు.

## ప్రజలకు అందించే త్రాగునీరు ఇదేనా?

-స్వచ్ఛత నీ చిరునామా ఎక్కడ?

**ప్రజాభూమి ప్రతినిధి-పెదపాడు.**



ఏలూరు జిల్లా పెదపాడు మండలం గోగుంట గ్రామంలో ప్రజలు తాగే మంచినీటి పైపు దుస్థితి దయనీయంగా ఉంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో అధికారులకు నాయకులకు పట్టలేదా. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తా అన్న ప్రకటనలు చెప్పడానికే తప్ప ఆచరణలో చేసింది ఏమీ లేదు విధంగా గ్రామంలో దర్శనమిస్తుంది. పంపుచుట్టు బురద, ఎన్ని ఇబ్బందులు అయినా ఆ నీరే త్రాగునీరు.ప్రజలకి తాగునీరు అందించాల్సిన అధికారులు రోడ్డు పక్కన ఉన్న మంచినీటి కుళాయి దుస్థితి ఎవరికి పట్టనట్టుగా గ్రామంలో దర్శనమిస్తుంది.అక్కడ ప్రజలు ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదు అన్న వాదనలు కూడా వినపడుతున్నాయి. గ్రామంలో అధికారులు వచ్చి పోయే దారిలో ఉన్న సమస్యను వివరించిన పట్టించుకున్న దాఖలాల శూన్యం అని స్థానికులు చెబుతున్నారు. మంచినీరు పట్టుకోవాలంటే అక్కడ ప్రజలు పడే బాధలు ఇకనైనా అధికారులు గుర్తించి మంచినీరు సరఫరా చేసే కుళాయిని పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

ప్రజాభూమి

జనరల్ 14

మంగళవారం 14, ఏప్రిల్ 2026

## ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుంది

- ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి - ఏలూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. టిడ్కో గృహాలకు డీడీలు కట్టిన వారికి ఈ నెలాఖరున ఆ సొమ్మును తిరిగి చెల్లించడం జరుగుతుందని చెప్పారు. ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందజేశారు. ప్రతి ఒక్క సమస్యను సావధానంగా విన్న ఎమ్మెల్యే బడేటి చంటి.పూర్తి వివరాలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. అలాగే పలువురు లబ్ధిదారులు టిడ్కో గృహాలకు తాము డీడీలు తీసామని, దానికి సంబంధించిన సొమ్ములు చెల్లించాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేవిధంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్ లో అన్ని వర్గాల ప్రజలకు మరిన్ని మేళ్ళు చేకూర్చేలా సంక్షేమ పథకాలను అమలుచేయనున్నట్లు తెలిపారు.

## నీటి వనరుల సంరక్షణపై దృష్టి

### ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఎంపీడీఓ ఆదేశాలు

ప్రజాభూమి ప్రతినిధి - ఆగిరిపల్లి



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచనల మేరకు భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించడం, నీటి వనరుల సంరక్షణ, సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఆగిరిపల్లి మండలంలో చర్యలు వేగవంతమయ్యాయి. ఈ నేపథ్యంలో సోమవారం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) అబ్దుల్ సలాం మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేస్తూ, ప్రభుత్వం సూచించిన యాప్‌లను తమ మొబైల్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని, ఫోన్ నంబర్ల ఆధారంగా గ్రామాల పరిధిలో ఉన్న వాటర్ ట్యాంకులు, మంచినీటి చెరువులు తదితర నీటి వనరుల పూర్తి వివరాలను సేకరించాలని తెలిపారు. సేకరించిన సమాచారాన్ని సమయానికి మండల ఏపీవో, ఇరిగేషన్ ఏఈ అధికారులకు అందజేయాలని, మరమ్మతులు అవసరమైన వనరులను గుర్తించి నివేదికలు సమర్పించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, గ్రామాల్లో ఫీల్డ్ విజిట్‌లు నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని, ఎక్కడైనా సమస్యలు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. పనుల్లో పారదర్శకత, బాధ్యతాయుత విధానాన్ని పాటిస్తూ ప్రభుత్వ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీడీఓ అబ్దుల్ సలాం ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు.

## నవోదయం-2.0లో కఠిన చర్యలు: 13 మందికి బైండ్ ఓవర్, బెల్ట్ షాపులపై కేసులు హెచ్చరిక



ప్రజా భూమి ప్రతినిధి - నూజివీడు

నూజివీడు ప్రొహిబిషన్ ఓ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నవోదయం--2.0 కార్యక్రమంలో భాగంగా పాత నేరస్తులు 13 మందిని చాట్రాయి తహసిల్దార్ ఎదుట హాజరుపరచి ఒక సంవత్సరానికి బైండ్ ఓవర్ చేశారు. ఈ కాలంలో మళ్లీ ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే ఒక్కొక్కరిపై రూ.1 లక్ష జరిమానా విధించడంతో పాటు ప్రభుత్వ పథకాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆగిరిపల్లి, నూజివీడు, ముసునూరు, చాట్రాయి మండలాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడం, నాటు సారా తయారీ, విక్రయం, నిల్వ నేరమని స్పష్టం చేశారు. నాటు సారా తయారికి బెల్లం సరఫరా చేసే వ్యాపారులు, బెల్లపు ఊటలు కలిగిన భూయజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

## అమ్మ పేరు మీద చలివేంద్రం ఏర్పాటు



ప్రజా భూమి ప్రతినిధి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి గ్రామంలో బస్టాండ్ సమీపంలో చికెన్ వ్యాపారి భాష తన తల్లి పేరు మీద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని ఆగిరిపల్లి ఏఎస్ఐ నాయక్ ప్రారంభించి, ఈ మంచి కార్యక్రమాన్ని అభినందించారు. ఈ సందర్భంగా వేసవి కాలంలో ప్రయాణికులకు, స్థానికులకు చల్లని తాగునీరు అందించే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగకరమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మడుపల్లి గోపాల్, షేక్ రంజాని, రమేష్, ఇమామ్ కలాం, నజీర్ భాష తదితరులు పాల్గొని, అమ్మ పేరు మీద చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన చికెన్ భాషను అభినందించారు. గ్రామ ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ, భాష సేవాభావాన్ని కొనియాడారు.

# అంబేద్కర్ విగ్రహాల వద్ద సీసీ కెమెరాలు

### నూజివీడు టౌన్‌లో పటిష్ట నిఘా

ప్రజాభూమి ప్రతినిధి - నూజివీడు




డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని నూజివీడు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న అంబేద్కర్ విగ్రహాల వద్ద పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. పట్టణ ఇన్‌స్పెక్టర్ సత్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన హైడెఫినిషన్ సీసీ కెమెరాలను ప్రారంభించారు. విగ్రహాల వద్ద అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, నిరంతరం పర్యవేక్షణ కోసం ఈ కెమెరాలను ఏర్పాటు చేయగా, పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి నిఘా కొనసాగుతుంది. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలుగా వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విగ్రహ కమిటీ సభ్యులు పోలీసులతో సమన్వయం చేసుకుని పరిసరాల్లో వెలుతురు ఏర్పాట్లు చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా విగ్రహాలకు నష్టం కలిగించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లాలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు ఆన్లైన్ ద్వారా ప్రజలకు అందుబాటులో

### సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం పెంచాలి-జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.

ప్రజా భూమి ప్రతినిధి - ఏలూరు జిల్లా



ప్రకృతి సేద్యం ద్వారా పండించిన వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సూచించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో సోమవారం ప్రకృతి సేద్యం ద్వారా పండించిన వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సౌకర్యాలపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ప్రకృతి సేద్యం ద్వారా పండించిన వ్యవసాయ ఉత్పత్తులను "వెబ్ సైట్" ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచామని, ఈ వెబ్‌సైట్ ద్వారా ఏలూరు జిల్లా రైతులు సహజ విధానాల్లో పండించిన వ్యవసాయ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందించేందుకు ఒక వేదికగా పనిచేస్తుందన్నారు. జిల్లాలో సహజ వ్యవసాయ ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని, అందరూ ఈ వేదికను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ముందుగా జిల్లాలోని అధికారులందరూ 'వెబ్‌సైట్'ను తప్పనిసరిగా సందర్శించి, అందులో లభ్యమయ్యే సహజ వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడమే కాకుండా, వినియోగదారులకు నాణ్యమైన సహజ ఉత్పత్తులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.కె. హబీబ్ బాషా, జిల్లా ఉద్యానవన అధికారి, పీడీ డీఆర్‌డీఏ, పీడీ ఏపీఎంఐపీ, పీడీ మెప్మా తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా పంచారామం అన్న సమారాధన

- ఈవో ముచ్చర్ల, చైర్మన్ మీసాల పర్యవేక్షణలో పదివేల మంది భక్తులకు అన్న ప్రసాదం
- చక్కా వారి సౌజన్యంతో ఏడు వేల మందికి ఐస్క్రీములు పంపిణీ



ప్రజాభూమి ప్రతినిధి - పాలకొల్లు

స్థానిక పంచరామ పుణ్యక్షేత్రంలో వేంచేసియున్న శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవాల సందర్భంగా సోమవారం ఆలయ కార్య నిర్వహణ అధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు ధర్మకర్తల మండలి చైర్మన్ మీసాల రామచంద్రరావు పర్యవేక్షణలో అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలు సుమారు పదివేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని సేకరించారు. అదేవిధంగా చక్కా వారి సౌజన్యంతో సుమారు 7000 మంది భక్తులకు ఏర్పాటు చేసిన ఐస్ క్రీమ్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘసంస్కర్త, విశ్రాంత ఎస్బిఐ అధికారి డాక్టర్ కాలనాధభట్ల సుధీరమణ (సుధీర్) పుట్టినరోజు సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్న సమారాధన, ఐస్ క్రీమ్ పంపిణీ కార్యక్రమంలో తమ మిత్రులతో కలిసి భక్తులకు విశిష్ట సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ యడ్ల దుర్గాకిషోర్, పట్టణ సీఐ కోలా రజనీకుమార్, ఆలయ సూపరింటెండెంట్ పసుపులేటి శ్రీనివాసు, సీనియర్ అసిస్టెంట్ చిట్టూరి గాంధీ, ధర్మకర్తల మండలి సభ్యులు ఉప్పలపు దుర్గా పెద్దిరాజు, కొండ్రెడ్డి సూరిబాబు, పినిశెట్టి శ్రీనివాస్, నాలం సురేఖ, హోత ప్రవాళ, ప్రోత్సాహకులు చక్కా ప్రభాకర రావు కుమారుడు మాణిక్య కుమార్, భాస్కరరావు కుమారుడు శ్రీధర్, డాక్టర్ కాలనాథభట్ల సుధీర్ ( ఎస్బిఐ ), సంఘప్రముఖులు పెనుమాక రామమోహనరావు, చుండూరి శ్రీ రంగనాయుడు, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, జక్కంపూడి మదన్, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, కర్నేన గౌరు నాయుడు, తులా రామలింగేశ్వరరావు , శిడగం సురేంద్ర, పాలకొల్లు ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి ఎం ఎన్ వి సాంబశివరావు, హోమ్ గార్డ్స్ కంపెనీ కమాండర్ పోలీస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి. బిజెపి కార్యవర్గ సమావేశంలో అడబాల

ప్రజాభూమి ప్రతినిధి - అమలాపురం




డా.బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక అశోక్ నగర్ లో ఉన్న ప్రెస్ క్లబ్ హాల్ లో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు అడబాల సత్యనారాయ ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోనల్ ఇంచార్జి సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) గురించి వివరించారు. ప్రతీ పోలింగ్ బూత్ లో బీఎల్ఏ-2 లను నియమించాలని సూచించారు. అలాగే ఈ నెల14 మంగళవారం అంబేద్కర్ జయంతి ఉత్సవాలు అంబేద్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని నాయకులకు సూచించారు. ప్రతీ గ్రామంలో ఉన్న నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ వేడుకల్లో పాల్గొనాలని తెలిపారు. అలాగే పార్టీ నిర్వహించే కార్యక్రమాలు జనతా వారధి, మన్ కీ బాత్, చేరువ, మన ఊరు మన జెండా కార్యక్రమాలు ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, జిల్లా ప్రధాన కార్యదర్శులు చీకరమిళ్ళి శ్రీనివాస రావు, కొపనాతి దత్తాత్రేయ, సీనియర్ నాయకులు ఆర్వీ నాయుడు, పలువురు జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పరిధిలో ప్రత్యేక దాడులు



ప్రజాభూమి ప్రతినిధి - నూజివీడు

నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పరిధిలోని నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో ప్రత్యేక దాడులు నిర్వహించి అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. ఇప్పటివరకు స్టేషన్ పరిధిలో 132 కేసులు నమోదు చేసి, 132 మందిని అదుపులోకి తీసుకోవడంతో పాటు 1227 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, 73 మంది బెల్ట్ షాపు నిర్వాహకులను బైండోవర్ చేశారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతూ, పునరావృత నేరాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఏ. మస్తానయ్య తెలిపారు.

## అన్నా క్యాంటీన్‌పై ఆకస్మిక తనిఖీ

### నాణ్యత, పరిశుభ్రతపై సబ్ కలెక్టర్ కఠిన ఆదేశాలు



ప్రజా భూమి ప్రతినిధి - నూజివీడు

నూజివీడు పట్టణంలోని ఆర్ఆర్‌పేటలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో అందిస్తున్న ఆహార నాణ్యత, పరిశుభ్రత, వంట విధానాలు, నిర్వహణ పద్ధతులను సవివరంగా పరిశీలించారు. వడ్డిస్తున్న ఆహారం మెనూ ప్రకారం సరఫరా అవుతోందా, రుచి మరియు నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో పరిశుభ్రతను నిరంతరం పాటిస్తూ, ఆహారాన్ని సమయానికి మరియు నాణ్యతతో అందించాలని సిబ్బందికి ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు.

# విజయవంతంగా ముగిసిన లయన్స్ విజయపథం

- 20వ జిల్లావార్షికోత్సవ వేడుకలలో 650 మంది హాజరు
- జిల్లా గవర్నర్ పాపారావు నాయుడు దంపతులకు ఘన సత్కారం

ప్రజాభూమి ప్రతినిధి - పాలకొల్లు




విజయపథం పేరుతో నిర్వహించిన 20వ జిల్లా వార్షికోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి. లయన్స్ జిల్లా గవర్నర్ ఎన్. వివిఎస్ పాపారావునాయుడు, జిల్లా ఫస్ట్ లయన్ లేడీ ఎన్ఏ అన్నపూర్ణ (అరుణ) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డు శ్రీ రామచంద్ర గార్డెన్స్ నందు నిర్వహించిన వేడుకలకు ముఖ్యఅతిధిగా లయన్స్ అంతర్జాతీయ డైరెక్టర్ పర్వతినేని సుభాష్ బాబు హాజరయ్యారు, అతిథులుగా మల్టిపుల్ కౌన్సిల్ చైర్పర్సన్ మేకా శ్రీరామ్ సురేష్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, తాజా మాజీ గవర్నర్ కాకర్ల వేణుబాబు, వైస్ జిల్లా గవర్నర్లు డాక్టర్ డి.సుబ్బారావు, ఆర్ వి ఎస్ సూర్యనారాయణ రాజు తదితరులు హాజరయ్యారు. జిల్లా గవర్నర్ పాపారావునాయుడు విజ్ఞప్తి మేరకు ముఖ్య అతిథులతో పాటు తమ పరిధిలోని 80 క్లబ్బుల నుండి హాజరైన సుమారు 650 మంది లయన్స్ ప్రతినిధులకు, ప్రముఖులకు ముందుగా ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్ డాక్టర్ డి. సుబ్బారావును రాబోయే 2026- 27 సంవత్సరానికి గాను జిల్లా గవర్నరుగా సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు. అదేవిధంగా సెకండ్ వైస్ జిల్లా గవర్నర్ ఆర్ వి ఎస్ సూర్యనారాయణరాజును జిల్లా ఫస్ట్ వైస్ గవర్నరుగా తీర్మానించారు. వి.సత్య స్వరూప్ ను జిల్లా రెండవ వైస్ గవర్నరుగా ఆమోదించారు. ఈ వేడుకల్లో పూర్వపు జిల్లా గవర్నర్లు కృష్ణంరాజు, వేమ కోటేశ్వరరావు, గట్టిం మాణిక్యాలరావు, దామెర రంగారావు, కిషోర్ కుమార్, డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ రావు, మురళి మోహన్‌రావు, కొత్తపల్లి రవికుమార్, ఎం వి ఎస్ రాజు, కోటేశ్వరరావు, బాబుజీరావు, ఏపూరి సత్యనారాయణ, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, క్యాబినెట్ ప్రతినిధులు శ్రీకాకుళం కామేశ్వరరావు, కారుమూరి రామలింగేశ్వరరావు, ముచ్చర్ల సత్యనారాయణ, రీజియన్ చైర్ పర్సన్స్ నందుల రమణి, కృష్ణంరాజు, శ్రీనివాస్, గోపాల్, నారాయణ, రత్నకుమారి, గౌరీ రావు తదితరులతో పాటు వివిధ క్లబ్బుల ప్రతినిధులు, సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కేబి ఫణీంద్రుడు సభా కార్యక్రమాన్ని నిర్వహించగా పాలకొల్లు, ఫెమినా, రూరల్ లయన్స్ క్లబ్ ప్రతినిధులు శిడగం సతీష్, దోనెల ప్రసాద్, దేవరపు ప్రసాద్, రేపాక దీప్తి, డాక్టర్ కావలి మౌని, దోనెల మౌనిక, చవ్వా సతీష్ కుమార్, పద్మాంజలి, కారుమూరి రామకృష్ణ, పీఎన్డి వరప్రసాద్, కొమ్ముల మురళీకృష్ణ, డాక్టర్ జయభారతరెడ్డి, నందుల సీతారామారావు పాల్గొన్నారు.